# సర్వజ్ఞ

జి. లక్ష్మీ నారాయణ



భారతీయ
సాహిత్య

TL
891.481 410 92
Sa 77 P

Sa 77 P

INDIAN INSTITUTE
OF
ADVANCED STUDY
LIBRARY, SHIMLA





అట్టలోపలివైపున అచ్చు వేసిన శిల్పంలో కనబడేది శుద్ధోదన మహారాజుకు గౌతమ బుద్ధుని తల్లియైన మహారాణి మాయాదేవి కన్న స్వప్నం గురించి జ్యోతిష్కులు వ్యాఖ్యచేస్తూ ఉండిన దృశ్యం. వారికి దిగువ వారి వ్యాఖ్యను వ్రాసుకుంటున్న లేఖకుడు కనిపిస్తాడు. భారతదేశంలో లేఖన కళ చిత్ర శిల్పంలో నిబద్ధమై లభించే దృష్టాంతాలలో ఇదే ప్రాచీనమైనది.

నాగార్జున కొండ క్రీ.శ. 2వ శతాబ్దం.

(జాతీయ పురావస్తు ప్రదర్శనశాల, న్యూఢిల్లీవారి సౌజన్యంతో)

భారతీయ సాహిత్య నిర్మాతలు

# సర్వజ్ఞ


ఆంగ్లమూలం

కె. బి. ప్రభుప్రసాద్

అనువాదం

జి. లక్ష్మినారాయణ



సాహిత్య అకాడెమి

Sarvajna - Telugu Translation by G.Lakshminarayana of K.B. Prabhu Prasad's Monograph in English. Sahitya Akademi, New Delhi, 2000, Rs. 25/-

© Sahitya Akademi
First Published 2000
ISBN - 81- 260 - 0703 - 6

సాహిత్య అకాడెమీ
రవీంద్ర భవన్, 35, ఫెరోజ్‌షా రోడ్, న్యూఢిల్లీ - 110001

విక్రయ విభాగము :
'స్వాతి' మందిర్ మార్గ్, న్యూఢిల్లీ-110001

జీవన్‌తారా భవనము, 4వ అంతస్తు, 23A/44x
డైమండ్ హార్బర్ రోడ్, కలకత్తా-700053

172, ముంబయి మరాఠి గ్రంథ సంగ్రహాలయ మార్గ్,
దాదర్, ముంబయి - 400014

గుణా బిల్డింగ్, 304-305, అన్నాసాలై,
తేనాంపేట, చెన్నై-600018

సెంట్రల్ కాలేజ్ క్యాంపస్,
డా.బి.ఆర్. అంబేడ్కర్ వీధి, బెంగళూరు-560 001

Library IIAS, Shimla
TL 891.481 410 92 Sa 77 P
00117709

రూ.25-00

117709
20/12/04
SHIMLA

TL
891.481 410 92
Sa 77 P

Laser Typeset at : MAP Systems, Bangalore.
Printed at : Ananya Publications, Bangalore.

# ముందుమాట

భారతీయ సాహిత్య నిర్మాతల శీర్షిక క్రింద పై పుస్తకం వ్రాయడానికి అంగీకరించినప్పుడు, అదెంత కష్టమైనపనో మొదట్లో నాకు అర్థంకాలేదు. విషయ సేకరణ మొదలు పెట్టాక అర్థమైంది.

మొదటి కష్టం, సర్వజ్ఞుని జీవితానికి సంబంధించి, విశ్వసనీయమైన సమాచారం సేకరించడం. లభించే సమాచారం చాలా తక్కువ. అదికూడా చారిత్రక సాక్ష్యాలకంటె కథలమీద, కల్పనలమీద ఆధారపడిందే ఎక్కువ. చిత్రమేమిటంటే, సర్వజ్ఞుడెంత ప్రసిద్ధికెక్కినా, ఆయనసమకాలికులు కాని, అనంతరీకులు కాని ఆయనను గురించి ఏప్రస్తావనా తమ రచనలలో చేయలేదు. ఆయన త్రిపదులను సేకరించి, సంకలన పరచినవారు కూడా, ఆయన జీవితాన్ని గురించి ఏమీ చెప్పలేదు.

అందువల్ల ఆయన జీవితంగురించి వ్రాస్తున్నప్పుడు, మొదటి పధ్నాలుగు జీవిత సద్యాలమీద (వాటి విశ్వసనీయత ప్రశ్నార్హమే; అవికూడా ప్రక్షిప్తాలు కావచ్చు), ఆంతరంగిక సాక్ష్యాలుగా పనికివచ్చే మరికొన్ని ఇతర పద్యాలమీద ఆధారపడి నా అభిప్రాయాలకు రూపకల్పన చేసికొన్నాను.

ఆయన పద్యాలకు సంబంధించిఉన్న ఒకే ఒక సమస్య - ప్రక్షిప్తాలనుండి అసలైన వాటిని వేరుచేసి చూడ్డమే.

సర్వజ్ఞుని వచనాలను ఆధునిక గ్రంథరూపంలో అందించిన మొదటి ప్రచురణ, 1868లో జర్మన్ మిషనరీ, రెవ. ఫాదర్ వర్త్ వెలువరించినది. అందులో దాదాపు మూడు వందల పద్యాలున్నాయి. ఆ తర్వాత సర్వజ్ఞుని సంపూర్ణ వచనాలను రెవ.ఉత్తంగి చన్నప్పగారు 1924లో ప్రకటించారు. ఈ విషయంలో, రెవ. చన్నప్పగారు చేసిన సేవలకు కన్నడ పాఠకులు శాశ్వతంగా ఋణపడిఉన్నారు. మారుమూల చీకటి గదుల్లో పడిఉన్న

వ్రాతప్రతుల్లోనూ, బజారుగుజిలీ ప్రతుల్లోనూ దొరుకుతున్న సర్వజ్ఞని వచనాలన్నిటినీ ఒక్కటిగా సేకరించి, పరిష్కరించి, సంకలన పరిచారు. మంచి స్ఫూర్తినిచ్చే సుదీర్ఘమైన పీఠికను వ్రాశారు. ఆ ప్రచురణవల్ల ప్రజల్లో సర్వజ్ఞని వచనాలపట్ల అభిరుచి మళ్లీ పెంపొంద సాగింది. తొలి ప్రచురణలో 1928 త్రిపదులుండగా, పరివర్ధిత ద్వితీయ ప్రచురణలో 2100 త్రిపదులు చోటుచేసికొన్నాయి. మైసూరు విశ్వవిద్యాలయం సేకరించిన తాటియాకు ప్రతి ఆధారంగా 'పరమార్థ' ప్రచురణ వెలువడేదాక ఉత్తంగి ప్రచురణే ప్రామాణికమైన ప్రచురణగా ఆదరణ పొందింది. మైసూరు విశ్వవిద్యాలయ 'పరమార్థ' ప్రచురణకు ప్రముఖ పరిశోధకుడూ, అనేక పరిశోధన కృతులను వెలువరించిన సుప్రసిద్ధ విద్వాంసుడూ, కన్నడ సాహిత్యాచార్యుడూ డా. ఎల్. బసవరాజుగారు సంపాదకత్వం వహించారు. డా॥ బసవరాజుగారు ప్రతి పద్యానికీ పాఠాంతరాలను ఇవ్వడమేగాక, వాటిని విశ్లేషించి తనకున్న ఆధారాలతో ప్రామాణిక రూపాన్ని పరిష్కరించి చూపారు. ఉత్తంగి ప్రచురణలో దొర్లిన పొరబాట్లను ఎత్తిచూపారు. సర్వజ్ఞని ప్రామాణిక రచనలుగా ఎన్నదగ్గ 948 + 54 త్రిపదులు ఇందులో ప్రకటితమయ్యాయి.

ఇతర ప్రచురణల్లో కనిపించని ఆశ్చర్యకరమైన, ఆసక్తికరమైన ఒక విశేషం ఇందులో ఉంది. ప్రతి త్రిపది చివరి చరణంలోనూ చివర 'అంకితనామం'గా 'సర్వజ్ఞ' శబ్దం సామాన్యంగా మిగిలిన వ్రాతప్రతులన్నిటిలోనూ కనిపిస్తుండగా, ఇందులో 'పరమార్థ' అనే రూపం కనబడుతుంది. ఈ అంకితనామమున్న వ్రాతప్రతి ఇదొక్కటే. దీనివల్ల సర్వజ్ఞుడు వాడిన అసలు అంకిత నామమేమిటన్న వివాదం ఉత్పన్నమైంది. 'పరమార్థ' రూపమే అసలైన ప్రామాణిక రూపమని పేర్కొన్నప్పటికీ, వాటికి సర్వజ్ఞుడేకర్త అనే విషయంలో డా॥ బసవరాజుగారు విభేదించలేదు.

సరైన అంకితనామం 'సర్వజ్ఞ' నా? 'పరమార్థ' నా ? అనే విషయం ఎలాగున్నా, ఈ త్రిపదుల కర్త సర్వజ్ఞుడే అన్నదాంట్లో అభిప్రాయభేదం లేదు.

డా॥ బసవరాజుగారు పరిష్కరించిన పద్యరూపాలనే నేను ఎక్కువగా వాడుకొన్నాను. అయితే అంకితనామంగా -మకుటంగా- అందరూ ఆమోదించిన 'సర్వజ్ఞ' రూపాన్నే స్వీకరించాను.

నాకు ఎదురైన మరో కష్టం, వీటిని ఆంగ్లంలోకి అనువదించడం. ముప్పయిల తొలిపాదంలో రెవ. చన్నప్పగారు చేసిన ఆంగ్లానువాదాలు కాని, ఆ తరువాత డా॥ వి.కె. గోకాక్‌గారు చేసిన అనువాదాలు కానీ లభించలేదు. వ్యాసాలలోనో, పుస్తకాలుగానో వెలువడ్డ

ఒకటి రెండు ఇతర అనువాదాలు నాకు సంతృప్తిని కలిగించలేదు. అందుచేత నా అభిప్రాయాలకు తార్కాణాలుగా సర్వజ్ఞ త్రిపదులను చూపవలసివచ్చినప్పుడు, నేనే స్వేచ్ఛగా ఆంగ్లంలోకి అనువదించుకొన్నాను. వాటిల్లో ఏవైనా లోపాలుంటే బాధ్యత పూర్తిగా నాదే.

ఈ రచనా సందర్భంగా వివిధ అంశాలపై చర్చిస్తున్నప్పుడు డా॥ వి.కె. గోకాక్‌గారు, డా॥ ఎల్. బసవరాజుగారు, డా॥ ఎం. అక్బర్ అలీ గారు నాకు సర్వజ్ఞుడు బాగా అర్థమయ్యేలా చేశారు. ఆప్యాయతతో మనసువిప్పి, విలువైన సలహాలనిచ్చారు. వారికి ఎంతో ఋణపడివున్నాను. వారిచ్చిన సలహాలను ఈ రచనలో వినియోగించుకొన్నాను. డా॥ ఎల్. బసవరాజు, డా॥ జి.ఎస్. శివరుద్రప్ప, డా॥ హెచ్. తిప్పేరుద్రస్వామి, డా॥ ఎం. అక్బర్ అలీ, శ్రీ చెన్నవీరకణవిగార్లు ఎంతో ఓపికతో ప్రారంభంలోని కొన్ని ప్రకరణాలను విని, అదే శైలిలో కొనసాగించమని ప్రోత్సహించారు. వారికి కృతజ్ఞతలు. నాఆప్త మిత్రులైన శివరుద్రప్పగారి సూచనమేరకు, ఈ రచనను క్రొత్త పద్ధతిలో ప్రారంభించాను. వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే సర్వజ్ఞుని సామాజిక దృక్పథం' మీద డా॥ అక్బర్ అలీగారి డాక్టరేట్ సిద్ధాంత గ్రంథం సర్వజ్ఞ వచనాలను అర్థంచేసికోవడంలో నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఆయనకు నా ప్రత్యేక కృతజ్ఞతలు.

నా రచనకు తుది మెరుగులు దిద్దడంలో సాయపడ్డ శ్రీమతి ప్రభావతీకృష్ణమూర్తిగారికి, అందంగా టైపుచేసిన శ్రీరఘునాథకు నాకృతజ్ఞతలు. టైపు ప్రతిని దిద్దడమేగాక, ఈ రచనను మరింత మెరుగుపరచడంలో నాసోదరుడు సదానంద చూపిన అభిమానాన్ని నేను మరచిపోలేను.

మహాకవియోగి సర్వజ్ఞుని గురించి విపులంగా చదువుతూ నేను పొందిన ఆనందం, అనుభవం అనన్యమైనవి. ఆయనకు సాష్టాంగ ప్రమాణాలర్పిస్తున్నాను. ఆయన నిజమైన విశ్వపౌరుడు. కవిత్వం కంటె జీవితం గొప్పదనుకొనే అలాంటి కవిపుంగవులు, అన్ని దేశాలకు అన్ని కాలాలకు సంబంధించినవారే. సార్వజనీనమైన మానవమౌల్యాలను, మానవ మహత్తును చాటుతూ, సహ ప్రాణులపట్ల కారుణ్యంతో, సేవాదృక్పథంతో ఆత్మవివేకం సాధించడమే జీవితలక్ష్యమని మానవ జాతికి ప్రబోధించే అలాటి మహనీయుని సందేశం ప్రపంచానికంతా చాటి వినిపించతగింది. సుసంపన్నమైన ఆయన అనుభవపూర్వక జ్ఞానం మానవ జాతికి మార్గదర్శకం కావాలి.

మైసూరు. కె.బి. ప్రభుప్రసాద్

1.8.84

# లోపుటల్లో


ముందుమాట

1. సంచారయోగి 11

2. విశ్వేశ్వర ప్రసాదం 18

3. సహజకాంతుల్లో జీవితం 31

4. త్రిపదుల్లో బ్రతుకు బరువు 36

5. జీవించడంలో విశేషం 39

6. మౌలికతాముద్ర 55

7. నైతిక ప్రబోధ సంప్రదాయంలో 58

8. జీవితం కోసం కళ 65

ఆధారగ్రంథ సూచి 74

# సంచారయోగి

ఏడాది అంతటికి ఆరోజు ఆహ్లాదకరమైన రోజు. ఆయనకు అన్నిరోజులూ ఆహ్లాదకరమైనవే. ఆయన మనసులో ఎప్పుడూ శివునిపై ఆలోచనలు. ప్రకృతి ఆనందాలు అల్లుకొని ఉంటాయి. ఆరోజు అడవుల సుగంధం, పచ్చటి పంటపొలాల పరిమళం దట్టంగా వ్యాపించి ఉన్నాయి. ఎడతెగని కాలిబాట ఇంకా కొనసాగుతూనే ఉంది.... ఎంతోదూరం నుండి నడచి వస్తున్నాడు. అయినా అలసిపోలేదు. సమంగా అడుగులువేస్తూ, మహారాజ ఠీవితో నడచి వస్తున్నాడు. అతనికి నడకంటే ఎంతోఇష్టం. ఎలాటి దారైనా సరే, అందంగా మలుపులు తిరిగి, ప్రతి మలుపులోనూ అద్భుతమైన అందాలను పొదువుకొన్నదైనా సరే. ఎగుడు దిగుళ్లతో ఎంతో శ్రమకు గురిచేస్తూ బీడుభూముల్లో సాగిపోయేదైనా సరే..... విశాలమైన ఆరుబయళ్లంటే ఆయనకు ప్రాణం. అయితే ఆయనకు ఒంటరితనం ఇష్టంకాదు. జనసందోహాలు ఆయనకు చాలా ప్రియమైనవి. సామాన్యంగా ఆయనవేసే సుదీర్ఘ ప్రయాణాలు ఎక్కడో ఓచోట, ఓగ్రామంలోని గుడివద్దో, మఠంవద్దో ఆగిపోతుంటాయి. అక్కడ ఒకటిరెండు రోజులు ఆగుతాడు. ఒక్కొసారి వారం రోజులైనా కావచ్చు. ఇదమిద్ధంగా ఇంతకాలమని చెప్పలేం.

ఆయన ఊళ్లోకి అడుగు పెట్టగానే, ఇరుకైన ఆ వంకరటింకర సందుల్లో జనం కమ్ముకుపోయి దండాలు పెడుతుంటారు. ఎన్నో ఏళ్లపిమ్మట ఆయన్ను చూస్తున్నారు. అయినా ఆయన ఎప్పట్లాగే ఉన్నారు. అదే ముండిత శిరస్సు, అదే వర్చస్సు నిండిన ముఖం, కళ్లు, ఓచిన్న ధోవతి, భుజం మీద వేలాడే కంబళి, అవే ఆయన ఉడుపులు. ఓ చేతిలో భిక్షాపాత్ర, మరోచేతిలో గట్టి కర్ర. మందకు దూరమైన గజరాజు ఎంత స్వేచ్ఛగా ఉంటాడో, ఆయనా అంత స్వేచ్ఛగా ఉన్నాడు.

ఆయనతో గడపాలంటే పిల్లలకు ఎంతో సంబరం. అందమైన కథలు, దూర దూర దేశాల వింతలు ఎన్నో చెబుతాడు. కొండలు, లోయలు, నదులు, అరణ్యాల

పాటల్ని వినిపిస్తాడు. చిన్నా పెద్దా అందరికీ ఆయన సాంగత్యమంటే అంతులేని ఇష్టం. ఆయన మాటలు వాళ్లను మంత్రబద్ధులను చేస్తాయి. అందులో కావలసినంత హాస్యమూ, చమత్కారమూ కుర్రాళ్లను ఆకర్షిస్తుంది. అనంతమైన జ్ఞానం పెద్దలను అలరిస్తుంది. ఆయన మాటలంటే వాళ్లకు వల్లమాలిన అభిమానం. ఆయన పట్నవాసం పండితుడు కాడు. ఆయన మాటల్లో వాళ్లకు తమ హృదయమే పలుకుతున్నట్లనిపిస్తుంది. ఆచిన్న చిన్న మాటలు, చక్కటి విరుపుతో ఉండే ఆతియ్యని నుడులు వాళ్ల మనస్సుకు హత్తుకు పోతాయి. ఎప్పటికీ జ్ఞాపకముండి పోతాయి. ఆయన తను ఊరు వదలి వెళ్లి ఎంతకాలమైనా, ఆ సదాలను మాత్రం తమ తమ ఆనందం కొద్దీ, అవగాహన కొద్దీ నిత్యం వల్లవేసికొంటూనే ఉంటారు. మఠంలోని వటువులు తాళపత్రాలపై వ్రాసికొని భద్రపరచుకొంటారు.

ఆయన జీవన విధానం సామాన్యపాఠక జనాన్ని మరింత ఆకట్టుకొంటుంది. ఆయన నిజంగా, సాదాసీదా మనిషి. ఏ ఆర్భాటాలు, తెచ్చిపెట్టుకోవడాలు లేవు. ఖాళీగా ఉండడు. ఎప్పుడూ ఎవరో ఒకరికి ఏదో ఒకపని చేసిపెడుతుంటాడు. రైతులకో, కుమ్మరులకో, కమ్మరులకో, సాలెలకో ఎవరికో ఒకరికి వాళ్లపనుల్లో సాయపడుతుంటాడు. పనులకు పోకుండా ఇంటివద్ద ఉండిపోయిన ఏరోగిష్టి మనిషికో సేవచేస్తూ, కాదంటే వృద్ధాప్యంతో బాధపడే ఏ ముసలమ్మ మూపు మీది బరువునో దారమ్మట మోస్తూ అగుపడతాడు. ఎక్కడికివెళ్లి, ఆయన భిక్ష అడుక్కోనక్కరలేదు. ఎవరో ఒకరు ఆయనున్న చోటుకే భోజనం తెస్తారు. లేదంటే ఏఇంటాయనో తన ఇంటికి ఆహ్వానిస్తాడు. అది పెద్ద విందు కాని, అంబలికాని ఒకే ప్రేమతో స్వీకరించి వాళ్లకు ఆనందం కలిగిస్తాడు.

పగలంతా కష్టపడి జనం పొద్దుగూకుతున్నప్పుడు గుడివద్దో, మఠంవద్దో, ఆయన చుట్టూమూగుతారు. పిల్లలూ, పెద్దలూ, పండితులు, పామరులు, అందరూ ఆయన నుండి వివిధ విషయాలను తెలుసుకోవాలన్న ఆసక్తితో అక్కడ చేరతారు. అందుకోసమే తమ పనులు తొందరగా పూర్తిచేసుకొని, త్వరత్వరగా అన్నం తిని అక్కడికి వచ్చేస్తారు.

పెద్దవాడైన మఠాధిపతికి దాపుగా ఆయన కూర్చొని ఉన్నాడు. మఠాధిపతి అయిన స్వామివారు, తన జీవనం నిమిత్తం -లేదంటే- తన అతిథులకు ఆతిథ్యం ఇవ్వడం కోసం, తగినంత సంపాదించుకోవడానికై, పగలంతా నూలు వడుకుతూనో, తోటపని చేస్తూనో గడిపిఉంటారు. స్వామివారు మిత భాషి. ఆయన నిజమైన సన్యాసి. ఆయన తర్వాతి చిన్న స్వామి శిష్యులకు బోధిస్తుంటాడు.

ఇద్దరూ కంబళి పరచిన వేదికపై కూర్చున్నారు.

వారి మధ్య అలాటి స్వామివారు ఉండటం ఎంత అదృష్టమో అక్కడ కూర్చున్న వారందరికి ఆయన చెబుతాడు. ఆవిషయం వారికి తెలియదని కాదు. అయితే చిరపరిచయం వల్ల దాన్ని మరచిపోయి ఉండవచ్చు. ఏ సూత్రపు పొగడ్తనైనా అయ్యవారు అంగీకరించరని ఆయనకి తెలుసు. అందుకే ఓ లోక సామాన్య సత్యం చెబుతున్నట్లు ఆయన ఇలా చెబుతాడు :

*''మండె బోళిసుకొండు తుండుగంబళిహొద్దు*
*హిండన గళిద మదగజ దంతిహర*
*కండు నంబువుదు సర్వజ్ఞ.''*

''ముండిత శిరసుతోడ, తుండుకంబళిదాల్చి
మంద విడిచి జను మదగజమ-
ట్లుండ నమ్మదగు సర్వజ్ఞ.''

ఆ మాటలంటూ వేదికపైని స్వామివారిని ఓరగంట చూస్తాడు. అర్థమైన వారు మెచ్చికోలుగా తలాడిస్తారు. అంతలో ఓ అమాయక వ్యక్తి తనకిటీవల ఎదురైన ఓ చేదు అనుభవాన్ని వివరిస్తాడు. ఎవరో ముండిత శిరస్కుడైన ఒక కొత్త సన్యాసి ఎదురైతే, ఆదరంగా తన ఇంటికి ఆహ్వానించి, నాలుగురోజులపాటు ఆతిథ్యమిస్తే, కడకు మోసగించి పోయాడట.

వెంటనే ఆ జ్ఞాని నోట వెలువడుతుంది :

*''మండెబోళదవర కండు నంబలి బేడ*
*ఖండితమప్ప పరతత్వవిషయవను*
*కండునంబువుదు సర్వజ్ఞ''*

''ముండిత శిరసులగాంచి నమ్మగావలదు
ఖండితమ్ముగ పరతత్వ విషయజ్ఞు
నిండు గని నమ్మరే సర్వజ్ఞ''

అప్పుడు ఎవరో ఒక ప్రశ్న వేస్తారు, దుర్మార్గులు మాత్రమే నిండిన ప్రపంచంలో సజ్జనులు ఎలా ఉండగలరని ?

చటుక్కున ఆయన చెబుతూంటే కళ్ళల్లో ఒక కాంతి కదలాడుతుంటుంది.

''దంతపంక్తియ నడువె ఎంతిర్పుదదు జిహ్వే
అంతు దుర్జనర బళసినళి సజ్జనరు
నింతిర్ర నోడ సర్వజ్ఞ''

''దంత పంక్తికి నడుమ ఎట్లుండె ఈ జిహ్వ
అట్లు దుర్జనుల నడుమ సజ్జనులు
నిల్చెదరు చూడు సర్వజ్ఞ.''

అలా ఆసక్తిదాయకంగా సాగిపోతుంటుంది వారి సంభాషణ. ఆఖరున ఓ పెద్దాయన లేచి అంటాడు, ఆయనే గనుక రాజసభల్లో చేరిఉంటే మహారాజులు మాటమాటకు ముత్యాలు, రత్నాలు కుమ్మరించి ఉండేవారని, సామ్రాజ్యమంతటికి ఆయనే మహాసంపన్నుడైన కవియై ఉండేవాడని !

అందుకు బదులుగా ఆయన కేవలం చిర్నవ్వు నవ్వుతూ అంటాడు :

''కరది కప్పరవుంటు, హిరిదొందు నాడుంటు
హరనెంబ దైవవెనగుంటు తిరివరిమ్
సిరివంతరారో సర్వజ్ఞ''

''కరమందు భిక్షాపాత్ర, కళ్ళెదుట విస్తార జగతి,
హరుడన్న దైవంబు మనకుండగా, మాన్యులా
సిరివంతులెవరింక సర్వజ్ఞ.''

''సిరి అంటే మోజెందుకు ?'' అని అంటూనే ఆయనంటాడు ''నేస్తమా ! నేను నువ్వనుకొనేటంత గొప్పవాణ్ణికాను''

''హేళలరియెను నాను, హేళెనలు హేళిదను
భాళలోచనన శరణర ఆగాగి
హేళిదెను నోడ సర్వజ్ఞ''

''పలుకుటెరుగను నేను, పలుకుమంటే పలికితి
బహళ లోచనుని శరణులకు దాసునై
పలికితిని చూడు సర్వజ్ఞ''

ఎంత నమ్రత ! ఆయన పరిపూర్ణ పాండిత్యానికి తగ్గ వినయం.

అలా ఎన్నో సాయంకాలాలు గడుస్తాయి. ఆయనను వాళ్ళు ఎన్నో విషయాలను అడుగుతారు, ఒక్కోసారి బాగా వ్యక్తిగతమైనవికూడా ! ఆయన పేరు, తల్లిదండ్రులు, జన్మస్థలం వగైరాలు. అందుకు దాటవేస్తూనో, లేదంటే పొడుపు కథల్లాగానో సమాధానం చెబుతారాయన. ఆయన పేరేమిటి ? ఎవరికీ స్పష్టంగా తెలియదు. చాలామందికి చాలారకాలుగా చెప్పాడు. ఆయన అసలు పేరును చెప్పమని కుర్రాళ్లు వత్తిడి చేస్తారు. వాళ్ళ తెలివితక్కువ కుతూహలాన్ని చూసి పెద్దవాళ్లు, బుద్ధిమంతులు మందలిస్తారు. ఆయన ఒక సంచార యోగి, శివయోగి. ఆయనకు దేశకాలాల పరిమితుల్లేవు. ఆయనకు వర్తమానమేకాదు, భూత భవిష్యత్తులు కూడా తెలుసు. ఈ లోకంలో ఆయనకు తెలియంది ఏమిలేదు. అలాటివాడు ఒక పేరుకు, ఊరుకు కట్టుబడి ఉంటాడా ? అనుభవం పండిన జ్ఞానం అందించే ఆ దివ్య సూక్తులను, సూక్తినిధులను, ఆ అనుభవ సాగరంలోనుండి వెలువడ్డ రత్నాలను తమ హృదయాల్లో దాచుకుంటే చాలదూ ? .... అలాగంటూ, జీవిత అనుభవాలకు సంబంధించిన వివిధ విషయాల మీద అనేక ప్రశ్నలు వేస్తూ ఆయన అనుభవజ్ఞాన నిధినుండి కావలసినంత అందుకోవడానికి ప్రయత్నిస్తారు అక్కడి వృద్ధులు. ఎన్ని ప్రశ్నలడిగినా ఆయనకు అలుపులేదు, ఎంతో సంతోషంగా సమాధానాలిస్తుంటాడు.

తనకు పేరులేదని ఆయన చెప్పినా, ప్రజలు మాత్రం ఆయన గురించి తమ మనస్సుల్లో రూపొందించుకొన్న భావానికి అనుగుణంగా, ఆయనను ఒక పేరుతో వ్యవహరిస్తున్నారు. ఆ పేరెలా వచ్చిందో ఎవరికీ తెలీదు. ఆయన అపారమైన జ్ఞానాన్ని చూసి, అన్నీ తెలిసినవాడనే అర్థం వచ్చేలాగ, ఎవరో ఒకరు ప్రగాఢమైన అభిమానంతో ఆయన్ని 'సర్వజ్ఞ' అని పిలిచి ఉండవచ్చు. కాదంటే ఏ పల్లెటూరి పండితుడో అసూయతో కళ్లుపచ్చబడి, ఆ మాటతో వెక్కిరించి ఉండవచ్చు. అయితే అది అవహేళనగాకాక, అభినందనగా కుదురుకొంది. తనకిచ్చిన ఆ పేరుమీద ఆయన చమత్కరిస్తాడు. అందరి దృష్టిని సర్వజ్ఞుడైన పరమేశ్వరునివైపు మరల్చుతాడు.

''ఒబ్బనల్లదె జగకె ఇబ్బరుంటె మత్తె ?
ఒబ్బ సర్వజ్ఞ కర్తను జగకెల్ల
ఒబ్బనేదైవ సర్వజ్ఞ''

''ఒక్కడేకాక జగలికి ఇద్దరుండకద్దు ?
ఒక్క సర్వజ్ఞుడే కర్త మహికెల్ల
ఒక్కడే దైవమ్ము సర్వజ్ఞ''

ఏమైనా ఆపేరు తన పదాలకు మకుటంగా పెట్టుకోవచ్చుని మెరపులాంటి ఆలోచన వచ్చింది. ఇప్పుడు ఆ పదాలకు ఓ స్పష్టమైన నిర్దిష్టమైన రూపు వచ్చింది. జానపద ఛందస్సులో త్రిపదుల్లా సాగుతున్నాయి. ప్రతి త్రిపది చివరా, పరమేశ్వరాంకితంగా ఆ పేరును చేర్చడం ఆయనకెంతో ఆనందకరంగా ఉంది. తనకు తెలిసినదని ఆయన చెప్పేది ఆ పరమేశ్వర కారుణ్యాన్నే.

ఇప్పుడు ప్రతివారికీ ఆపేరుమీదే ఆయన 'సర్వజ్ఞ'నిగానే పరిచయం. ఆయన కూడా దాన్నొక వ్యవహారనామంగానే అంగీకరించాడు తప్ప బిరుదుగా కాదు. ప్రాపంచిక వ్యవహారాల్లో ఏదో ఓ పేరంటూ ఉండాలిగా !..... ప్రజలు పెట్టిన పేరు ! అందులో ఏముంది ?....

అయితే ఎవరో ఒకరు దాని ఔచిత్యాన్ని ప్రశంసిస్తారు. ''స్వామీ నిజంగా మీరు సర్వజ్ఞులే, సర్వవిద్యలకు హిమాలయమంతటివారు.''

''అవును'' తన జ్ఞానంపట్ల సరైన అభిమానం కలిగినవాడిలా అంటాడాయన. ''అయితే ఈ జ్ఞానం ఎలా సంపాదించానో తెలుసా ?...''

*''సర్వజ్ఞనెంబువను గర్వదిందాదవనె*
*సర్వరొళ గొందొందు నుడిగలితు విద్యదా*
*పర్వత ఆద సర్వజ్ఞ''*

''సర్వజ్ఞుడనువాడు గర్వంబుచేనగునె ?
సర్వులకడ నొక్కొక్క నుడినేర్చి విద్యల
పర్వతమెయగును సర్వజ్ఞ.''

ఆయన వినయం అలాంటిది. ఏ భేషజానికి లోనూగాక సహజంగా ఉండేటటువంటిది. ఆయన ఆత్మ విశ్వాసం కూడా అంత మహోన్నతమైనదే.

ఆయన పద్యాలు చెవుల్లో ప్రతిధ్వనిస్తోంటే ప్రజలు ఇళ్ళకు వెళ్తారు. మరుదినం

పనీ పాటా చేసుకుంటూనే వాటిని మననం చేసుకుంటారు. అలుపు తీర్చుకుంటారు. మళ్ళీ సంధ్యవేళ ఆయన సాన్నిధ్యంకోసం ఆత్రుతగా ఎదురు చూస్తుంటారు.

కొన్నాళ్ళ తర్వాత ఉన్నట్టుండి ఆయన ఆవూరు వదలి వెళ్తాడు. ధూళి రేగుతున్న దారుల్లో మరో ఊరివైపు ఆయన నడక మళ్ళీ సాగిపోతుంది. ఆ నడక అనంతం. ఉత్తర, దక్షిణాల్లో, తూర్పు పడమరల్లో, సర్వత్రా !....

పదహారో శతాబ్దంలోని ఓ మహనీయ యోగి పుంగవుడూ, నైతిక ప్రవక్తా, మహాకవీ, ఆ 'సర్వజ్ఞు'డు ! సంస్కృతంలో భర్తృహరిలాగ, తెలుగులో వేమనలాగా, తమిళంలో తిరువళ్లువరు లాగా, కన్నడంలో ఆయన స్థానం అద్వితీయం. నాలుగువందలేళ్ళు పైబడ్డా ఆయన ప్రాచుర్యం ఏ మాత్రం తగ్గలేదు. ఆయన ఎంత ప్రతిభావంతుడైనా, పేరు ప్రతిష్ఠలకోసం వ్రాయలేదు. రాజాశ్రయాలకోసం ప్రాకులాడలేదు. ఆయనకు కవిత్వం సహజమైన అభివ్యక్తి మార్గం. తన చుట్టూఉన్న ప్రజలను ఉద్బోధించడం కోసం, వారిని సరైన మార్గంలో నడిపించడం కోసం, వారికి జీవితం పట్ల సరైన అవగాహన కలిగించడం కోసం ఆయన తన్ను తాను కవిత్వంలో అభివ్యక్తీకరించుకొన్నాడు.

# విశ్వేశ్వర ప్రసాదం

సర్వజ్ఞుని గురించి తెలిసింది చాలా తక్కువ. ఆయన పుట్టుక గురించి, తల్లిదండ్రులగురించి ఏమీ తెలియదు. ఆయన జీవితంలో ఏ సంఘటన గురించి అయినా, ఆయన కవితల్లో కాని, సమకాలీనులైన ఇతర కవితల్లో కాని, లేదా తర్వాతి వారి రచనల్లో కాని ఏ ప్రస్తావనా అగుపించదు. ఏ విశ్వసనీయమైన సాధికారిక సమాచారమూ లేకుండా ఆయన జీవితాన్ని గురించి చెప్పడం చాలా కష్టం అవుతుంది.

అయితే 17వ శతాబ్దినుంచే ప్రజల్లో ఆయన జీవితం గురించి ఒక కథ వాడుకలో ఉంది. బహుశః అది జన్మ స్మృతులనే పేరిట కేవలం కొన్ని వ్రాతప్రతుల్లో మాత్రమే లభించే పధ్నాలుగు పద్యాల మీద ఆధారపడ్డది కావచ్చు. వీటిల్లో తన జన్మ గురించి, తల్లిదండ్రుల గురించి, చిన్నప్పుడే ఇల్లు వదలి బయటకు రావడానికి గల కారణాల గురించి ఆయన సూచించాడని భావించడం కద్దు.

ఈ కథ మేరకు సర్వజ్ఞుడు ధార్వాడ జిల్లాలోని అంబలూరు (అబ్బలూరు)లో పుట్టాడు. తండ్రి 'బసవరస' అనే ఆరాధ్య బ్రాహ్మణుడు, తల్లి 'మాలి' అనే కుమ్మరి పడుచు.

ఇలా జరిగిందట :

ధార్వాడ జిల్లాలో హీరెకెరూరు దగ్గర్లో మసూర్ అనే గ్రామంలో ఒక మంచి కుటుంబానికి చెందినవాడు బసవరస. ఆయన భార్య అక్కమల్లమ్మ. ఇద్దరూ సంతోషంగా కాపురం చేస్తున్నారు. ఆమె కడుపు పండలేదనే కొరత మాత్రం ఒకటి పీడిస్తోంది. ఈ వేదన రానురాను హృదయ శల్యంగా మారసాగింది. ఇద్దరూ స్వతహాగా ఎంతో భక్తి ప్రపత్తులూ, సదాచారం కలిగిన వారు. కాశీకి వెళ్లి, విశ్వేశ్వరుని ఒక సుపుత్రుని కోసం సేవించి రమ్మని అక్కమ్మ పెనిమిటిని ప్రార్థించసాగింది. ఫలితంగా బసరవస కాశీకి

తీర్థయాత్ర వెళ్లాడు. కాశీ విశ్వనాథుడు ఆయన ప్రార్థనలను ఆలకించాడు. ఇంటికి వెళ్లి భార్యకు ఇవ్వడానికి కొంత ప్రసాదం ఆయన చేతికి లభించింది. తిరుగు ప్రయాణం ప్రారంభించాడు. ప్రయాణం దాదాపుగా ముగియ వచ్చింది. అంబలూరు దగ్గరకు వచ్చేసరికి చీకటి పడింది. అక్కణ్ణుండి మసూరు మరో ఆరు మైళ్లు మాత్రమే. ఒయితే ఆకాశమంతా దట్టంగా మబ్బులు కమ్ముకొని, వర్షం ప్రారంభమయ్యేలాగుంటే ఆయన అక్కడ ఆగక తప్పిందికాదు. దాపులో కనిపించిన ఇంటికి వెళ్లి ఆశ్రయమడిగాడు. అది ఓ కుమ్మరివారి ఇల్లు. వంటకోసం కుండలు కొనుక్కొన్నాడు. ఆ ఇంటాయనపేరు 'మాల', ఎక్కడికో దూరప్రయాణం వెళ్లాడు. ఇంటావిడపేరు 'మాలి'. అతిథి మర్యాదలన్నీ ఆమే చేయవలసివచ్చింది. ఎంతో మర్యాదతో, మన్ననతో ఆ బ్రాహ్మడికి ఆతిథ్యమిచ్చింది. ఆమె మాట, మన్నన, మనోహర స్వభావం, నాణ్యమైన నడత ఆయన్ను ఎంతో ఆకట్టుకొన్నాయి.

ఉరుములు, మెరుపులతో కుండపోతగా వాన మొదలైంది. ఇల్లంతా కురవసాగింది. ఉన్నంతలో అతిథికి ఎలాటి ఇబ్బంది కలగకుండా, మాటిమాటికీ ఆయన సౌకర్యాన్ని చూడసాగింది మాలి. సహజంగా ఏర్పడ్డ ఆ మనోహర సన్నివేశం ఇద్దర్లో ప్రేమను అంకురింప చేసింది. ఫలితంగా ఒక రాత్రికి ఉద్దేశించిన మజిలీ, వారం రోజులపాటు కొనసాగింది. ఆతర్వాత బసవరస తన ఊరెళ్లాడు.

కాలక్రమేణ, కాశీ విశ్వనాథుని కృప, ఆశీస్సులు ఫలించాయి. చోటు మాత్రమే మారింది. మాలి సుపుత్రుని ప్రసవించింది. జరిగిన సందర్భం గురించి ఏమీ తెలియని మాల, కొడుకు పుట్టినందుకు ఎంతో సంతోషించాడు. తన కొడుకే అనుకొని, ప్రాణప్రదంగా చూసుకొన్నాడు.

ఆ పసిబిడ్డడు ఎంతో చురుకైన కుర్రానిగా ఎదిగాడు. మంచి వర్చస్సు. పసితనానికే అద్భుతమనిపించే మేధాశక్తి. తాను కాశీ విశ్వనాథ ప్రసాద సంజాతుడని తల్లివల్ల తెలిసింది. మసూరులోని బసవరస అనే బ్రాహ్మణుడు కాశీకి వెళ్లి తిరిగి వస్తూ, తల్లికి విశ్వనాథ ప్రసాదం ఇచ్చాడని, ఫలితంగా తాను కడుపున పడ్డాడని కర్ణాకర్ణిగా వినడం జరిగింది. అప్పుడప్పుడు బసవరస తన ఇంటికి వచ్చిపోతుండటాన్ని కూడా ఆపిల్లవాడు చూసిఉండవచ్చు. అతనికి తనతల్లితో అక్రమ సంబంధం ఉందని ఎవరైనా ఏదైనా ఆడిపోసికోవడం కూడా వినిఉండవచ్చు. చాలా తెలివైనవాడూ, సున్నితమైన మనసున్నవాడు కావడం వల్ల, నలుగురూ తన్ను వెక్కిరించి ఎగతాళి చేసినప్పుడు చాలా బాధపడి ఉండవచ్చు. తీవ్రమైన అవమాన వ్యథకులోనై ఉండవచ్చు. పిల్లవాడు ఎంత చురుకైనవాడో, అంత ధైర్యవంతుడు. దాపరికం లేనివాడు. ముక్కుసూటిగా

మాట్లాడేవాడు. అయితే తల్లిఅంటే అపరిమితమైన ప్రేమ. కులం, అంతస్తుకు అతీతమైన గొప్పదనం, సంస్కారం ఆమెలో ఉన్నాయని తెలుసు. ఆమెలోని ఎన్నో మంచి గుణాలంటే అతనికెంతో అభిమానం. వాటిని జన్మతః తాను పొందినందుకు ఎంతో గర్విస్తాడు కూడా !

ఒకరోజు భోజనాలయ్యాక మాలి, మాల విరామంగా కూర్చొని, ఎంతో ఆనందంతో కబుర్లు చెప్పుకొంటూ ఉన్నారు. ముద్దుల కుమారుని ఇద్దరూ మురిపిస్తున్నారు. అచ్చం తనే, తన కొడుకే అన్నాడు మాల. లేదు, తన కొడుకే అంది మాలి. 'ఎవరి కొడుకో నువ్వేచెప్పు !' అంటూ సరదాగా కొడుకు నడిగాడు తండ్రి. నిశ్శబ్దంగా ఉన్న ఆకాశంలో నుంచి పిడుగు పడ్డట్లు వచ్చింది సమాధానం :

*''తందె హోరువున్నల్ల, తాయి మాలియు అల్ల*
*చంద్ర శేఖరన వరదింద పుట్టిద*
*కంద తానెంద సర్వజ్ఞ''*

''తండ్రి బ్రాహ్మడుగాడు, తల్లి మాలియుగాదు
చంద్రశేఖరుని వరమందు బుట్టిన
స్కంధతానంటి సర్వజ్ఞ.''

తండ్రి అభిమానం దెబ్బతింది. తల్లి అంతరంగం కలవర పడింది. కుర్రవాని నిష్కపటత ఆమెను బెదరగొట్టింది. ఏదో ఓరోజు అతనే తన తప్పును బహిరంగ పరుస్తాడేమోనన్న అవ్యక్తభయం ఆమె హృదయంలోకి ప్రవేశించింది. అంచేత అతని అధిక ప్రసంగం వల్ల ఎంతోకోపం వచ్చినట్లు ఊగిపోతూ, చాలా పెద్దగొడవ చేసింది. కొవ్వి మదమెక్కాడని చెప్పి, ఇద్దరూ అతన్ని ఇంట్లోంచి గెంటి వేశారు.

ఇక్కడ ఆగిపోతాయి, ఆ పధ్నాలుగు పద్యాల్లోని ఆత్మ కథా సూచనలు. పదిహేనవ పద్యం ఆధ్యాత్మిక అన్వేషణలోకి దూకుతుంది. అందులో కవి ఎంతో వేదనతో పలుకుతాడు. ఈ రంగురంగుల సాలెగూటిలో తనను ఇరికించి, ప్రాపంచికమైన త్రివిధ రుచులతో (బహుశః యవ్వన, సంపద, మేధాబలాలకు చెందినవి) సమ్మోహన పరచి, తనలో శివుడు ఆవిష్కృతం కావడం లేదనే ఆవేదనను వ్యక్తబరుస్తాడు.

ఇంటి నుండి వెళ్లగొట్టబడ్డాక ఎక్కడకు వెళ్లాడు ? ఎక్కడెక్కడ తిరిగాడు ? ఏఏ కష్టాలను ఎదుర్కొన్నాడు ? ఏంతిన్నాడు ? ఎవరు కాపాడారు ? ఎలా చదువుకొన్నాడు ?

ఎవరు గురువు ? పెళ్లిచేసికొన్నాడా ? కాపురం చేశాడా ? నేరుగా సన్యాసి మార్గంలో ప్రవేశించాడా ? ఎలా ఈ సర్వసంగ పరిత్యాగం లోకి వచ్చాడు ? ఇలాటి ఎన్నో ప్రశ్నలు, సమాధానాలు దొరక్కుండానే వుండిపోతాయి. ఇవన్నీ అలాగుంచి, అసలు ఆయన పేరేమిటి ? తల్లిదండ్రులు పెట్టిన అసలు పేరేమిటి ? అనే దానికే సమాధానం దొరకదు.

ఆత్మ కథాసూచనలున్న పధ్నాలుగు పద్యాలలో ఒకచోట, దవసలె సర్వజ్ఞ అని పిలువబడే తాను మునుపు వరరుచి (సంస్కృత కవి)గా అవతరించానని, అంతకుమునుపు కైలాసంలోని శివుని ప్రమథ గణాల్లో పుష్పదత్తునిగా ఉండేవాణ్ణని పేర్కొంటాడు. అలా ఆ కథ పౌరాణికమైన మలుపు తిరుగుతుంది.

ఆయన పద్యాల్లో కనిపించే కొన్ని వ్యక్తిత్వచ్ఛాయలు, సంఘర్షణలతో నిండిన ఆయన జీవన వికాస క్రమాన్ని స్పష్టం చేయడానికి ఉపకరించవచ్చు. అయితే అదికూడా మన ఊహే అని గుర్తుంచుకోవాలి. ఏదీ నిర్ధారమైన విషయం కాదు, సంభావ్యం మాత్రమే.

అలా తల్లిదండ్రులు వదిలేసిన కుర్రాడు, బ్రతుకు తెరువుకోసం ఎక్కడెక్కడో తిరిగాడు. ఊళ్లోవాళ్లు నిత్యం ఆయన పుట్టుకగురించి మాట్లాడుతుంటే భరించలేక పోయాడు. అందుకే తెలియని ప్రదేశాలకు వెళ్లి తిరుగుతూ, దయాహీనమైన ఈప్రపంచం పోకళ్లకు అలవాటు పడ్డాడు. ఆకలేసినప్పుడు అన్నం పెట్టడానికి తన కులగోత్రాలగురించి ఆరా తీసేవారు ప్రజలు.

ఈ అనుభవం ఎన్నో ఏళ్ల తరువాత, ఈరక్తమాంస శరీరపు యథార్థ యోగ్యతను అర్థం చేసికొన్న తరువాత, ఆయన పలుకుల్లో సాక్షాత్కరిస్తుంది :

''ఎలువిన కాయక్కె సలె చర్మవను హొదిసి
మలమూత్రక్రిమియు ఒళగిర్ప దేహక్కె
కులవావుదయ్య సర్వజ్ఞ''

''ఎలకాయమునకు తగుచర్మమును తొడిగి
మలమూత్రక్రిములు లోనున్నదేహమునకు
కులమేదటయ్య సర్వజ్ఞ.''

అయితే, ఆ తరుణంలోనే, కులం వ్యక్తిలో ఎక్కడ అంటుకొని ఉంటోంది ?

117709

అంటూ ఆ పిల్లవాడు ఆశ్చర్యపడేవాడు. అందుకే దాన్ని గురించి ఎక్కువ పట్టించుకోలేదు. అయితే తిండీ, గూడు కంటె మించి 'తెలిసి కోవడం' కోసం ఆయన ఎక్కువ తాపత్రయ పడిపుండాలి. ఆ జ్ఞాన దాహమే అతన్ని ఒకచోటునుండి మరొక చోటుకి, సరైన గురువును అన్వేషింపచేస్తూ తరుముతూ ఉండాలి. అదంతా వృథాప్రయాసే అయింది. ప్రతి అంశాన్ని విమర్శగా చూసే అతని మనస్సుకు, పూర్తిగా ఏ గురువూ సంతృప్తి కలిగించలేదు. అయితే, ఓ పద్యంలో పేర్కొన్నట్లు, తనకు ఎదురైన ప్రతివారిపద్ద, కడదాకా కొద్దికొద్దిగా జ్ఞానాన్ని సేకరిస్తూనే ఉన్నాడు. నియమితమైన విద్యాభ్యాసంతో కాకుండా, ప్రపంచంతోటి ప్రత్యక్ష సంబంధంతో, ఆయన విస్తృతమైన, ప్రగాఢమైన జ్ఞానాన్ని సంపాదించాడు. అలా ప్రపంచమే అతని పాఠశాల, అనుభవమే అధ్యాపకుడు, జీవితమే పాఠ్యగ్రంథం.

తొలినాళ్ల సంచారాల్లో, ఏ పుణ్యాత్ముడో ఆయనను దాపుకు చేర్చుకొని వుండవచ్చు. తండ్రిలా అభిమానంతో ఆదరించి వుండవచ్చు. ఆలనాపాలనా, చదువూసంధ్యా చూసి వుండవచ్చు. అందువల్లే, సర్వజ్ఞునికి సంస్కృతంలోని ధర్మ శాస్త్రగ్రంథాలతో సన్నిహిత పరిచయం ఏర్పడి వుంటుంది. చదువూ సంధ్యకంటె జీవితం ఆయనకు ప్రధానం కావడంచేత, నిర్ణీత విద్యాక్రమంలో పాండిత్యాన్ని సంపాదించుకోవటాన్ని ఆయన పట్టించుకోలేదు.

కాలక్రమంలో బహుశః ఆయన పెళ్లికూడా చేసికొని, స్థిరపడి వుండవచ్చు[1]. మొదట్లో బాగా సంతోషంగానే గడిపి వుంటాడు. అయితే తొందర్లోనే, గృహస్థ జీవితం పూలపాన్పుకాదనే సత్యం తెలిసి వచ్చివుంటుంది. ఆర్థిక సమస్యలకు తోడు, ఆయనకూ ఆయన భార్యకు మధ్యవున్న మానసిక అంతరం, వైవాహిక జీవితాన్ని దుర్భరం చేసివుంటుంది. సున్నిత మనస్కుడు కావడంవల్ల, తన్నర్థంచేసికోలేని భార్యతో చాలా బాధపడివుంటాడు. బహుశః ఆమె చాలా దుబారా మనిషి అయిఉండాలి. ఆమె మితిమీరిన ఖర్చులకు కావలసినంత ధనం లేదన్న చింత సర్వజ్ఞుని చాలాసార్లు పీడించి ఉంటుంది. తరువాతి జీవితంలో వీటన్నిటినీ గుర్తుకు తెచ్చుకొంటూ ఆయన ప్రకటిస్తాడు :

---

1. ఇది కేవలం ఈ గ్రంథకర్త భావన మాత్రమే. కొన్ని త్రిపదుల ఆధారంగా కలిగిన భావన. దాన్ని ఆంతరంగిక సత్యంగా అంగీకరించనూ వచ్చు, అంగీకరించక పోనూవచ్చు. ప్రచారంలో ఉన్నమాట మాత్రం ఆయనకు పెళ్లి కాలేదనే ! ఆయన మొదటి నుండి సంసార విరక్తుడనే ప్రసిద్ధి.

''ಬೆಚ್ಚನಯ ಮನೆಯಾಗಿ ನೆಚ್ಚಕ್ಕೆ ಹೊನ್ನಾಗಿ
ಇಚ್ಛೆಯನರಿವ ಸತಿಯಾಗಿ ಸ್ವರ್ಗಕ್ಕೆ
ಕಿಚ್ಚು ಹಚ್ಚೆಂದ ಸರ್ವಜ್ಞ''

''వెచ్చవెచ్చనిగృహముండ, వెచ్చాలకు ధనముండ
ఇచ్చనెరిగెడి సతియుండ, స్వర్గానికే
చిచ్చుపెట్టదగును సర్వజ్ఞ.''

చక్కటి కుటుంబ సౌఖ్యం కంటె స్వర్గం ఇచ్చేది మాత్రం ఇంకేముంటుంది ?

ఈరీతి బాధలు, ఇంటిపోరు ఒకవైపు, తనలో రగిలే ఆధ్యాత్మిక అన్వేషణ మరోవైపు కలిసి ఆయనను సంసారం నుండి విరక్తుణ్ణిచేసి, శాంతి జ్ఞానాలనందించే సద్గురువు కోసం వెదుకుతూ వెళ్లేలా చేసివుంటాయి. అయితే తన్ను తానెరిగి ఇతరులకు త్రోవచూపే సద్గురువు లభించడం అంత సులభమైన విషయంకాదు. దాన్ని అనుభవంద్వారా గ్రహించి అంటాడు సర్వజ్ఞుడు :

*''ಮಂಡೆ ಬೋಳದೊಡಮ್ ದಂಡು ಕಾಳ್ವಿಡಿದೊಡಮ್*
*ಹೆಂಡತಿಯ ಬಿಟ್ಟು ನಡೆದೊಡಮ್ ಗುರುಮುಖವ*
*ಕಂಡಲ್ಲ ದಿಲ್ಲ ಸರ್ವಜ್ಞ''*

''ముండన మొనర్చుకొన్నంత, దండము చేదాల్చినంత
పెండ్లమును వీడిసాగినంత, గురుముఖము
కండ్లబడబోదు సర్వజ్ఞ''

ఇలాటి గడ్డు స్థితిలో, మరోమారు ఆయన సంరక్షకుడు అతన్ని ఆదుకొని, సద్గురువును చూపించి వుంటాడు.

స్వరోత్తమ జ్ఞానసారాన్ని అందించే సమర్థతగల సద్గురువు దొరికితేచాలు, సర్వస్వశరణాగతి చేయడానికి సిద్ధంగా ఉన్నాడు సర్వజ్ఞుడు :

''ಊರಿಗೆ ದಾರಿಯನಾರು ತೋರಿದರೇನು
ಸಾರಾಯಮಪ್ಪ ಮತವನರುಹಿಸುವ ಗುರು-
-ವಾರಡಾದೇನು ಸರ್ವಜ್ಞ''

''ఊరికి దారినెవరు జూపిన నేమి
సారమౌ తత్త్వమ్ము తెలిపేటి సద్గురు
వెవ్వరైననేమి సర్వజ్ఞ''

సర్వజ్ఞుని పదాలను పరిశీలించి చూస్తే, ఇదికూడా సంభావ్యమే.

''ತಂದೆಗೂ ಗುರುವಿಗೂ ಒಂದು ಅಂತರವುಂಟು
ತಂದೆ ತೋರುವನು ಶ್ರೀಗುರುವ, ಗುರುರಾಯ
ಬಂಧನವ ಕಳೆವ ಸರ್ವಜ್ಞ''

''తండ్రికీ, గురువుకూ ఒక్క అంతరముండు,
తండ్రి చూపెడు శ్రీగురువున్, గురురాయడు
త్రెంచుబంధనంబుల సర్వజ్ఞ.''

పెళ్ళయినా కాకున్నా తన సంచారంలో ఎక్కడో ఓచోట, తన్ను చీకటి నుండి వెలుగులోకి, అసత్తునుండి సత్తులోకి తీసికొనివెళ్లే తన సద్గురువును, ఒక వీరశైవ మహానుభావుణ్ణే కలిసికొని ఉంటాడు. ఆయనే ఈ నిప్పులాంటి చురుకైన యువకునికి వీరశైవ దీక్ష ఇచ్చిఉంటాడు. ఆగురువుతో పాటు కావలసినంత కాలముండి, వీరశైవతత్త్వాన్ని సంపూర్ణంగా ఆకళించుకొన్నాడు సర్వజ్ఞుడు. వాస్తవిక జీవనపరమైన, ఉదారమైన ఆ మత దృక్పథం, దాని విశ్వజనీనత ఆయన్ను అమితంగా ఆకట్టుకొని ఉంటాయి. ఆయన ప్రవృత్తికి అద్భుతంగా సరిపడిఉంటాయి. వీరశైవం ఆయన దృష్టికి ఒక జీవన విధానంగా అగుపించిందే తప్ప, మరోకులంపేరుగా కాదు. (కులమంటేనే ఆయనకు అమిత అసహ్యం ఏర్పడి ఉంది) ఆ విధానంలో ఆయన జీవించడం మొదలుపెట్టాడు. క్రమక్రమంగా ఆధ్యాత్మిక అభ్యున్నతి సాధించాడు.

ఆయన పదాల్లో అనేకం ఆ ఆధ్యాత్మిక అనుభవాన్ని అభివ్యక్తం చేస్తున్నాయి.

ఆయన ఎంతటి ఆధ్యాత్మిక ఉన్నతి సాధించాడో స్పష్టంగా విశదీకరిస్తున్నాయి. తనలోనిండిఉన్న దివ్యత్వాన్ని ఆయన గ్రహించాడు. అది అందాకా అనుభవంలోకి రాలేదు:

''ಕ್ಷೀರದೊಳು ಘೃತವಿದ್ದು ನೀರೊಳು ಶಿಖಿಯಿದ್ದು
ಆರಿಗಾಯ ತೋರದಿಹುದಂತೆ ಎನ್ನೊಳಗೆ
ಸಾರಿಹನು ಶಿವನು ಸರ್ವಜ್ಞ''

''పాలలోనెయ్యుండె, నీటిలో నిప్పుండె
ఎవరికీ కనరాకనే, నాలోన
తానుండు శివుడు సర్వజ్ఞ''

తనగురువు కృపానుగ్రహంచేత, తాను పొందిన ఆనందాతిశయం అపరిమితమైంది. ఆగురువు మహత్వాన్ని వర్ణించడానికి ఆయనకు మాటలు కూడా రావడం లేదు. సాక్షాత్తు ఆ పరమశివుడే మానవరూపం ధరించివచ్చి, పరితపిస్తున్న ఆత్మల్ని ధర్మపథంలో మాధురీ ప్రకాశాల దరిజేరుస్తున్నాడంటాడు. ఆయనకు మానవరూపం ఉందనడంలో సందేహంలేదు, కాని ఆయన ఇతరుల్లా మానవ మాత్రుడు మాత్రం కాదు.

ప్రాయశః ఈ అనుభవ పారవశ్యంలోనే అంటాడు :

''ತಾಪದಾಸಂಸಾರ ಕೂಪದಲಿ ಬಿದ್ದವರು
ಆಪರಳಿದು ಪಾರನುಡಲು ಗುರುಪಾದ
ಸೋಪಾನ ಕಂಡ್ಯ ಸರ್ವಜ್ಞ''

''తాపసంసారకూపాన బడినట్టివారు
ఆ పతనంబునుండిబ్రోచు గురుపాద
సోపానసంక్తి గనరె సర్వజ్ఞ''

లోకంలో ఎందరెందరు గురువులు, ఆయన స్మృతి పథంలోతాను దర్శించిన ఎన్నో మతాలు మెదిలిఉంటాయి. ఎందరో గురువులు, తమకే ఎరుక రానివారు. వారు

శిష్యులకు బోధిస్తున్నారు. ఆశిష్యులకు ఏమర్థమవుతున్నది ? చీకట్లో గ్రుడ్డివారు ఒకరికొకరు దారికొకరు దారిచూపికొన్నట్లున్న ఆస్థితిని బహుశః ఆయన వెక్కిరించి ఉంటాడు.

అలాటివారు ఒకవిధమైన గురువులు. మరోవిధమైన వారిని తానున్న మఠంలోనే దర్శించి ఉంటాడు. పరమదివ్యుడైన గురుదేవుని సన్నిధానంలో ఉంటూకూడా, ఆయన మహిమను గుర్తింపలేక, పరిపూర్ణమైన అజ్ఞానంలో కూరుకుపోయిన సహవాసుల్ని పరిశీలించి ఉంటాడు. వాళ్లకు ఆ గురుదేవుని గౌరవించడంకూడా తెలియదు. తమకు లభించిన మహదవకాశాన్ని వృథాగా పోగొట్టుకొంటూ తిండిమీద యావను మాత్రం తీర్చుకొంటున్నారు. పందులకంటె వాళ్లేం మెరుగు ?

వాళ్లంటే జాలిపడి 'అయ్యో పాప'మనుకొనడం తప్ప చేసేదేముంది ? ఈ మాటలు నిజం కావా ?

''ఉణ్ణె కెచ్చులొళిద్దు ఉణ్ణదు నొరెవాల
పుణ్యవమాదణునల్లొల్లనవనిరవు
ఉణ్ణెయిమ్ కష్ట సర్వజ్ఞ''

''పొదుగుపై వాలిన పిడతలు పాలుత్రాగునా ?
పుణ్యంపు కలిమి గుర్తెరుగకుంట
పిడతలకంటె హీనమౌ సర్వజ్ఞ''

వాళ్ల మనసు ఇంకా అపక్వంగా ఉందనీ, ప్రాపంచిక విషయాలమీదే వాళ్ల ఆసక్తి అనీ, వాళ్లు మోక్షానికి చాలా దూరంలో ఉన్నారనీ ఆయనకు తెలుసు. తనపని తాను చేసికోవడమే ఉత్తమమనీ తెలుసు.

కొన్ని పదాలలో సర్వజ్ఞుడిలా చాటుతాడు :

''తుప్పవాదా బళిక సొప్పనెరెదవరుంటె''

''పాలు ఒక్కసారిగా నేయి అవుతే, మళ్లీ పెరుగు చేయవలసిన అవసరముందా?''

''ముత్తు నీరలి హుట్టి మత్తె నీరప్పుదె
తత్త్వవనరిద శివయోగి సంసారవ
మత్తె హొద్దువనె సర్వజ్ఞ''

''నీటిలో బుట్టి ముత్యమ్ము మరల నీరగునె ?
తత్త్వమ్ము తెలిసిన శివయోగి మరల
సంసారమున్ జొచ్చునే సర్వజ్ఞ''

''కుండలిగోళీదాత హెండిరిగలివనే
ఖండితవమీరి సుఖియాదవ మాంసద
పిండకెరగువనె సర్వజ్ఞ.''

''కుండలిని ప్రేమించుయోగి, పెండ్లమును ప్రేమించునే
ఖండితముగ జగతిమీరి సుఖియించు వాడు, మాంస
పిండమునకెరగునె సర్వజ్ఞ'.'

ఆయన ఈ మాటలు ఎందుకనవలసివచ్చింది ?[1] ఒకసారి వైరాగ్యజీవితంలోకి పరివర్తన పొందాక, ఈ ప్రాపంచిక రక్తీ, తాపత్రయాలు అన్నీ గతానుభవాలే. మళ్లీ వెనుకకు మళ్లే ప్రసక్తిలేదు.

ఆ గురుసన్నిధిని, మఠాన్ని కూడా ఏదో ఒకరోజు వదలక తప్పలేదు. బహుశః గురుదేవుల నిర్యాణం తరువాత వదిలి ఉండవచ్చు. పరివ్రాజక ధర్మానికి సరైన అనంత సంచారం ప్రారంభించి ఉండవచ్చు.

వివిధ ప్రజల స్వభావాల గురించి, వివిధ ప్రదేశాలగురించి, తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ ప్రాంతాల గురించి ఆయన అల్లిన పద్యాలు ఆయన చేసిన విస్తృత పర్యటనను అద్దంపట్టి చూపుతున్నాయి. జీవితం తుదిఘడియలు సమీపిస్తున్నప్పుడు, ఎక్కడైనా కొద్దికాలంపాటు స్థిరంగా గడిపివుండవచ్చు. అయితే ఎక్కడ ఎప్పుడు పరమపదించాడన్నదికూడా తెలియదు. హీరెకెరూరు వద్ద ఓ సమాధిని ఆయన సమాధిగా ప్రజలు చెప్పుకొంటున్నారు.

---

1. సర్వజ్ఞుడు మొదట పెళ్లి చేసుకొని, తర్వాత సంసారాన్ని పరిత్యజించాడన్న ఊహకు ఇది బలం కలిగిస్తుంది.

సర్వజ్ఞుని పుట్టుకను గురించి, తల్లిదండ్రులనుగురించి కావలసినన్ని వాదోపవాదాలున్నాయి. ఇందాక చెప్పుకొన్నట్లు, ఆయన కవిత్వంలోని ఆ పద్యాలుగు పదాలపై ఆధారపడ్డ ఐతిహ్యం తప్ప, ఆయన జీవితాన్ని తెలియజెప్పే మరే ప్రామాణిక సమాచారమూలేదు. ఆ పద్యాలుగు త్రిపదులు కూడా, కొంతమంది విద్వాంసుల ప్రకారం, అనంతరకాల ప్రక్షిప్తాలే. తమ వాదనకు వారు రెండు ప్రధాన కారణాలను ఉల్లేఖిస్తారు. మొదటిది, ఈ త్రిపదులు కొన్ని వ్రాతప్రతుల్లో మాత్రమే లభిస్తున్నాయి తప్ప, అన్ని వ్రాతప్రతుల్లోనూ కాదు. రెండవది, ఆయనెంత నిష్కపటంగా, ముక్కుసూటిగా మాట్లాడేవాడైనా, తనతల్లిగురించి, తల్లిదండ్రుల శృంగార జీవితాన్ని గురించి, అలా తన్నుతాను న్యూనపరచుకొనే విధంగా చెప్పిఉండడు. అందులోనూ జీవితంలో అనేక సంఘటనల గురించి దాపరికం పాటించినవాడు, కొడుకూగా తన స్థానాన్ని న్యూనపరచుకోడు. కనుక సారాంశం చూస్తే, ఇదంతా బ్రాహ్మణులు తమ ఆధిక్యం నిరూపించుకోవడానికి, బ్రాహ్మణులకు తప్ప ఇతరులకు ప్రతిభాపాటవాలులేవని చాటడానికి చొప్పించిన కల్పన అంటూ కొందరు భావిస్తున్నారు.[1]

అలాగే ఈ కల్పనకు అనుకూలంగా కూడా వాదించే అవకాశముండి, ఆత్రిపదులు తదనంతర ప్రక్షిప్తాలను కొన్నప్పటికీ, వాటికి మూలమైన భావం, జానపదులు తరతరాలుగా సర్వజ్ఞుని గురించి చెప్పుకొనే కథల్లో నిక్షిప్తమైఉండే అనకాశముంది. వాటిల్లో ఆయన దాపరికం లేకుండా చెప్పిన మాటలు, సత్యమంటే ఆయనకున్న అపారనిష్ఠను చాటిచెబుతాయి. సత్యకామ జాబాలి అంతటి గొప్పవానిగా నిరూపిస్తాయి. సత్యం పట్ల జాబాలికున్న నిష్ఠ ఆయనను గురుకృపకు పాత్రుని చేసింది, ఆయననంతటి గొప్ప ఋషిగా నిలబెట్టింది. అలాగే సర్వజ్ఞుడు కూడా !

సర్వజ్ఞుని కాలం గురించి కావలసినంత వివాదం ఉంది. ఆయన కాలం గురించి, తన పదాల్లో ఎక్కడా ఏసాక్ష్యమూలేదు, మరే చారిత్రక సాక్ష్యాధారమూ లభించడం లేదు. అంచేత ఆయన కాలాన్ని నిర్ధరించడం చాలా కఠిన సమస్యగా మారింది. వివిధ విద్వాంసుల వాదాల మేరకు సర్వజ్ఞుడు క్రీ.శ. 15 నుండి క్రీ.శ. 18వ శతాబ్ది మధ్య ఎప్పుడైనా జీవించి ఉండవచ్చు. ప్రసిద్ధ విద్వాంసుల[2] వాదాలన్నిటిని సమన్వయపరచి, సర్వజ్ఞుడు 16వ శతాబ్ది తొలిభాగంలో నివసించాడని భావించడం సమంజసం. సర్వజ్ఞుని త్రిపదుల గురించి తొట్టతొలి ప్రస్తావన క్రీ.శ. 1560 ప్రాంతాలలోని నిరక్త

1. The poet Sarvajna డా ॥ ఎస్. శివరుద్రప్ప.

2. ఇ.పి. రైస్, ఎఫ్. కిట్టెల్, ఆర్. నరసింహాచార్, జి.ఎమ్. ఉమాపతిశాస్త్రి, చెన్నప్ప ఉత్తంగి, డా॥ ఆర్.ఎస్. ముగళి, డా॥ ఎల్. బసవరాజు, సిద్ధయ్యపురాణిక్, ఎస్. శివన్న గార్లు.

తొంటదార్యుడు సంకలించిన అనాది వీరశైవ సంగ్రహంలో వస్తుంది. విరథమహాలింగని గురుబోధామృత కావ్యం సర్వజ్ఞుని ప్రభావాన్ని నిర్ద్వంద్వంగా చాటుతుంది. అది. క్రీ.శ. 1504 నాటిది. సర్వజ్ఞుడు ఆయన కంటె కొద్దిముందు తరంవాడైనా కావాలి. లేదా గురుబోధామృతంలో కొన్నిచోట్ల పేర్కొన్నట్లు ఆయన గురువైనా కావాలి.

అయితే ఈమాటలకు ఆసరాగా మరే చారిత్రక సాక్ష్యం లభించనంతవరకూ ఇదే ఆఖరి మాట అని నిశ్చయంగా చెప్పడానికి వీలులేదు.

సర్వజ్ఞుని త్రిపదుల్లో ఆయన జీవితం గురించి తెలియజేసే అంశాలు ఏమీ దొరక్కపోవచ్చు, అందులో ఆత్మ కథాసూచకాలేవో నిర్ధరించడం కష్టమూ కావచ్చు, వాటిపై ఆధారపడి ఆయన జీవిత కథను నిర్మించడం అసంభవమూ కావచ్చు; కాని వాటినుండి ఆయన వ్యక్తిత్వాన్ని గురించి మాత్రం కావలసినంత గ్రహించవచ్చు.

ఆయన అత్యున్నత శ్రేణికి చెందిన శివయోగి, సర్వసంగ పరిత్యాగి, అన్ని వాంఛల నుండి పరిపూర్ణంగా విముక్తుడు; మనసా, వాచా, కర్మణా శుచి కలిగినవాడు. అందరిపట్ల కారుణ్యం తప్ప అన్యమెరుగనివాడు.

నిజమైన జంగముడై ఒకచోటునుండి మరో చోటుకి నిత్యమూ సంచరిస్తూ సేవా, ప్రేమ సందేశాలను అందించినవాడు. తన్ను తాను భిక్షకునిగా చెప్పుకుంటూ, భిక్షాదానంవల్ల కలిగే పుణ్యాలను ప్రస్తుతిస్తూ తిరిగినా ఆయనెప్పుడూ పనిలేకుండా, నిష్క్రియాశీలిగా గడపలేదు. సోమరులను, తిండిపోతులను నిర్దాక్షిణ్యంగా ఖండించాడు. తానెక్కడికి వెళ్లినా, కాయకష్టం చేసో, మరే పనిచేసో భిక్షను ఆర్జించుకొన్నాడు. ఏ మత సంస్థకూ, మతానికి తన్ను తాను బంధించుకోలేదు. నిజాయితీగా, నిర్దుష్టంగా, నిర్మోహమాటంగా జీవితాన్ని గడిపాడు. ఆయనకు గొప్ప సమయస్ఫూర్తి, సూక్ష్మ పరిశీలనాశక్తి భగవంతుడిచ్చిన వరాలు. విస్తారమైన జ్ఞానం ఉండడమేకాదు, జీవితంపట్ల లోతైన అవగాహనకూడా ఉంది. నిప్పులా జీవితాన్ని గడిపాడు. సర్వతంత్ర స్వతంత్రుడై గడిపాడు. ధనంకోసం, పేరుప్రతిష్ఠలకోసం ఆయన ఎన్నడూ ప్రాకులాడలేదు. అన్ని విధాల కాపట్యాలను ఎదిరించి నిలిచాడు.

ఆయనకు గురువుపట్ల, దైవంపట్ల ఉన్న భక్తి అద్వితీయమైంది. అంత విరాగి అయినా, సన్యాసి అయినా ఆయనకు జీవితంపట్ల ఉన్న అభినివేశం అపారమైంది. ఎక్కడ మంచి అగుపడ్డా, హృదయపూర్వకంగా అభినందిస్తాడు. అలాగే చెడును ఖండించడం లోనూ, తనదృష్టిలో మానవజాతికి హానిచేస్తుందనుకొన్నదాన్ని ఖండించడంలోనూ వెనుకంజవేయడు.సామాన్య మానవబలహీనతల పట్ల కఠినంగావ్యవహరించాడు.

సున్నితంగా తిరస్కరించాడు. అందర్నీ సమంగా ప్రేమించాడు. ఆయన వాళ్లనెప్పుడూ 'ఈకులంవారు, ఆకులంవారు, గొప్పవారు, తక్కువవారు' అంటూ భేదభావంతో చూడలేదు. అందరూ ఒకే విశ్వకుటుంబానికి చెందినవారిగా, సహచరులుగా భావించాడు. కులం, సంపద, అంతస్తుల పట్ల మానవులకున్న దురభిప్రాయాలపై, అక్కడక్కడ స్త్రీల విశ్వాసహీనతపై ఆయన వ్యాఖ్యలను పరిశీలిస్తే, ఆయన చిన్న కులంలో పుట్టడంవల్ల (అందులోనూ అక్రమ సంతానం) చిన్నతనంలో సామాజిక తిరస్కారానికి గురై బాగా గాయపడ్డాడన్న అభిప్రాయానికి బలం చేకూరుతున్నది. అయితే అదృష్టవశాత్తు ఆయన ఆధ్యాత్మికమైన ఎదుగుదల, ఎప్పటికీ ఆయన్ను క్రూరంగా మార్చలేదు. ప్రపంచంపట్ల ఈషణ్మాత్రం కూడా కోపాన్ని, వ్యతిరేకాన్ని ఆయన తనలో పెరగనివ్వలేదు. అందుకు భిన్నంగా, పూర్తిగా నిస్వార్థమైన, ప్రాపంచిక బంధాలపట్ల పరాజ్ముఖమైన పూర్ణవైరాగ్యభావాన్ని పెంపొందించుకొన్నాడు. అహంకారాన్ని పెంచే అన్నిటినీ, చివరకు పేరును, జీవన స్మృతులనుకూడా పరిత్యజించాడు. తనచుట్టూతాను ఒక దుర్భేద్యమైన మార్మికతను అల్లుకొన్నాడు. ప్రజలిచ్చిన సర్వజ్ఞుడనే వ్యావహారిక నామాన్నే సంతోషంగా అంగీకరించాడు. అంచేత మరింత సులువుగా పుట్టుకతో ప్రాప్తించిన పేరును వదిలించుకోవడం సాధ్యమైంది. అంతకంటె మించి, సర్వజ్ఞుడనే పేరు, ఏదో వ్యక్తిగతమైన పేరుగా కాక, విశ్వజనీనమైన గుర్తింపుగా భాసిస్తున్నది.

ఇంతటి సంపూర్ణమైన ఆత్మ నిస్సంగతాస్థితిని సాధించడం చాలా గొప్పవిషయం. వైయక్తిక పరిమితులైన కులం, గోత్రం, దేశం, కాలం అన్నింటి అవధుల్ని పరిక్రమించి ఆయన పరిపూర్ణ మానవ ప్రమాణాల్లో సాక్షాత్కరిస్తున్నాడు.

""....... and the elements

So mixed in him that nature might stand up

And say to all the word, "This was man !'[1]

(.... ఆయనలో మిళితమైన లక్షణాలను చూసి,
ప్రకృతేరూపం దాల్చివచ్చి ప్రపంచానికి చాటుతుంది-
'ఇదిగో ఈయన మనిషి' అని....)

---

1. Shakespear

# సహజ కాంతుల్లో జీవితం

సాహిత్యం జీవితానికి కేవలం ప్రతిబింబంకాదు. లేదంటే ఆర్నాల్డ్ నిర్వచించినట్లు కవిత్వం జీవితానికి విమర్శకూడా కాదు. కవి ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించినా, ప్రయత్నించకున్నా జీవితం సాహిత్యంలో ప్రతిబింబిస్తుంటుందనేది వాస్తవం. అయితే సాహిత్యంలో జీవితం విలువల్ని మదింపుచేసే ప్రయత్నముంటుంది. కవిత్వంలో మాత్రం వీటన్నిటినీ మించినది మరేదో ఉంటుంది.

సర్వజ్ఞుని వచనాలు కూడా అలాటివే. ఆయన పదాల్లో అగుపించే సమాజ చిత్రణను బట్టి, చరిత్రలోని ఏకాలానికి అది సంబంధించినదో తేల్చి చెప్పడం చాలాకష్టం. ఆయన ఏ సూచనా ఇవ్వడు. ఏచారిత్రక సంఘటననుకాని, ఏతత్కాలీన సమస్యనుగానీ ప్రస్తావించడు. కాలాన్ని గుర్తుపట్టడానికి ఏ ఉపకరణమూ ఉండదు.

ఏ కొన్ని పద్యాల్లోనో క్వాచిత్కంగా స్థానిక, లేదా, ప్రాంతీయ లక్షణాలను, ఆహార, వేష, ఆచారాదుల్లోని ప్రత్యేకతలను, సామాజికమైనవో వ్యక్తిగతమైనవో కొన్ని చిన్న చిన్న విషయాలను ప్రస్తావించడముంది. అయితే అవి దేశంలో నలుదిక్కులా సందర్శించినప్పుడు వివిధస్థలాల్లో ఆయనకు ఏర్పడ్డ అభిప్రాయాలుగా మాత్రమే ఉంటాయి. మిగిలిన పద్యాలన్నీ ప్రాపంచిక విధానాలపై, కళలపై, జీవన ప్రాముఖ్యంపై, జీవితంలోని అర్థం, ప్రయోజనాలపై ఆయన పరిశీలనలను ప్రతిధ్వనిస్తూ ఉంటాయి. ఆదృక్పథాలు, సలహాలు కూడా విశ్వవ్యాప్తంగా అన్వయమయ్యేలా ఉంటాయి. అన్ని కాలాలకు, అన్ని దేశాలకు అవి వర్తించేలా ఉంటాయి.

అయినప్పటికీ, కొన్ని చారిత్రక సందర్భాలతో, వ్రాతలతో సంవదించే విధంగా

ఆయన పద్యాల్లో ఉద్దీప్తమైన కొన్ని అంశాలు, లక్షణాలు, సాందర్భిక సాక్ష్యాలను బట్టి, ఆయన విజయనగర సామ్రాజ్యపు స్వర్ణయుగంలో జీవించి ఉండేవాడని ఊహించవచ్చు.

అవి, విజయనగర సార్వభౌములు స్వయంగా సంగీత, కళా, సాహిత్య ప్రియులై, కవులనూ, కళాకారులనూ, విద్వాంసులను పోషించిన రోజులు. మహారాజ సభలో గుర్తింపుకోసం, ఆ ఘనమైన పురస్కారాలకోసం కవులూ, కళాకారులూ, పరస్పరం పోటీలు పడేవారు. సర్వజ్ఞుడు ఈ పోటీలో ఎన్నడూ పాల్గొనలేదు. మహారాజుల ఔదార్యాన్ని ప్రశంసించాడు. కాని ఏ ఆశ్రయాన్నీ, బాధ్యతనూ అంగీకరించని స్వేచ్ఛను ఆయన కోరుకున్నాడు. జాగ్రత్తగా వైభవోపేత సభలకు దూరంగా ఉండిపోయాడు. ప్రజల హృదయాలలో స్థానం సంపాదించుకోవడంతో సంతోషపడ్డాడు.

ఒక నిస్సంగ పరిశీలకునిగా అత్యంత శక్తిమంతంగా వివిధ సందర్భాల్లో పలికిన వివిధ సంక్తుల్లో ఆనాటి సమాజంలోని జీవితం ఆటుపోట్లను సర్వజ్ఞుడు చిత్రించగలిగాడు.

చాలా కొద్దిరేఖలతోనే చిత్రించే ఒక గొప్ప వ్యంగ్యచిత్రకారునిలాగా, ఆనాటి వివిధ వృత్తుల్లోని ఎంతోమంది రూపాల్ని ఎప్పుడూ గుర్తుండిపోయేలా అందించాడు. పురోహితులు, జ్యోతిష్కులు, శకున వేత్తలు, కరణాలు, గణకులు, పన్నువసూలుదార్లు, వడ్రంగులు, కమ్మర్లు, కుమ్మర్లు, దర్జీలు వంటి ఎంతోమంది చేతివృత్తులవాండ్లు, కోమట్లు, గానుగవాండ్లు, వడ్డీవ్యాపారులు, కాపులు, బోయలు, బెస్తలు అందరూ ఆయన వ్యాఖ్యలకు గురయ్యారు. కేవలం రైతులు, నేతవాళ్లు మాత్రం అభినందనకు పాత్రమయ్యారు. ఇంకా ఎందరో, జూదగాళ్లు, త్రాగుబోతులు, విటులు, వేశ్యలు, మూర్ఖులు, మోసగాళ్లు, కపట సన్యాసులు (గురువులూ, వాళ్లశిష్యులు), వ్యభిచరించే స్త్రీ పురుషులు, ఎందరిమీదనో పదునైన విమర్శలు కురిపించాడు. సర్వజ్ఞుడు మంచివాళ్లను గుణవంతులను, వివేకవంతులను, నిజమైన ఆధ్యాత్మిక గురువులను, వారి సచ్ఛాత్రులను, పవిత్రమైన విశ్వాసవంతులైన గృహిణులను కూడా ప్రస్తావిస్తూ, వాళ్లను మనసారా ప్రశంసిస్తాడు.

విభిన్న కుటుంబ చిత్రాలు కూడా ఎదురౌతాయి. ఒకటి భయభ్రాంతులు కలిగించే ఓ మగవానిది, లేదా హింసకు, దోపిడీకి బలయ్యే స్త్రీ జాతిది, లేదంటే బాధతో నిట్టూర్చే యవ్వనవంతురాలైన వితంతువుది. మరొకటి గయ్యాళులైన భార్యలది, చాలీచాలని ఆదాయాలది, ఆవేదన పాలైన మగవాళ్లది. ఇంకొకటి, అరుదైనదైనా, ఓ అందమైన ఇంటిది, ఆ ఇంట్లోని ప్రేమ, శాంతి, సంతోషాలది.

ఇంత వైవిధ్యంతో కూడిన సమాజ చిత్రాలను బట్టిచూస్తే, ఆకాలం చాలా కలగాపులగంగా ఉన్న విలువలు నిండిన కాలమనుకోవాలి. ధార్మిక గుణసంపన్నులైన సామాన్య జనులకు, ఒక స్పష్టమైన మార్గదర్శనం, నైతిక బలమూ ఆవశ్యకమై ఉన్నాయి. ఆనాటివాళ్లు కోరుకొనేదంతా సుఖ, శాంతి, సంతోషాలు నిండిన సంతృప్తికరమైన కుటుంబ జీవితాన్నే. చిన్న చిన్న సంతోషాలు, సౌకర్యాలనే. వానాకాలంలో కారని ఒక మెచ్చని ఇల్లూ, అర్థం చేసికొని సహకరించే ఇల్లాలూ, కొడుకులూ, పనివారూ, ఇంకా చెప్పాలంటే కాస్త నిండుగా సహకరించే ఒక గొడుగూ, పాదుకల జత, అప్పుడప్పుడు విందులూ, వినోదాలు ఇలాటివే.

స్థూలంగా చూసినప్పుడు అన్ని మతాలకు సమాన గౌరవం, మతసామరస్యం వర్ధిల్లుతూ ఉంది. అయితే రాజులూ, కొంతమంది ప్రధాన అధికారులు తీసికొన్న శ్రద్ధవల్ల వీరశైవులు, వైష్ణవులు మరింత బాగా వర్ధిల్లుతూ ఉన్నారు. వీరశైవం పునరుజ్జీవితమౌతోంది. జైనులు సంపన్నులుగా ఉన్నారు. వర్తకంలో ముందంజవేశారు. అయితే తమ మతపరమైన ప్రాధాన్యాన్ని పోగొట్టుకొంటున్నారు.

భారతదేశమంతా భక్తి ఉద్యమం వ్యాపించిన కాలమది. దేశ వాతావరణమంతా ఒక ఆధ్యాత్మికమైన, భక్తి ప్రధానమైన ఉత్సాహంతో నిండి ఉంది. అస్సాంలో శంకరదేవుడు, బెంగాల్‌లో శ్రీకృష్ణచైతన్య, కర్ణాటకలో నిజగుణ శివయోగి, తొంటద సిద్ధలింగేశ్వరుడు, పురందరదాసు, కనకదాసు అలా కాలాన్ని ప్రభావితం చేసిన స్ఫూర్తినిచ్చిన ప్రముఖ యోగీశ్వరులలో కొందరు.

వింతగొలిపే విషయమేమిటంటే వీటన్నిటికీ భిన్నంగా, ఈ భక్తి వైరాగ్యాలకు విరోధాభాసంగా మరో విధమైన సమాజమూ అదేకాలంలో పరిఢవిల్లింది. అది మరింత పెద్దది. అక్కడ మతమంటే కులభేదాలనే అర్థం. కఠినమైన ఆచారాలనీ, మానవ అనుభూతులకు, విలువలకు స్థానంలేని సంప్రదాయాలనీ అర్థం. కులాభిమానాలు, వర్గదృక్పథాలు చాలా అధికంగా ఉన్నాయి. ఆ క్రూరమైన కులం పట్టింపులతో, అంటరానితనాలతో, కాపట్యాలతో, తెచ్చిపెట్టుకున్న వైభవాలతో, ఆర్భాటాలతో సాగే మతాచారాల మూలంగా మొత్తం సమాజమే పతనమవుతున్నది. చాలా కొద్ది తప్ప, ఆలయాలు, మఠాలు తమ పావిత్ర్యాన్ని కోల్పోయాయి. అవి అత్యాశాపరులైన పూజారులకు, తిండిపోతు సన్యాసులకు, తెరమరుగులో అడ్డూ అదుపు లేకుండా సాగే విలాసాలకూ నిలయాలయ్యాయి.

తనకాలంలో ఇంగ్లీషు చర్చిల గురించి మిల్టన్ మహాకవి అన్నమాటలు :

..... Such as for their bellies' sake creep and intrude,
and climb into the fold;
Blind mouths ! That scarce themselves know how to hold
A sheep - hook, or have learned aught else the least
That to the faithful herdsmen's art belongs.

(... తమ పొట్టలకోసం అల్లుకు వస్తారు. అడ్డుపడతారు, ఎగ్రబాకుతారు
గుడ్డినోళ్లు ! తమను తాము అదుపులో పెట్టుకోవడంకూడా తెలియనివారు
గొర్రెమంద ! గొర్రెలవాడన్నదానికి తలూపడం తప్ప మరేం నేర్వని వారు)

ఇవి ఆనాటి వీరశైవ, వైష్ణవ మతాలకు కూడా అచ్చం సరిపోతాయి.

అలాంటప్పుడు, సామాన్య జనులు, ఐహిక విషయాలమీదనే అత్యంత శ్రద్ధ కలిగి ఉండటంలో ఆశ్చర్యమేముంది.

నైతిక పతనం భౌతిక, బౌద్ధిక వికాసాలను కూడా దెబ్బ తీసింది. తగినంత ధనముంటే చాలు, చాటుమాటుగా అన్ని వ్యసనాలు సాగించేవారు. జీవితం అనుభవించడానికే అన్నది సార్వత్రికంగా వినిపించే అభిప్రాయం. సంపన్నులు కాని సామాన్యులుకూడా, అప్పుచేసో, అడుక్కుతినో తమ శారీరక వాంఛల్ని తీర్చుకొనేవారు. వాళ్లలో ఏకొద్దిమందో తమ ఆశల్ని సాధించాలనుకొనే పట్టుదల ఉన్నవారు. ధనార్జన మీదనో, రాజకీయ అధికారం మీదనో, పదవిమీదనో దృష్టిపెట్టేవారు. వాటిని సాధించడంలో, ఆ కల్లెంలేని కోర్కెలు దేన్నీలక్ష్యపెట్టేవికావు. ఏమార్గమో ఆలోచించనవసరంలేదు, ఏశంకా కలగదు. లోభం, మోహమే పెత్తనం చలాయించేవి. డబ్బే అత్యంత ముఖ్యమైన నిర్ణాయక శక్తి. దేన్నయినా కొనవచ్చు. దేన్నయినా డబ్బుకోసం అమ్మేయవచ్చు.

రాజులూ, ఎక్కువమంది సేనానాయకులు అధికారాలతో, యుద్ధంలో సాగించిన విజయాలతో మత్తెక్కి ఉండేవారు. ప్రభుత్వాధికారులు క్రింది నుంచి, పైదాకా అవినీతిపరులే. ఆడవాళ్లు ముఖ్యంగా పేదలు, బలహీనవర్గాల స్త్రీలు, ఈ అవినీతి సమాజపు దుర్మార్గాలకు బలైనవారే. దారిద్ర్యం, భయం కోరల్లో చిక్కి, ప్రజలు నైతికతను విస్మరించారు. హింస, మోహసాగరాల్లో మునిగిన ప్రజలు లంగరు మరచిపోయారు. ఆనాటి వాతావరణమంతా 15వ శతాబ్దంలోని ఇటలీలోలాగా, నైతికబలహీనతలతో నించి పోయింది.

ధనవంతులు విలాసమూ, మేధావుల కపటమూ, సైనికుల అహంకారమూ, బడుగు జీవుల నిశ్శబ్ద వేదనా, వర్తకుల, అధికారుల నైతిక పతనమూ, అన్నీ కలిసి మరో నైతిక, ఆధ్యాత్మిక పునరుత్థానాన్ని, సామాజిక సంస్కరణను అపేక్షిస్తున్నాయి. వాటి ఆవశ్యకాన్ని నొక్కిచెబుతున్నాయి. ఈ సమూహిక సుప్తచేతన అనుభవిస్తున్న పరితాపానికి స్పందిస్తూ ఎందరో సాధుపురుషులూ, కవులూ వెలువడ్డారు. సమాజ రుగ్మతలకు చికిత్స చేయడమే తమ జీవిత ఆశయంగా కలిగిన అలాటి వైద్యుల్లో ఒకడు సర్వజ్ఞుడు.

# త్రిపదుల్లో బ్రతుకు బరువు

సర్వజ్ఞుని సాహిత్యసృజన అంతా 2100 త్రిపదులు. ఇందులో వెయ్యి మాత్రమే సర్వజ్ఞునివనీ, మిగిలినవి ప్రక్షేపాలని విశ్వాసం. రాశిలో తక్కువైన ఆ రచనలతోటే, కన్నడంలోని ప్రసిద్ధ కవుల సరసన సర్వజ్ఞుడు అంత వాసికెక్కడం చాలా అద్భుతమైన విషయం. దానివల్ల ఆపద్యాల్లోని భావ పటిష్టత, సాహిత్య సౌందర్యం సుస్పష్టమవుతున్నాయి.

ఆనాటి సాహిత్య సంప్రదాయం : ధార్మిక ఇతివృత్తాలనెంచుకొని తద్వారా నైతిక, ధార్మిక దృక్పథాలను ప్రస్ఫుటం చేస్తూ, ఒకటి రెండు మహాకార్యాలు రాయడమే. కావ్య ప్రతిభ ఉన్న విద్వాంసులు తమనైపుణ్యాన్ని ధనసంపాదనకో (కనీసపక్షంగా సుఖవంతమైన జీవనస్థితికోసం), కీర్తికో లేదా రాచసభల్లో గౌరవ స్థానానికో అంకితం చేసేవారు. ఇలాటి ఏ ఆశలూ లేని సర్వజ్ఞుడు, కనీసం సాహిత్యరంగంలోకూడా ఏస్థానాన్ని ఆశించని సర్వజ్ఞుడు, ఈ సంప్రదాయం మూసలో పడిపోలేదు. ఆయన త్రిపదుల్ని చదివి మనం ఆయన్ను నైతిక ప్రవక్తగా, సంఘసంస్కర్తగా పిలుస్తున్నాం. అంతేకాని ఆయన తన లక్ష్యంగా దాన్ని ఎంచుకోలేదు. ఏసిద్ధాంతాన్నో, నైతిక తత్త్వాన్నో అందించాలనే ఆలోచన ఆయనకు ఏమాత్రమూలేదు. ఆయన పద్యాల్లో ఏపాండిత్య ప్రకటనా, విద్యా పరిగణనా లేవు. ఆయన ఎప్పుడూ కుదురుగా కూర్చొని, పట్టుమని వాటిని వ్రాసిందే లేదు. విభిన్న స్థలాలలో, విభిన్న దృశ్యాలను, సందర్భాలను చూసినపుడు ఆయన గుండెల్లోనుండి సహజంగా ఎగసివచ్చిన మాటలవి. మౌఖికంగా ఒకరినుండి ఒకరికి అందుతూ, జానపద విజ్ఞానంలాగే భద్రపరచబడ్డ స్మృతి సంపద ఆ త్రిపదులు. చదువుకొన్న గట్టి అభిమానులెవరైనా, వాటిని వ్రాతరూపంలో భద్రపరచి ఉండవచ్చు.

సర్వజ్ఞుడు తన అభివ్యక్తి మాధ్యమంగా ఆలంకారికమైన కావ్యభాషను ఎంచుకోలేదు. కన్నడనాడులోని జానపద ఛందోరూపమైన త్రిపదిని ఎంచుకొన్నాడు. తన శ్రోతలు పల్లెపట్టుల్లోని పాటక జనమే. అందుకోసం వాళ్లకు బాగా అలవాటైన త్రిపదే తనకూ అనువుగా కుదిరింది. చిన్న చిన్న సంక్షులతో, సామాన్యమైన వాడుకభాషలో ఉన్న త్రిపది తన ప్రయోజనానికి అద్భుతంగా అమరిందనుకొన్నాడు. తన ప్రతిభను, అభివ్యక్తీకరించడానికి 'వచన' రూపం కంటె అది మరింత బాగా నప్పుతుందని భావించి ఉండవచ్చు. నిజానికి త్రిపదులు ఆపాటికే కొన్ని గంభీర ధార్మిక గ్రంథాలలోనూ వాడబడివున్నాయి. కాని సర్వజ్ఞుడు వాటికి ఒక కొత్త జీవం పోశాడు, కొత్తశక్తినిచ్చాడు. అందమైన, బలమైన అభివ్యక్తి రూపంగా తీర్చి దిద్దాడు. అద్భుతమైన శిల్పపాటవంతో, త్రిపదులను సర్వజ్ఞునికంటె మించి ఎవరూ వాడుకోలేకపోయారు.

ఆయన త్రిపదుల్లో ఎంతో విస్తృతమైన విషయవైవిధ్యముంది. వాస్తవానికి సర్వజ్ఞుడు ఏరంగాన్నీ స్పృశించకుండా వదల్లేదేమో ! ఆయన ఎన్నిరకాల విషయాలను స్పృశిస్తాడంటే, ఆయన త్రిపదులు తరచూ ఓ సంక్షిప్త విజ్ఞాన సర్వస్వంలా అగుపిస్తాయి. జీవితానికి పనికివచ్చే, ప్రధానమైన అన్ని విషయాలమీద ఆయన ఏదో ఒకటి చెప్పాడు : కుటుంబ జీవితం, సమాజజీవితం, రాజ్యవ్యవస్థ, ప్రజాపాలన, అర్థశాస్త్రం, వ్యవసాయం, వృత్తులు, చేతిపనులు, వాణిజ్యం, వైద్యం, ఆరోగ్యం, ఆహారం, వేషభూషలు, గృహోపకరణాలు, విద్య, నీతి, వినయం, మాట, పాట, స్త్రీలు, ఋతువులు, జ్యోతిషం, శకునాలు, రసశాస్త్రం, తత్త్వశాస్త్రం, మతం, కులాలు, పొడుపు కథలు, అన్నీ....

అలా ఆయన ప్రపంచంలో సాధించిన విస్తృతమైన అనుభవం, పరిపక్వమైన అవగాహన, విశాల మానవ దృక్పథం అంతా ఆయన ప్రవచనాల్లో ఒదిగిపోయాయి.

ఈ పద్యాలను సంకలనం చేసిన పండితులు, వాటిని వివిధ శీర్షికల క్రింద వర్గీకరిస్తూ, వాటిల్లో ఒకవిధమైన పొందికను తీసుకొని రావడానికి ప్రయత్నించారు. అలా, ప్రాపంచిక, నైతిక, తాత్త్విక, శాఖలనే మూడు ప్రధాన శీర్షికల క్రింద, ముప్పైనాలుగు ఉపశాఖలు రూపొందాయి. ఒక్కో ఉపశాఖకు 'పద్ధతి' అని పేరు. పద్ధతి అంటే పదే పదే నడవగా రూపొందిన దారి అని అర్థం. విధానం, ఆచారం అని కూడా అర్థం.

ఈ మాటను ప్రకరణానికి పేరుగా వాడ్డంలోని ప్రాముఖ్యం తెలియ రావడంలేదు. కాని అది ఏక కంఠంగా నైతిక కవిత్వంలో అనుసరించిన సంప్రదాయం.

ఈపద్యాల్లో భావం, పరిపక్వమైన వివేకంతో తొణికిసలాడుతూ, శ్రోతలను, పాఠకులను వెనువెంటనే ఆకట్టుకొని వాళ్లనందులో తల్లీనమయ్యేలా ప్రేరేపిస్తుంది. సర్వజ్ఞుడేది చెప్పినా, అది ఆయన ప్రపంచం, జీవితం పట్ల పొందిన అవగాహనపులోతుల్లోనుండి వెలువడుతుంది. అందులో తమ జీవితాలకు చాలా దగ్గరిది, తాము తెలుసుకోదగింది ఉన్నట్లుగా ప్రజలు అనుభూతి చెందేవారు. అందులో ప్రజ్ఞాపాటవాలు కాదు వారిని ఆకర్షిస్తున్నది. తమమధ్యవున్న ఒకేరకమైన సమస్యలమీద, అవసరాలమీద ఆయన చూపించే శ్రద్ధ వారిని అంతగా ఆకట్టుకొంటోంది. ఒక్కోసారి కుండ బద్దలు కొట్టినట్లుగా మొరటుగా వుండవచ్చు, ఒక్కోసారి మృదువుగా ఉండవచ్చు, స్నేహితునిగా ఆప్తస్వరంలో ఉండవచ్చు. అయితే ఎప్పుడూ ఆయన పరిశీలనలు, హెచ్చరికలూ సట్టికుదిసివేసేలాగానే ఉంటాయి. ఒక్కమారు విన్నవారు, మాటిమాటికీ వాటిని చెప్పమనే అడుగుతారు.

ఆ వచనాలు ఆయన తన సంతోషంకోసంగానీ, ఇతరుల సంప్రీతికోసంగానీ చెప్పడంలేదు. వాళ్ల ఆలోచనను మేల్కొల్పడానికి చెబుతున్నాడు. వారి చేతుల్లో దారిచూపడానికి ఒకదీపంలాగా ఆమాటల్ని పెడుతున్నాడు. చుట్టూ చీకటి కమ్మినప్పుడు, సరైన దారి చూపించే సరైన భావదీపికల్లా పెడుతున్నాడు.

ఆ నీతివాక్యాలు బోధించడానికి మునుపు, కవికూడా వాటిని స్వతహాగా ఆచరించాడనే భావం, నిత్య స్మరణీయాలైన ఆవాక్కుల మహత్త్వాన్ని మరింత ఉద్దీప్తం చేస్తుంది.

# జీవించడంలో విశేషం

సర్వజ్ఞుడు జీవితంలో అన్నికోణాలను స్పృశిస్తాడు. ఆనందంలోని అన్నిదశలను వర్ణిస్తాడు. భౌతిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక అందాలను విపులీకరిస్తాడు. ఆయనకు జీవితం ప్రేమించతగింది, పరిపూర్తిగా జీవించతగింది. జీవితం అందించే అన్ని మంచి విషయాలను త్రోసిరాజనడంలోకాదు, అంగీకరించడంలోనే అసలైన, ఆరోగ్యవంతమైన అవగాహన దాగివుంది. అదుపెరిగిన ఆవేశాలను సర్వజ్ఞుడు అభిమానిస్తాడు. అయితే అసహజంగా వాటిని అణచివేయడాన్ని ఆమోదించడు. అర్థంలేని ఇంద్రియ నిగ్రహంచేత జీవితం అందించే సరళ సుందరమైన, హానిలేని సంతోషాలను పోగొట్టుకోకూడదంటాడు.

సంపన్నవంతమైన, సంపూర్ణజీవితాన్ని ఎట్లాగడపాలో చెప్పడానికి కొన్ని పద్యాలను కేటాయించాడు. ఈ పద్యాలన్నీ చక్కటి అభిరుచిని, జాగ్రత్తగా వివేకంతో ఎంచుకోవడాన్ని, ఓమంచి ఆరోగ్యవంతమైన దృక్పథాన్ని, అందమైన కలుపుగోలు నడతను అభివ్యక్త పరుస్తాయి. వాటిల్లో పేర్కొన్న తార్కాణాలు, ఉపమానాలు, అలంకారాలు సామాన్యమైన స్త్రీపురుషులందరికీ అర్థంకావడానికిగాను, అందరికీ నిత్యజీవితంలో ఎదురయ్యే అనుభవాలనుండి, విషయాలనుండి వాటిని ఎంచుకొంటాడు.

మరికొన్ని, నిత్యజీవితంలో వాంఛనీయమైన వాటిని వివరిస్తాడు. అవి నిండైన భౌతిక సుఖాలనుండి, సూక్ష్మమైన భౌతిక, ఆధ్యాత్మిక ఆనందాల వరకు వ్యాపించి ఉంటాయి. సుఖం కేవలం వస్తు, విషయాల్లో లేదు. వాటిని అనుభవించే విధానంలో ఉంది అని చెప్పడాన్ని మాత్రం మరచిపోడు. ఆయనలో దాగివున్న చార్వాకుడు, చాలా

సాధారణమైన చిన్న చిన్న వస్తువులు, చిల్లర విషయాలు అందించే సుఖాలను కూడా అలక్ష్యంచేయడు. ఎండపూట ఓగొడుగు, పిండి వంటలో నెయ్యి, బాగావేగిన పప్పు, చవులూరించే పాయసం, ఇలాటివి చిన్నచిన్న చిల్లర విషయాల్లో కొన్ని. విద్వాంసునికి సద్గుణం వాంఛనీయమంటాడు. గౌరవించదగ్గ స్త్రీకి భర్త ఆవశ్యకమంటాడు. అన్ని సందర్భాల్లో వివేకవంతమైన లోకోక్తులు అవసరమంటాడు.

ఆనంద ప్రదమైన సామాజిక జీవితానికి ఆధారం చక్కటి మానవ సంబంధాలే. అవి ఆధారపడ్డది సత్ప్రవర్తన మీదనే, అంచేత మనోహరమైన ప్రవర్తనా నియమావళిని ప్రవచిస్తాడు సర్వజ్ఞుడు.

మంచి మాట, సజ్జన సాంగత్యం, మూర్ఖులతో నిరర్థకవాద పరిత్యాగం, మద్యపానంతో పాటు సమస్త దుర్వ్యసనాల విసర్జన, ఇతరుల అభిప్రాయాలను, అనుభూతుల్ని మన్నించడం - ఇలాటి సుఖజీవనానికి ఆయన చెప్పే చిట్కాలలో కొన్ని. సర్వజ్ఞుని ఉద్దేశంలో దానగుణం గొప్ప మానవ గుణాల్లో ఒకటి.

*''అన్నవన్నిక్కువుదు నన్నియను నుడియువుదు*  
*తన్నంతె పరర బగెవుదు కైలాస తా*  
*బిన్నాణ వల్ల సర్వజ్ఞ''*

''అన్నముబెట్టుట, సత్యము బలుకుట  
తన్నంతె పరుల దలచుట కైలాసమట,  
విన్నాణము కాదది సర్వజ్ఞ''

మనస్ఫూర్తిగా దానంచేయి ! తరువాత దానికోసం పరితపించ వద్దు. తగినవారికే ఇవ్వు ! తటపటాయించవద్దు. నిశ్శబ్దంగా, రహస్యంగా ఇవ్వు ! ఏ ఆర్భాటమూ చేయవద్దు. ఏ రూపంలోనైనా ఇవ్వు. ధన రూపంలో కానీ, వస్తురూపంలో కానీ. పేదలకు, అవసరమున్న వారికి ఇవ్వు ! అన్ని దానాల్లోకి అన్నదానం అత్యంత పుణ్యప్రదం.

*''సిరిబంద కాలక్కె కరెదు దానవ మాడు*  
*పరిణామవక్కు పదవక్కు కైలాస*  
*నెరెమనెయక్కు సర్వజ్ఞ''*

''సిరిగలుగు కాలాన పిలిచిదానము చేయి
పరిణమించు పుణ్యసదము, కైలాసమే
పొరుగిల్లగు సర్వజ్ఞ''

''కామ, క్రోధ, మాత్సర్య, లోభాల పీడక తప్పదు''

సర్వజ్ఞుడు కూడా షేక్స్పియర్ లాగానే అప్పుజేయడం గురించి హెచ్చరిస్తాడు. ఋణాలు తీసికొనేటప్పుడు సంబరంగానే ఉంటుంది కాని, తర్వాత వర్ణనాతీతమైన దుఃఖం కలుగుతుందంటాడు.

ఆనందకర జీవితానికి అన్నిటికంటె ముఖ్యం ఆరోగ్యమంటాడు. సరైన, మంచి ఆహారం వైద్యుని దూరంగా ఉంచుతుందంటాడు సర్వజ్ఞుడు. చాలా సరళమైన నియమాలు పేర్కొంటాడు :

*''హసివిల్ల దుణబేడ హసిదు మరెతిరబేడ*
*బిసి బేడ తంగు అళ్సుబేడ విద్యనా*
*గ సణియే బేడ సర్వజ్ఞ''*

'తగిన ఆకలిలేక తినవద్దు, ఆకలిని మరువద్దు
మిగుల వేడిమి తంపు, చల్దివద్దు, వైద్యుని
తగులగారావద్దు సర్వజ్ఞ'ట

మంచి పోషకారాన్ని ఎంచుకో. నీ ఆరోగ్యమూ, బలమూ భద్రంగా ఉంటాయి. దినానికి రెండు పూటలే తిను. తగినంతే తిను. మితిమీరిన, మతిమాలిన తిండి రోగాలకు, మృత్యువుకు దారితీస్తుంది.

సర్వజ్ఞుడు సర్వసంగ పరిత్యాగి అయినా, జీవితం పట్ల అతనెంత గాఢమైన అభిలాష కలిగినవాడో ఇలాటి ఆచరణాత్మక సూచనలన్నీ తెలియచెప్పుతాయి. అదోవిధమైన నిస్సంగ, నిస్స్వార్థ శ్రద్ధను ప్రజాసంక్షేమం పట్ల ఆయన కనబరుస్తాడు. ఆయన ప్రధాన ఉద్దేశం, తోటి వారిని సరైన త్రోవలో నడిపించడం, వారి జీవన దృక్పథాలను సరిదిద్దడమే. అంచేత ఈ ప్రపంచం అందరూ సుఖంగా జీవించడానికి అనుకూలిస్తుందని ఆశ. ఆయన సానుభూతి ఎప్పుడూ పేదలపట్లే, నిరక్షరాస్యులైన బడుగు ప్రజలపట్లే. మానవజీవితంలోని సుగుణాలను, బలహీనతలను అతనికంటె బాగా

తెలిసిన వారులేరు. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, సవిమర్శగా చూశాడు, ఏ భయ భ్రాంతులు లేకుండా తాననుకొన్నది అనుకొన్నట్లుగా చెప్పాడు.

తాత్త్వికంగా చూసినప్పుడు ఈ ప్రపంచం అశాశ్వతమూ, అసత్యమూ అనే సత్యం సర్వజ్ఞుని కంటె ఎక్కువగా గ్రహించినవారు లేరు. అయినా ఆయనకు ఈ ప్రపంచం పైఉన్న ప్రేమ అద్భుతమైంది. ప్రతి వాడు ప్రపంచం పోకళ్లను బాగా తెలిసికోవాలి, ప్రతిదాని విలువా తెలిసికోవాలి. అప్పుడే జీవితాన్ని ఎదుర్కోవడానికి సరిగా సన్నద్ధం కాగలడు. జీవించడమనే కళపైన, శాంతీ సంతోషాలు ఆధారపడ్డాయి. మనిషి సామాజిక జీవిగనుక, అతని సామాజిక జీవన సంతోషానికి ప్రాతిపదిక- అతని తోటివారందరిపై వున్న ప్రేమే.

''ఊరెల్ల నెంటరు కేరియెల్ల్వ బళగ

ధారుణియు ఎల్ల కులదైవాగిన్ను

యారన్ను బిడలో సర్వజ్ఞ''

'ఊరంత బందుగులె వాడంత బలగమే

ధారుణి ఎల్ల కులదైవమాయె

ఎవ్వరిని విడువనౌ సర్వజ్ఞ'

ఆవిధంగా తన్నుతాను ప్రపంచ పౌరుడని ప్రకటించుకొంటాడు కవి. జగతితోమమేకం పొందినవాడు మానవ జాతినంతా ఒక్కకుటుంబంగా పరిగణించాలి. కులమత భేదాలను, సంకుచిత ప్రాంతీయ అభిమానాలను పరిత్యజించాలి.

''నడెవుదొందే భూమి కుడివుదొందే నీరు

సుడువగ్నిగొందె ఇరుతిరె కులగోత్ర

నడువె ఎత్తణదు సర్వజ్ఞ''

'నడుచుభూమియొకటె, కుడుచునీరు ఒకటె

సుడియునగ్ని సూర్యుడొకడె, కులగోత్రములీ

నడుమ ఎన్నిగలుగు సర్వజ్ఞ'.

వాస్తవాలను ఎదుర్కొను. వాటి నుంచి పరాఙ్ముఖునివి కావద్దు. లోకపుతీరులు

అన్నీ మంచివి కావు. మోహ, లోభాలచే పాలించబడే లోకం, ధనానికి అధికారానికి ఆక్రాంతమవుతుంది. ఏరంగమైనా తీసికో, మతంకానీ, రాచరికంకాని, మనుష్యులు- ముఖ్యంగా నేతలు- అవినీతి పాలయ్యారు. పడుచు, పసిడి, పంటపొలం అంటే మరులు బుట్టనివారు బహు అరుదు:

*''హెణ్ణన్ను హొన్నన్ను హణ్ణాద మణ్ణనను*
*కణ్ణోలి కండు మనదళి బయసదిహ*
*అణ్ణగళదారు సర్వజ్ఞ''*

''పెణ్ణును, పొన్నును, పండంటి మన్నును
కన్నెత్తిగాంచి మనస్సులోగోరని
అన్నలెవ్వరు సర్వజ్ఞ''

అయితే ఈగుప్త వాంఛ బయలు పడకనే కనుసురుగవుతుంది. ప్రతివారికీ మంచిగా కనిపించాలని, మంచి అనిపించుకోవాలని ఆశ. అంచేత ప్రతి వారూ అత్యున్నతమైన నీతి సూత్రాలను వల్లిస్తారు :

*''వచనదొళెల్లరూ శుచిధీర వీరరు*
*కుచహేమ శస్త్ర లివు సోంకె లోకదళ*
*గచలితరారు సర్వజ్ఞ''*

''వచనాన ఎల్లరూ శుచిధీరవీరులే
కుచ, హేమ, శస్త్రాలు సోకగా లోకమున
అచలితులెవరయ్య సర్వజ్ఞ'

బంగారం మహాచెడ్డది. బంగారం అనే మాట వినబడగానే సన్యాసి మనస్సుకూడా ప్రక్కదారి పడుతుంది. గుణవంతురాలైన ఇల్లాలి మనస్సు చెడుతుంది. వివేకవంతులు కూడా భ్రాంతి జాలంలో పడతారు.

నిజానికి ఈలోకం చాలా క్షుద్రమైంది. ఇక్కడ 'గుణము దోసమౌను, దోసము గుణమౌను' దుర్మార్గులు బాగుపడతారు. సన్మార్గులు బాధపడతారు. ఇదంతా

వికృతమైన, వ్యత్యస్తమైన విలువలతో నిండిఉంది. ధనసంపాదన వల్లనే ధనికులు గౌరవం పొందుతున్నారు. పేదరికం తప్ప మరే దోషం లేకపోయినా పేదలు నానా అవమానాలకు, ఆత్మహింసలకు గురి అవుతున్నారు.

''న్యాయదలి నడెదు అన్యాయవే బందిహుదు
నాయిగళు ఆరు ఇరువనక నరరొందు
నాయి హిండెనద సర్వజ్ఞ''

''చారు న్యాయమునచనగ అన్యాయమే ఎదురౌను
ఆరు కుక్కలు[1]ఉండగా మనుజులొక
పారు కుక్కల మందయే సర్వజ్ఞ''

పాలకులు అసమర్థులూ, బలహీనులూ అయినప్పుడు, క్రూరులూ, దౌర్జన్యపరులూ అయినపుడు పరిస్థితి మరింత భయానకంగా ఉంటుంది. అన్ని విధాల వ్యసనాలకులోనై, స్వార్థపరులైన అధికారులచే దుర్మార్గులైన సలహాదారులచే చుట్టబడి, ప్రజాక్షేమమంటేనే పట్టింపు లేకుండాఉన్న ప్రభువులు, దేశం పాలిట శాపమవుతారు.

వారేకాదు, గుళ్లలో పూజారులు, మఠాల్లో సన్యాసులు తమ కర్తవ్యాల్ని మరచి, శుద్ధసోమరులై, తిండిపోతు బ్రతుకు నడుస్తున్నారు.

ఇదంతా సర్వజ్ఞుడు చూపే వాస్తవిక చిత్రంలోని ఒకవైపు మాత్రమే. ఆయనకు లోకమంటే అర్థంలేని విముఖత లేదు. లోకంలోని మంచివైపును కూడా ఆయన చూడకపోలేదు. మంచి చెడులు రెండూ విడదీయరానంతగా ఈలోకంలో కలిసి పోయాయంటాడు. ఇలాటి కల్లోల స్థితిలో కూడా తమ్ము తాము పోగొట్టుకొనని వారుండడం ఒక కొంత ఓదార్పునిచ్చే విషయం. వారికింకా విచక్షణ ఉంది. పాపం నుండి పుణ్యాన్ని, నలుపునుండి తెలుపును విడదీసి చూసే శక్తి ఉంది. అందువల్లే ప్రపంచమింకా సవ్యంగా, సరసంగా సాగుతూఉంది. లేకుంటే ఎప్పుడో అంతరించి ఉండేది. దాన్నలాగుంచితే, ప్రపంచాన్ని సంస్కరించడానికంటె ముందు, తన్నుతాను సంస్కరించుకోవడం సులువు, వివేకవంతమైందికూడా.

---

1. ఆరు కుక్కలూ మానవులకుండే ఆరు శత్రువులు - కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలు.

అంచేత సరైన నడతను ఎంచుకొమ్మని ప్రజలను ఉద్బోధిస్తాడు సర్వజ్ఞుడు. తన మేలుగాని, అందరి మేలుగాని, జాగ్రత్తగా అలా ఎంచుకోవడంలోనే దాగిఉంది.

మంచి నడత అంటే ఏమిటో సంక్షిప్తమైన ఈ మాటల్లో వ్యక్తమవుతుంది.

''దిటవె పుణ్యద పుంజ సటెయ పాసద బీజ
కుటిల వంచనె పోగదిరు నిజది పిడి
ఘటవ నెచ్చదిరు సర్వజ్ఞ''

''గట్టిదిపుణ్యపుంజము, ఒట్టిది పాపబీజము
చెట్ట కుటిల వంచనల బోకు, నిజము వీడి
మట్టి కుండను నమ్మకు సర్వజ్ఞ''

మంచి చేతల మూలంగానే మంచి ఫలితాలు లభిస్తాయి. పాపపు పనులవల్ల భవిష్యత్తులో సత్ఫలితాలు ఎలా దక్కుతాయి ? గతకాలపు పాపాలు, వర్తమాన సంపదల వల్ల అంతరిస్తాయా ?

''సత్యవెంబుదు తాను నిత్యదలి మెరెదిహుదు
మిథ్య సత్యవను బెరెదరూ ఇహపరది
సత్యక్కె జయవు సర్వజ్ఞ''

''సత్యమన్నది తాను నిత్యమూ శోభించు
మిథ్యసత్యములు కలిసినా, ఇహపరాల
సత్యానికే జయము సర్వజ్ఞ''

అందువల్ల సత్యాన్నే అంటిపెట్టుకొనివుండు. అసత్యాలు చెప్పడానికి సిగ్గుపడు :

''హుసియ పేళ్వదరింద హసిదు సావుదు లేసు
హుసిదు మరెయువన బదుకింద హిందియా
ఇసియ లేసెంద సర్వజ్ఞ''

''అబద్ధమాడుటకంటె ఆకటబడి చచ్చుటమేలు
అబద్ధపు పేర్మి బ్రతుకుకంటె, పంది
అశుద్ధము మేలందు సర్వజ్ఞ.''

సత్యమార్గంలోని మనిషిని లోకమంతా గౌరవిస్తుంది, దేవుడూ ప్రేమిస్తాడు.

*''సత్యరగె ధరెయెల్ల మస్తకవనెరగువుదు
హెత్త తాయ్మగన కరెవంతె శివనవర
నెత్తికొంబువను సర్వజ్ఞ''*

''సత్యశీలురను ధరయెల్ల తల దాల్చు
ఎత్తుబిడ్డను తల్లిగొన్నట్లువానజు
డెత్తి కొండాడడె సర్వజ్ఞ''

వ్యక్తి ఘనతను సర్వజ్ఞుడు ప్రశంసిస్తాడు. ఆఘనతను నిలుపుకోవడానికి రెండు అంశాలు అవసరం. అవి : స్వేచ్ఛ, ఆత్మాభిమానం. వ్యక్తికైనా, దేశానికైనా స్వేచ్ఛ అత్యంత ముఖ్యం.

*''తంతి వాద్యవు లేసు మంత్రియా కెళె లేసు
యంత్ర వాహకన దయె లేసు జగది స్వ
తంత్రావే లేసు సర్వజ్ఞ''*

''తంత్రి వాద్యము లెస్స, మంత్రి మాటయె లెస్స
యంత్ర వాహకునిదయలెస్స, జగతి స్వ
తంత్రమే లెస్స సర్వజ్ఞ''

'ఇతరుల ఇచ్ఛకు ఊడిగమొనర్చని వాడు' ("that serveth not another's will') కామక్రోధాదుల పాలన మొల్లని వాజు' ("whose passions not his masters are') అంతరాత్మ ఆదేశాలను అనుసరించగలడు. తన్నుతాను గౌరవించుకొన్నట్లు ఎదుటివారిని గౌరవించగలిగేవాడే, 'స్వతంత్రత' అర్థాన్ని, దాని నిజమైన విలువను గుర్తించగలడు.

'స్వతంత్ర'మంటే ఆయన ఉద్దేశంలో కేవలం రాజకీయ స్వతంత్రమనికాదు. లేదా ఇతరులనుండి దేన్నీ కోరనవసరంలేని స్వతంత్రమని కాదు. అన్ని కోర్కెలనుండి, మోహాలనుండి, బలహీనతలనుండి స్వేచ్ఛ, విముక్తి అని అర్థం. కేవలం సుఖప్రదమైన జీవితంకోసం ఆత్మాభిమానాన్ని పోగొట్టుకొని ఎవరి దయాదాక్షిణ్యంపై ఆధారపడ్డమైనా దయనీయమేనని చాలా గట్టిగా ఖండిస్తాడు సర్వజ్ఞుడు.

*''హంగి నరమనెయింద నింగదద గుడి లేసు''*

పరాధీనమై అంతఃపురంలో బ్రతకడంకంటె, స్వతంత్రంగా స్వంత గుడిసెలో ఉండడం లెస్స.

*''హంగినా హోలిందె హింగదంబలి లేసు*
*భంగ బత్తుంబ బిసిగింత భిక్షదా*
*తంగుళవె లేసు సర్వజ్ఞ''*

''లొంగి పాలుగ్రోలుటకన్న, అంబలి త్రాగలెస్స
భంగపడితిను ఉడుకన్నము కన్న, భిక్షనె
సంగు చద్దిఅన్నమె మిన్న సర్వజ్ఞ''

సర్వజ్ఞుని అభిప్రాయంలో, మానవ అభివృద్ధికి తొలిమెట్టు విద్యార్జనే. విద్యను నేర్చుకోవడం కంటె సద్గుణాలను పెంచుకోవడం ఆయన దృష్టిలో ముఖ్యం. ఆమాత్రంచేత విద్వత్తు ప్రాధాన్యాన్ని ఆయన తక్కువ చేయడు. సర్వజ్ఞుడంటాడు, పిల్లలకు మంచి చదువు ఏర్పాటు చేయడం ప్రతి తండ్రి ప్రాథమిక కర్తవ్యం. విద్యార్థుల్ని సరైన మార్గంలో నడిపించడం ప్రతి గురువు కర్తవ్యం.

*''విద్యవే తాయ్తందె బుద్ధియే సోదరను*
*అధ్వానకాదవనె నంత సుఖది తా-*
*-నిర్దుదే రాజ్య సర్వజ్ఞ''*

''విద్యయే తలిదండ్రి, బుద్ధియే సోదరుడు
అధ్వానమున గాచువాడే తనవాడు, సుఖముగా తా
నున్నదే రాజ్యమ్ము సర్వజ్ఞ''

. ఎంతటి పేదవాడైనా, విద్యావంతుడైతే ఎక్కడో ఒకచోట, ఇక్కడో, అక్కడో, కడకు కొండ అంచులోనైనా నెట్టుకు రాగలడు.

మనతో సదా ఉండే సంపద జ్ఞానమే. అన్నదమ్ములైనా, దొంగలైనా, రాజులైనా దాన్ని వాదులాడి దోచుకోలేరు.

'కేవలం పుస్తకాలను చదవడం, చెరకు ఆకులను నములుతున్నట్లే. అయితే గ్రంథాలలోని సారాన్ని గ్రహించడం, చెరకులోని రసాన్ని గ్రోలినట్లు. మాటపొందికను నేర్చుకోవడం విద్యలో భాగమే. ఎక్కడ, ఎప్పుడు, ఎలా మాట్లాడాలో తెలిసికోవడం చాలా ముఖ్యం. మాటలు స్నేహితుల్ని కూరుస్తాయి, ఉల్లాసాన్నీ కలిగిస్తాయి. మాటలు వెగటు పుట్టిస్తాయి. హత్యలను ప్రేరేపిస్తాయి. మాటలే సంపదను, ప్రాభవాన్ని తెస్తాయి. అందువల్లే మాటే అసలైన రత్నం. అవసరం వచ్చినప్పుడే మాట్లాడు, అవసరమైనంతవరకే మాట్లాడు. ఆహ్లాదకరంగా, అర్థవంతంగా మాట్లాడు.'

''ఎల్ల బల్లవరిల్ల బల్లవరు బహళిల్ల
బల్లిదరు ఇద్దు బలవిల్ల సాహిత్య
వెల్లవరిగల్ల సర్వజ్ఞ''

''ఎల్లతెలిసినవారు లేరు, ఎల్లరూ తెలిసినవారుకారు
ఎల్లరు తెలిసినవారైనా బలమేమిరాదు, సాహిత్య
మెల్లరకు కాదు సర్వజ్ఞ.''

అలాంటప్పుడు తనకవసరంలేని జ్ఞానానికై ఎవరైనా ప్రాకులాడటమెందుకు ?

క్రమశిక్షణ, త్రికరణశుద్ధి, వాక్శుచి, నిశ్శబ్దమైన- ఆర్భాటంలేని- ఆచరణ, చెప్పే సూక్తులను స్పష్టంగా పాటించడం - ఇవీ నిజంగా చదువూ, సంస్కారమున్న వారినుండి ఆశించే లక్షణాలు.

విద్యార్జన పిమ్మట ఏదో ఓ వృత్తిని చేపట్టి తనకాళ్లపై తాను నిలబడ్డం బాగుంటుంది. నిరర్థకంగా ఉండకూడదు. కష్టించే వారినే అదృష్టం వరిస్తుంది. సోమరులూ, నిర్వ్యాపారులూ ఉన్న కాసంత ధనాన్నీ పోగొట్టుకొంటారు. కనుక ప్రతి వారూ కష్టపడి పనిచేయాలి. నిజాయితీగా పనిచేయాలి. అయితే అదే సరిపోదు. సమర్థంగా కూడా పని చేయాలి. మంచి ప్రతిభ, నైపుణ్యం కలిసినప్పుడే సమర్థత వస్తుంది.

ఒక సామాజిక తత్త్వవేత్తగా సర్వజ్ఞుడు కాయకష్టం ప్రాముఖ్యాన్ని నొక్కిచెబుతాడు. అన్ని సామాజిక, ఆర్థిక సమస్యలకు అదే పరిష్కారమార్గమంటాడు. అందుకోసమే వ్యావసాయికకృషి ప్రాశస్త్యాన్ని గురించి ఆయనంటాడు :

*''కోటి విద్యెగళల్లి మేటి విద్యనే మేలు*
*మేటియిం రాటి నడెదు దల్లదె దేశ*
*దాటవె కెడుగు సర్వజ్ఞ''*

''కోటి విద్యలలోన మేడు (నాగలిమేడు) విద్యయేమేలు
మేటితోరాట్నమ్మునడుచు, లేదేని ఏదేశ
పాటయు చేటగు సర్వజ్ఞ''

గౌరవంగా బ్రతకడానికై, నిజాయితీగా సంపాదించాలనడంలో ఏ అనుమానమూలేదు. అయితే తినడమూ, ధనం కూడబెట్టడమూ మాత్రమే జీవితలక్ష్యాలు కావు. లోభత్వం ఉండకూడదు. లోభాన్ని జయించాలంటే, ప్రేమతో, తోటివారిపట్ల కారుణ్యంతో దానం చేయడాన్ని అలవాటు చేసికోవడమే ఉత్తమ మార్గమంటాడు కవి. దానం చేసినదానికి పదింతలు తిరిగివస్తుంది. దాచి బెట్టిన ధనం ఇతరుల అనుభవం పాలవుతుంది. అందువల్ల ధారాళంగా, మనసారా దానం చేయమంటాడు. అలాగే తనకోపాన్ని, అసూయను, మాత్సర్యాన్ని అణచుకోవాలని ప్రబోధిస్తాడు. త్రాగుడు, జూదం, వ్యభిచారం వంటి వ్యసనాలపట్ల, వాటి ఆకర్షణల పట్ల విముఖులు కమ్మని ప్రజల్ని తన విలక్షణరీతిలో హెచ్చరిస్తాడు సర్వజ్ఞుడు. త్రాగుబోతు త్వరత్వరగా తనకున్నదంతా పోగొట్టుకొని, కడకు తన కాపురాన్ని కూడా కూల్చివేసికొంటాడు. బలహీనులేకాదు, దృఢమైన మనసున్నవారుకూడా వనిత, విత్తం, సురాపానాలనే గోతుల్లో పడిపోతుంటారు. మదిర, మగువలున్నచోట తన్ను తానే నమ్మవద్దంటాడు కవి. స్త్రీమోహం పట్ల, ముఖ్యంగా వేశ్యలపట్ల చాలా జాగ్రత్తగా ఉండమంటాడు. ఆడవారు జీవితాన్ని ఇవ్వనూగలరు, అధ్వాన్నం చేయనూగలరు.

*''నంబిదంతిరబేకు నంబదె ఇరబేకు*
*ఇంబరిదు ఎచ్చరిరబేకు హెంగూస*
*నంబిదవ కెట్ట సర్వజ్ఞ''*

''నమ్మినట్లుండాలి, నమ్మకనె ఉండాలి
నమ్మికమూలమ్ము తెలిసిఉండాలి, స్త్రీల
నమ్మిన చెడును సర్వజ్ఞ.''

అయితే ఆడవాళ్లలో ఉన్నత గౌరవానికి యోగ్యులైన వారూ ఉన్నారు. శ్రీమద్రామాయణంలోని సీతమ్మను అత్యున్నతంగా భావిస్తాడు సర్వజ్ఞుడు. ఆతల్లి మూర్తిదాల్చిన స్త్రీత్వమేనంటాడు. అలాగే భర్తపట్ల భక్తి, విశ్వాసాలతో, కుటుంబంపట్ల బాధ్యతతో మెలిగే ప్రతి స్త్రీ వందనీయురాలేనంటాడు.

శాంతి సంతోషాల మర్మం, భగవంతునిపట్ల విశ్వాసంలో, సంతృప్తిలో ఉందంటాడు సర్వజ్ఞుడు. సమతా ధర్మంలో తన పాలికి వచ్చినదాన్ని ప్రతివారూ అంగీకరించాలి. 'మన జీవితాలను నడిపించే విధి ఒకటుంది' అనేదాన్ని సర్వజ్ఞుడు గట్టిగా నమ్ముతాడు. అయితే ఆయన అన్నిటికీ విధివ్రాతను అంటగట్టే, పురాకృత కర్మఫలవాదికాడు. తన చేతలవల్లే, తనమంచిచెడులవల్లే విధి ప్రాప్తి ఉంటుందంటాడు. విత్తిన గింజే పండుతుంది. అలాంటప్పుడు తాను చేసిన తప్పులకు విధినో, దైవాన్నో నిందించడమెందుకు ? భగవద్భక్తునికి ఇది చాలా సామాన్యమైన విషయం. ఆబాధ్యత కూడా ఆయన భగవదేచ్ఛకే సమర్పిస్తాడు.

*''అంతిక్కు ఇంతిక్కు ఎంతిక్కు ఎనబేడ*
*చింతెయలి దేహ బడవక్కు శివ తోరి-*
*-దంతిహుదె లేసు సర్వజ్ఞ''*

''ఆలాగు, ఈలాగు, ఏలాగు అనుకోకు
నీలావు బోవును చింతలోబడి, శివుడు జూపెడి
ఆలాగె తానుంట లెస్స సర్వజ్ఞ.''

కులతత్వాన్ని, అర్థంలేని ఆచారాలను, మతసంప్రదాయాలను, చిహ్నాలను పూర్తిగా వ్యతిరేకిస్తాడు సర్వజ్ఞుడు. వాటిని బాగా హేళన చేస్తాడు. మత గ్రంథాలను వాటి ప్రాముఖ్యం తెలిసికోకుండా, సారం గ్రహించకుండా చదవడం, మతం గుర్తును నుదుటిమీద ధరించడం, జంధ్యాన్ని వేసికోవడం, తీర్థయాత్రలు చేయడం - ఇలాటివి ఆధ్యాత్మిక మార్గంలో ఎంతో దూరం తీసుకొని పోవు. భగవంతునికి కుల భేదం తెలియదు. ఏ మతం గొప్పదీకాదు, తక్కువదీకాదు. ఈ ఉచ్చ, నీచాలు మానవ

కల్పితాలు. పరమ అంటరానివారంటే చచ్చినవాటిని తినేవారుకాదు, మనుష్యుల్ని తినేవారు, మనుష్యుల్ని దోపిడీచేసి బ్రతికేవారు. ప్రకృతి సహజంగా మనిషికీ మనిషికీ మధ్య ఏభేదమూలేదు, ఉండదు.

''జాతి హీనర మనెయ జ్యోతి తాహీనవె
జాతి విజాతి ఎనబేడ దేవనొలి
దాతనే జాత సర్వజ్ఞ''

''జాతి హీనుల ఇంట జ్యోతి తాహీనమే
జాతి విజాతి అనవద్దు దేవప్రియుడౌ
డాతడే జాతుడు సర్వజ్ఞ.''

ఏకులాన్ని, మతాన్ని, వాటి బలహీనతలను ఎత్తిపొడవకుండా సర్వజ్ఞుడు వదల్లేదు. మతాలన్నిటిలోకి ప్రేమను, అహింసను పాటించేదే గొప్పమతమంటాడు. అదే ఆచరించదగ్గదీ, గౌరవించదగ్గదీ అంటాడు. ఉదాహరణకు జైనమతం అహింసను ప్రధానధర్మంగా ఎంచుకొన్నదంటాడు.

సర్వజ్ఞుడు మతాన్నికాక, ఆధ్యాత్మిక తత్త్వాన్ని ఆదరిస్తాడనేది స్పష్టం. హైందవదర్శనం, తాత్త్విక సంప్రదాయాల మేరకు, ఆత్మజ్ఞానమే, దైవసాక్షాత్కారమే జీవితానికి ప్రధానలక్ష్యమంటాడు సర్వజ్ఞుడు. అందులో వీరశైవ ప్రాశస్త్యాన్ని ఉగ్గడిస్తాడు. ప్రాపంచిక మార్గంలో, ఆధ్యాత్మిక సాధనలో సమ్యక్ జ్ఞానాన్ని వీరశైవం ప్రబోధిస్తుంది. దైవికవాంఛ పరితృప్తిలో మునిగిపోకుంటే, మితమెరిగిన సంతోషాలతో, సద్గుణాలతో సాగే ఈ ప్రాపంచిక జీవితం, సమున్నత ఆధ్యాత్మిక ఆనందానికి సాధనమే అవుతుంది.

ప్రాచీనకాలపుఉపనిషత్ద్రష్టలు ప్రబోధించిన సందేశాన్ని పన్నెండవ శతాబ్దిలోని శివశరణులు ప్రవచించినదాన్ని, బసవేశ్వరుని వచనాలలో అద్వితీయమైన సారళ్యంతో అభివ్యక్తమైన దాన్ని సర్వజ్ఞుడు పునరుద్ఘాటించాడు.

సర్వవ్యాపకుడూ, సర్వశక్తిమంతుడూ, సర్వజ్ఞుడూ అయిన దైవమొక్కడే. ఆయన సర్వకృపాశీలి. ఆయన సృష్టించిన ఈ విశ్వం అద్భుతమైంది, నిగూఢమైంది. ఆయనను తెలిసికోవడానికి అత్యంత సులువైన దారి, అంతశ్శుచితో భక్తి, విశ్వాసాలు కలిగి ఉండటమే. సహప్రాణులపట్ల ప్రేమ, కారుణ్యాలు లేనప్పుడు మనస్సును నిగ్రహించుకొని, సమబుద్ధిని చూపలేనప్పుడు, ఎన్ని దేవతా విగ్రహాలను ఆరాధించినా,

ఎన్ని శాస్త్రగ్రంథాలను అధ్యయనం చేసినా ఆయన అనుగ్రహానికి పాత్రులు కాలేము. ఆయన్ను వెదుకుతూ ఏదూరాలకు పోనక్కరలేదు. మనలోనే దర్శించుకోవచ్చు. ఆత్మను తెలిసికొంటే, పరమాత్మను తెలిసికొన్నట్లే.

అప్పుడు మార్గదర్శిగా ఒక సద్గురువు లభించాలి. ఆయన ఆధ్యాత్మిక సంపన్నుడై ఉండాలి. ప్రేమ, దయ మూర్తీభవించి ఉండాలి. ఎంత మేధాశక్తి, విద్య, కఠిన ప్రయత్నాలు, నియమాలు ఉన్నా సద్గురుని కృపలేక, ఆయన మార్గదర్శనంలేక ఏదరినీ పొందలేము. దివ్యత్వాన్ని చూపడానికి గురువుకంటె శక్తి సంపన్నులు లేరు. కనుక సంపూర్ణ హృదయంతో, ఆత్మతో గురువును సేవించాలి. అదే సమయంలో కపటులైన దొంగ గురువుల పట్ల హెచ్చరికతో ఉండాలి.

పవిత్రమైన ఆధ్యాత్మిక కేంద్రాలలో ఉన్నవారంతా నిజమైన ఆధ్యాత్మిక పురుషులుకారు.

*''అట్ట పాకద రుచియ సట్టుగ బల్లుదె*
*శ్రేష్టరు గళెందు ఎనబేడ అరివిన*
*బట్టె బేరెంద సర్వజ్ఞ''*

''వండు పాకము రుచి కుండకేమెరుక
మెండుగానందర శ్రేష్టులనబోకు, ఎరుక
నుండెడివారెవేరు సర్వజ్ఞ.''

ముతాలవంటి ఆధ్యాత్మిక కేంద్రాలలో ఉన్నంత మాత్రాన, మానవులు గొప్పవారూ కారు, జ్ఞానసంపన్నులూకారు. కామ, లోభాలనుండి క్రోధ, అహంకారాల నుండి ముక్తుడైన వాడే జ్ఞాని. ఆధ్యాత్మిక అనుభవం కలిగినవారే గౌరవింప తగ్గవారు. తాత్త్విక స్పృహను పెంపొందించే మార్గాలు భిన్నమైనవి. తత్త్వశాస్త్ర పరిజ్ఞానమూ, శాస్త్రగ్రంథ వైదుష్యమూకూడా నిరుపయోగమే. ఏనుగు చెరకు రసాన్ని గ్రోలుతూంటే, గొర్రెలు చెరకు ఆకుల్ని నములుతున్నట్లుందది. కనుక శిరోముండనం, కాషాయవస్త్ర ధారణంవంటి బాహిర రూపాలుకావు, సన్యాసిని తీర్చిదిద్దేవి. సర్వసంగ పరిత్యాగంచేసి, ఆత్మానుభవంతో పరమాత్మను గ్రహించే మానసిక పక్వత, పవిత్రత, ఏకతలు సాధువును సాధువుగా చేస్తాయి.

తన్ను తానెరిగినవాడే, కాంతిని తనలో లీనం చేసికోగలడు. అలాటి ఆత్మప్రకాశం గలవాడే నిజమైన జ్ఞాని. ఆయన పసిబిడ్డంతటి అమాయకుడు. ఆయనెప్పుడూ విశ్వచైతన్యపు మహోన్నత స్థితిలో ఉంటాడు. ఒకదాన్నుండి మరొకదాన్ని వేర్పరచి చూడడు. ఒక 'జీవుని' నుండి 'మరోజీవుని' వేరుగా చూడడు. అసలు తన ఆత్మనే పరమాత్మనుండి భిన్నంగా చూడడు. అందరిలో, అన్నిటా, ఆ బ్రహ్మమంతటా ఒకే 'తత్' 'త్వమ్'ను దర్శిస్తాడు. అయినా మౌనంగా, నమ్రంగా, నిత్యానంద స్థితి ఉంటాడు. ఈ స్థితిని చేరే సోపానాలు స్పష్టంగా ఉన్నాయి.

భగవద్భక్తి సర్వోత్తమమైంది, మోక్షానికి సర్వోత్కృష్ట మార్గమది. గుండెల్లో అంతటి భక్తి విశ్వాసాలుంటే, తనువే గుడిగా మారుతుంది. ఇంకోగుడికి, మతానికి వెళ్లవలసిన పనిలేదు. జ్వరపీడితులకు పాలుకూడా రుచించనట్లు, దుర్గుణపీడితులకు, పాపమతులకు భగవద్భక్తేకాదు, ఆయనపట్ల ఆలోచనకూడా రుచించదు. త్రికరణశుద్ధితో ప్రార్థన, జీవనోన్నతికై ఆరాటం, సత్సంగం, దుర్జన పరిత్యాగం ఆధ్యాత్మిక సాధనకు ప్రథమావశ్యకాలు. నిజంగా పశ్చాత్తాప తప్తులై, పరమేశ్వరుని శరణు వేడితే పరమపాపులకు కూడా ముక్తి లభిస్తుంది. పరమాత్మపై, సద్గురువుపై ప్రగాఢ విశ్వాసం, సంసార సాగరాన్ని తరింపచేసి ఆనంద తీరాలను చేర్చే నావవంటిది.

ఈసూక్ష్మం తెలిసికొనే జ్ఞానముండాలి :

''అక్కరవు లేఖక్కె తర్కతా వాదక్కె
మిక్క ఓదుగళు తిరుపెగె, మోక్షక్కెర-
-డక్కరనె సాకు సర్వజ్ఞ''

''అక్కరములు లేఖనమునకు, తర్కము వాదమునకు,
తక్కిన విద్యలు తిరుపెమునకు, మోక్షమునకు రెం
డక్కరములె[1] చాలు సర్వజ్ఞ''

వీటితోపాటు పరిశుద్ధమైన అంతరంగంతో తనకు తాను ఋజువుగా ఉండాలి. చెప్పేదానికి చేసేదానికితేడా వుండకూడదు. అనన్య బుద్ధితో సత్యధర్మ మార్గాలను

---

1. 'శి', 'వ' అనే రెండక్షరాలు పరమేశ్వర నామ మంత్రమవుతున్నాయి.

అనుసరిస్తే, గురుకృప, దైవానుగ్రహం అపారంగా ప్రవహించి, అహంకారాన్ని జయింపజేస్తాయి. అటుపిమ్మట అత్యున్నత ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించడానికి మునుముందుకు పురోగమిస్తాడు. ఆ అనుభవాన్ని మాటలు వర్ణించలేవు. పరమమౌనమే అక్కడ పరిపాలిస్తుంది. పరమోన్నత జ్ఞానానికి ఆత్మప్రకాశానికి అదే సంకేతం. దాన్ని గురించి కేవలం మాట్లాడుతుండేవారు, ఎన్నటికీ దాన్ని అందుకోలేనివారే. ఈ పారమ్యస్థితిని సాధించినవారు, తక్షణం ఈ జననమరణ చక్రంనుండి విమోచనం పొందుతారు.

సాధించదగ్గ జ్ఞాన సారాంశ మిదే. సూర్యునికంటె ప్రకాశవంతమైంది లేనట్లే, ఇంతకంటె ఉత్కృష్టమైంది లేదు. జ్ఞాని అయినవాడు తనలో దైవాన్ని సందర్శిస్తాడు. విశ్వచైతన్యంలో ఐక్యమవుతాడు.

# మౌలికతా ముద్ర

ఒకానొక త్రిపదిలో సర్వజ్ఞుడు చాలా నమ్రంగా అంటాడు, 'సర్వులకడ ఒక్కొక్కనుడి నేర్చి విద్యలపర్వతమె యగు'నని. జీవితమే ఒక విద్యాలయంగా భావించినవారు, అలాగే విజ్ఞానం సంపాదిస్తారు. తమ ధ్యానంలో దాన్ని నిలిపి సుజ్ఞానవంతులౌతారు. పువ్వుపువ్వునుండి సేకరించినదాన్ని మధువుగా మార్చుకుంటుంది తేనెటీగ. అలాగే సర్వజ్ఞుని త్రిపదుల్లో కూడా ఎందరెందరో సాధుపుంగవుల, ఎన్నో సామాన్య వాస్తవాల, వ్యక్తిగత అనుభవాల ముద్రలను ప్రతిబింబించే మాటలు, నీతి ప్రవచనాలు, సామెతలు, నుడికారాలు అగుపిస్తాయి. అది ఇతరుల భావమైనా, తన అనుభవంలోనిదే అయినా, దానికి ఇచ్చిన తీర్పు, రూపు మాత్రం అనన్యమైన ప్రత్యేకతతో, అందంగా ఆయన ప్రతిభను ఆవిష్కరిస్తుంటుంది.

సర్వజ్ఞుని త్రిపదులెన్నో, ఆయన బసవేశ్వరునివల్ల, 12వ శతాబ్దంలోని శివశరణులవల్ల ప్రభావితుడై, స్ఫూర్తినొందాడని స్పష్టం చేస్తాయి. వీరశైవ ధర్మాలను పునః ప్రచారం చేయడానికి ఆయన స్పష్టంగా ప్రయత్నించాడు. వీరశైవం భక్తిమార్గాన్ని, ధార్మిక జీవితాన్ని సముద్దీపింపచేసి, జాతి, మత, కుల, వర్గ తారతమ్యాలన్నిటినీ త్రోసిరాజన్న ఒక సామాజిక వ్యవస్థను నెలకొల్పింది. మతాచార డాంబికాలను, మూఢనమ్మకాలను, అర్థంలేని సిద్ధాంతాలను ఖండించింది. శ్రమశక్తి మహత్త్వమూ, ఆధ్యాత్మిక ఏకత్వమూ గౌరవం పొందాయి. అయితే సర్వజ్ఞుని కాలానికి దాని పావిత్ర్యం కనుమరుగైంది. కులరహిత సమాజాన్ని కోరుకొన్న వ్యవస్థ, కడకు 'మరోకులం' గా మారింది.

స్ఫూర్తిలో ఆయన 12వ శతాబ్దిలోని వచనకారుల్లో ఒకడు. వారి విప్లవమైన

సామాజిక భావాలను, హేతుబద్ధమైన దృక్పథాన్ని అనుసరిస్తాడు. కాని వారి ఉద్యమ స్ఫూర్తిని కాదు. వారిలాగే ఆయనకూ సామాజిక న్యాయంపట్ల ఆకాంక్షే ప్రేరణ. సర్వేశ్వరునిపై భక్తివిశ్వాసాలను, వీరశైవ పరమ ధర్మాలైన గురుసేవను, లింగ (శివ, శక్తులనే శాశ్వత సత్యం) ప్రశస్తినీ, జంగమ (సంచారశీలియై భక్తి, సత్య, ధర్మాలను ప్రబోధించడం) ప్రవృత్తినీ, ఆధ్యాత్మిక సాధనలోని ఆరు ప్రస్థానాలను, దశలను ప్రబోధించినా, ఆయన వీరశైవుల కంటె తన దృక్పథంలో మరింత ఉదారంగా మతాతీతంగా వ్యవహరించాడు.

సర్వజ్ఞ వచనాల్లో కొన్ని దేవదాసిమయ్య, అల్లమప్రభు, బసవేశ్వరవచనాల పునరక్తులే. అవి త్రిపది రపంలో కనిపిస్తాయి. అయితే తరచూ వాటిని సర్వజ్ఞుడు మరింత బాగా అందంగా, శక్తిమంతంగా, వ్యంగ్యభరితంగా తీర్చిదిద్దాడు.

ఉదాహరణకు బసవేశ్వరుని ఈ క్రింది వచనాన్ని చూద్దాము.

*''చెఱకుతోటలో బడి గొర్రెల మంద*
*లోనున్న రసము తెలియరాక*
*గడలపై ఆకుల నమలుచుండె;*
*కరియొకటి రసముగ్రోలు;*
*నిన్నెరుగగా మదకరితగుగాని*
*గొర్రెల తగునా కూడల సంగమదేవా !''*

దీన్నే చక్కగా ఒక త్రిపదిలో బోధిస్తాడు సర్వజ్ఞుడు :

*''కురి కుబ్బినొళు హొక్కు అరియదె తనిరసవ*
*హొరగణ సొగెయగివంతె తత్వద*
*కురుహణారరిగు సర్వజ్ఞ''*

''చెఱకుతోటజేరి గొర్రె, తీపిరసము తెలియక
గరకుయాకులదిన్నట్లు తత్వపు
గురుతెవరెకెరుక సర్వజ్ఞ.''

ఇందులో ఏనుగు ప్రస్తావనరాదు. కాని గొర్రెల అసమర్థత, సమర్థులెవ్వరో బలంగా సూచిస్తుంది. గొర్రె, ఏనుగులకు చెందిన రెండు భావ ప్రతిమలు ఒక్కటిగా కలిసిపోయి, పద్యంలోని వ్యంగ్య వైభవాన్ని మరింత పెంపొందిస్తాయి.

అలాగే బసవేశ్వరుడు ''చచ్చిన పశువుగోసిదిన్నవాడు, చెచ్చెర అంటరానివాడు కాబోడు, చంపి పశువుల యాగములొసేయువాడు, చెట్టకర్మ అంటరానివాడౌను.'' అన్న మాటలు ఇంకా విస్తృత ప్రాముఖ్యంతో, సర్వజ్ఞుని త్రిపదిలో అలాసాక్షాత్కరిస్తాయి .

''సత్తుద తింబాతనెత్తణ హొలెయను
ఎత్తి జీవదువ కొరళిరుదు తింబాత
నుత్తమద హొలెయ సర్వజ్ఞ''

''చచ్చినదానిదినువాడెట్టి అస్పృశ్యుడు
మెచ్చి జీవమును జంపి దినువాడే
అచ్చపు అస్పృశ్యుడు సర్వజ్ఞ.''

యజ్ఞయాగాదుల పేరిట జంతువుల్ని చంపి ప్రసాదం పేరిట తినే పురోహితుడు మరింత అస్పృశ్యుడు. అలాగే స్వార్థంకోసం బేలలైన దరిద్రుల్ని దోపిడిచేసేవారు,మోసగాళ్లు, నయవంచకులు, ప్రజాద్రోహులు వీరంతా అశ్పృశ్యులేనని, ఖండించతగ్గవారనే భావాన్ని ఈపంక్తులు సూచిస్తాయి. ఒక్కమాటతో సంఘంలోని అన్ని రకాల దోపిడీలపై దాడిచేస్తాడు సర్వజ్ఞుడు.

అల్లమ ప్రభులాగే సర్వజ్ఞుడుకూడా ప్రగాఢమైన ప్రత్యేకతగలవాడు; ఆవేశపరుడు; అబద్ధాలు, అన్యాయాలు, దుర్మార్గాలంటే తీవ్రమైన ప్రతిఘటనా, అసహనమూ ఉన్నవాడు. అయితే కవితా ప్రాశస్త్యంలో ఆయన బసవేశ్వరునికి దగ్గరగా వస్తాడు. 12వ శతాబ్దంలో వీరశైవ యోగులందరిపట్ల సర్వజ్ఞునికి అమితగౌరవం. బసవేశ్వరుడంటే అపారభక్తి. సర్వజ్ఞునికి ఆయన పరమాదర్శం.

బసవేశ్వరుడు ప్రబోధించిన వీరశైవ మార్గంలో జీవించడం ఆయనకిష్టం. అయితే అది అప్పుడున్న వికృతస్థితిలో, దాన్నొకమతంగా ప్రచారంచేయడంలో ఆసక్తిలేదు. ఆయనజైనంలోనూ, వైదికబ్రాహ్మణ మతంలోనూ ఉన్నమంచి అంశాలను కూడా అభిమానిస్తాడు. తన తోటివారిని వీరశైవులుగా మార్చడంకంటె, మంచి మానవులుగా తీర్చడంలోనే ఆయనకు ఆసక్తి ఎక్కువ. అందుకే ఆయన ప్రత్యేకంగా, స్వేచ్ఛగా, ధైర్యంగా కులమతాల పరిధుల్ని అధిగమించి, పరిణామశీలంగా కనిపిస్తాడు. అదే సమయంలో ఎలాటి ఆత్మవైరుధ్యమూ చూపకుండా, ఆచరణ ప్రాయమై, నిత్యజీవితానికి, అన్వయయోగ్యమైన వీరశైవ తత్త్వసారాన్ని దాని స్ఫూర్తిని మనఃపూర్వకంగా ఎలుగెత్తి చాటుతాడు.

# నైతిక ప్రబోధ సంప్రదాయంలో.....

''యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్''

-భగవద్గీత, 4 - 7

జగత్తును దైవశక్తి పాలిస్తున్నదనీ, ప్రతికాలంలోనూ ప్రజల తీరును సరిచేసి సరైన త్రోవలో పెడుతుంటుందని తెలిపే ఈసత్యవచనం, మనకు ప్రియంగా ఉండడమేకాదు, మానవజాతి చరిత్రలోని వాస్తవ ప్రక్రియ అనికూడా అర్థమవుతుంది.

ఎప్పుడు సమాజంలో నైతిక పతనమూ, మానవ విలువల తిరస్కారమూ, ఆధ్యాత్మికభావ శూన్యతా ఏర్పడుతాయో అప్పుడు ధార్మిక సంస్కరణ నిమిత్తం సాధుపురుషులూ, నైతిక సామాజిక సంస్కరణ నిమిత్తం మహాకవులూ ఉద్భవిస్తారు.

మధ్యయుగాన భారతదేశంలో అలాటి ఎందరో సాధుపుంగవులూ, కవులూ సాక్షాత్కరించి, సామాజిక సంస్కరణకోసం, నైతిక ఆధ్యాత్మిక పునరుజ్జీవంకోసం, వివిధ మతాలు బోధించే విశ్వమానవ విలువల పునః ప్రచారంకోసం తమను తాము అంకితం చేసికొన్నారు. అలాంటి మహనీయుల్లోకొందరు - పంజాబ్‌లో గురునానక్, మహారాష్ట్రలో జ్ఞానేశ్వర్, తుకారామ్, ఏక్‌నాథ్, రామదాసులు; గుజరాత్‌లో మీరాబాయి, నారసిమెహతాలు; ఉత్తరదేశంలో కబీర్, తులసీదాస్, సూరదాసులు; అస్సాంలో శంకరదేవ్, బెంగాల్‌లో విద్యావతి, చండీదాస్, చైతన్యప్రభులు; కర్ణాటకలో పురందరదాస, సర్వజ్ఞులు; ఆంధ్రంలో వేమన వంటివారు.

తిరుపళ్లువరు, భర్తృహరి, సర్వజ్ఞ, వేమనలు ఈ సంప్రదాయానికి చెందుతారు. ఈ నలుగురినే ఒక వర్గంగా సేర్కొనడమెందుకంటే, వీరి ప్రవచనాల్లో కొట్టవచ్చినంత భావసారూప్యం కనిపిస్తుంది. నైతిక కవితాధారను వారు తమ సేవలతో సుసంపన్నం చేశారు.

తమిళకవియైన తిరువళ్లువరు, దాదాపు రెండువేల సంవత్సరాల క్రితం జీవించాడు. తమిళసాహిత్యంలో అత్యంత ప్రాచీనమైన సంగం యుగానికి, క్రీ.శ. 1వ శతాబ్ది ప్రాంతానికి చెందినవాడుగా ఆయనను గుర్తిస్తారు. ఆయనకూడా సర్వజ్ఞుడిలాగానే సామాన్య కుటుంబంలో జన్మించినవాడు. ఆయన పుట్టుక, తల్లిదండ్రుల గురించికూడా అస్పష్టత అలుముకొనివుంది. అయితే సర్వజ్ఞునివలెగాకుండా, తిరువళ్లువరు సంతోషంగా పెళ్లిచేసుకొని, సుఖంగా కుటుంబ జీవితంలో స్థిరపడ్డవాడు. వృత్తికి నేతపనివాడు. సమతాభావానికి, విజ్ఞానవివేకాలకు, కవితా నైపుణ్యానికి పేరుపొందినవాడు. వివిధ సందర్భాలలో ఆయన వెలువరించిన భావాలు తరువాతి రోజుల్లో లిఖిత రూపంపొంది, ఆయన అభిమానులచేత సంకలనం చేయబడ్డాయి. ఆయన ప్రవచనాల సంపుటిని 'తిరుక్కురళ్' అంటారు. తమిళవాఙ్మయంలో అది మహాకావ్యం. పండితులూ, పామరులూ కూడా ఇప్పటికీ దాన్ని సమంగా ఉదాహరిస్తూనే ఉంటారు. కురల్ అంటే చిన్న - బహుశః రెండు పంక్తుల సంక్షేప కవితా రూపం, ద్విపద అని అర్థం. అయితే ఆచిన్న పద్యరూపమే అనంతమైన విజ్ఞాన ప్రపంచాన్ని ఇముడ్చుకొని ఉంటుంది. కన్నడంలో త్రిపదిలాగ, తెలుగులో చతుష్పదిలాగా తమిళంలో అది ప్రసిద్ధమైన ఛందోరూపం. కురల్‌లో ఒక పరిపక్వమైన మనస్సు, ఆలోచనా ప్రేరకమైన వివేకవంతమైన దృక్పథం అత్యుత్తమమైన యోగి మాత్రమే సాధించే మనోవాక్కర్మల మధ్య చక్కటి సమన్వయం, పొందిక ప్రస్ఫుటమౌతుంటాయి. వాడుక భాష, ఉక్తిసంక్షిప్తత అనేవాటిల్లో తిరువళ్లువర్ వాక్కులు సర్వజ్ఞ, వేమన వచనాలతో సరిపోలుతుంటాయి. అదే నైతిక నిష్ఠ, విలువలు, ప్రాపంచిక వివేకానికి, సామాన్య అనుభవానికి సంబంధించిన ఊహలు అగుపిస్తున్నా, కవిస్వభావానికి సంబంధించి మాత్రం ఓ భేదాన్ని కూడా గుర్తించవచ్చు. స్వభావరీత్యా తిరువళ్లువర్ చాలా సౌమ్యుడు, సంయమనం ఉన్నవాడు. సర్వజ్ఞ, వేమనల్లాగా ప్రచండమైనవాడు కాడు. మానవ బలహీనతలను, ధూర్తతలను చూసి ఆయన ఎప్పుడూ ఉద్రేకపడడు. మృదువుగా, దయగా, ప్రగాఢసానుభూతితో, మానవ స్వభావాన్ని, ప్రాపంచిక మార్గాలను, అర్థంచేసికొంటూ మాట్లాడుతాడు.

మానవ జీవితానికి లక్ష్యప్రాయమైన ధర్మ, అర్థ, కామాలనే మూడు పురుషార్థ[1]

---

1 నిజానికి ధర్మార్థకామమోక్షాలని నాలుగు పురుషార్థాలు. కాని ఇందులో మూడే ఉపలక్ష్యమయాయి.

సంబంధాలుగా తిరుక్కురల్‌లోని సూక్తులు వర్గీకరించబడ్డాయి. ఈ మూడు శీర్షికల క్రింద 1330 ప్రవచనాలున్నాయి. ధర్మవిభాగంలోని సూక్తులు భగవద్భక్తి, విశ్వాసాలను, శుచిని, శీలాన్ని, సద్గుణ సంపత్తిని, కుటుంబంపట్ల సమాజంపట్ల, దేశంపట్ల మనిషి బాధ్యతలను, కర్తవ్యాలను చిత్రిస్తాయి. అర్థవిభాగంలోని సూక్తులు, సామాజిక - రాజకీయ, ఆర్థిక అంశాలపై ఉంటాయి. ప్రేమా, పెళ్ళి విభాగంలోని ఇంద్రియ నిగ్రహం మొదలైన వాటిని ప్రస్తావిస్తాయి.

సత్య, ధర్మ, అహింసలనే గుణాలను, సర్వోన్నతంగా పరిగణించడంలోను, కోపం, లోభం, మాత్సర్యాలకు వ్యతిరేకంగా తోటివారిని హెచ్చరించడంలోనూ, పేదలు, బడుగువర్గాలవారిపట్ల సానుభూతిని వ్యక్తపరచడంలోనూ, మంచి గృహస్థు అర్థమనస్కుడైన సన్యాసికంటె మాననీయుడని శ్లాఘించడంలోనూ - ఇలా అన్నిటా తిరువళ్లువర్, సర్వజ్ఞుల మధ్య భావసారూప్యముంది. ఇద్దరి స్వభావంలోనే తేడా. సర్వజ్ఞుడు తీక్ష్ణమైనవాడు. తిరువళ్లువర్ మెత్తనివాడు, కరుణామయుడు. అయితే ఇద్దరికీ మానవబలహీనతలపట్ల అదే ఉదారవైఖరి. వాళ్లిద్దరూ మానవతను ప్రేమిస్తున్నారు, ఉన్నదున్నట్లుగా ప్రపంచాన్ని ప్రేమిస్తారు.

తిరువళ్లువర్ దారిద్ర్యాన్ని గురించి, ఆత్మీయతతో ఎంతో చెబుతాడు. ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ఆత్మాభిమానాన్ని, గౌరవాన్ని నిలుపుకొమ్మని పేదలను ఉద్బోధిస్తాడు. వారు తముపై తాము ఆధారపడాలని, ఎన్నడూ ఇతరుల దయను, ఆసరాను యాచించకుండా ఉండాలనీ కోరుకొంటాడు. సంతృప్తి, నిజాయితీతో, కష్టించి పనిచేసే స్వభావం, పరస్పర సహకారం, కలిగింది ఇతరులతో పంచుకోవడం - ఇవీ సమాజ సంక్షేమాన్ని కాపాడుతాయంటాడు.

తిరువళ్ళువర్‌కు కూడా సర్వజ్ఞునిలాగే సమాజంపట్ల ఏకోపమూ అక్కసూ లేవు. మనమెలా ఈ ప్రపంచంలో బ్రతకాలో, చాలా ఆత్మీయమైన, మృదువైన స్వరంతో వినిపిస్తాడు.

ఒక్క పుట్టుక విషయంలో తప్ప, మిగిలిన చాలా విషయాల్లో, వేమనకు, సర్వజ్ఞునితో పోలికలున్నాయి. గౌరవనీయమైన మధ్య తరగతి రైతుకుటుంబంలో వేమన జన్మించాడు. సర్వజ్ఞునిలాగే వేమన కాలాన్ని, జీవితాన్ని కూడా నిర్ధారణగా చెప్పే ఏ చారిత్రక దాఖలాలూ లేవు[1]. ఆయన జీవితంలోని ప్రథమదశ, హాయిగా అన్నిసరదాలకు

1. 17వ శతాబ్ది ఉత్తరార్థమని ఆధునిక విద్వాంసుల అభిమతం.

ఆలవాలంగా గడిచిపోయింది. అయితే ఏదో ఒక ముఖ్య పరిణామంవల్ల వేమన యోగి అయ్యాడు. అన్నిటినీ పరిత్యజించి, సన్యాసి జీవితంలోకి వెళ్లిపోయాడు. ఆయన యథేచ్ఛగా చెప్పిన మాటలను అనుయాయులు భద్రపరచి పెట్టారు.

వేమనకూడా జానపద ఛందస్సుకు దగ్గరగా ఉండే నాలుగు పంక్తుల 'ఆటవెలది' పద్యభేదాన్ని తన మాధ్యమంగా ఎంచుకొని, సరళమైన వాడుక భాషనే ప్రయోగించాడు.

జీవితంలోని అన్ని విషయాలను స్పృశించే వేలాది పద్యాలు ఆయననోట వెలువడ్డాయి. అలాటి నాలుగువేల పద్యాలను, అనంతర కాలంలో ఆయన అభిమానులు సేకరించి గ్రంథస్థం చేశారు. ఇందులో ప్రక్షిప్తాలమీద ప్రక్షిప్తాలు చేరి ఉండవచ్చు. పద్దెనిమిది విషయ విభాగాలుగా ఈ సూక్తులు వర్గీకరించబడ్డాయి.

వేమనకూడా ఓసంచారశీలమైన యోగిలా, చిన్న గోచిపాత మాత్రం ధరించి, దేశాన్ని తిరిగాడు. జీవితానికి పనికివచ్చే ఏఅంశాన్ని ఆయన వదల్లేదు. ఎవరినీ మినహాయించలేదు. అన్ని ధార్మిక, సామాజిక, రాజకీయ వంచనలపై, మోసాలపై తన పద్య విమర్శలను సంధించాడు. ఆయన కూడా సర్వజ్ఞునిలాగా కావ్యకీర్తిని, రాజగౌరవాలను తృణీకరించాడు. కవిత్వాన్ని తనఊహలను, జీవనపరిశీలనలను తెలియచెప్పడానికి అభివ్యక్తి మాధ్యమంగా మాత్రమే ఎంచుకొన్నాడు. అదికూడా, తనకు చాలా సహజమైన అభివ్యక్తిరీతి కావడంవల్ల, దానివల్ల సామాన్య ప్రజాహృదయాలను అతిత్వరగా చేరుకోగలడు కనుక, ఆమాధ్యమాన్ని ఎంచుకొన్నాడు.

ఆటవెలది నాలుగు పంక్తుల చిన్న పద్యం. అందులో నాలుగవ చరణాన్ని తన అంకితనామంకోసం వాడుకొన్నాడు వేమన. మిగిలిన మూడు చరణాల్లో అనంతమైన భావాన్ని అతిసంక్షిప్తంగా ఇమిడ్చాడు.

తెలుగులో మరేకవికీ ఈ పద్యరూపంమీద కానీ, అత్యంత సహజమైన తెలుగు నుడికారంమీదగానీ వేమనకున్నంత అధికారంలేదు. కన్నడంలోని సర్వజ్ఞునిలాగే, వేమనకూడా ప్రజాఛందాన్నీ, వాడుకభాషను వాడ్డంలోనూ, అనుభవపరమైన ప్రాపంచిక జ్ఞానాన్ని అత్యంత శక్తిమంతంగా చెప్పడం లోనూ అద్వితీయమైన ప్రతిభను కనబరిచాడు. అందువల్లే ఇద్దరూ తమ తమ ప్రాంతాల్లో ఇప్పటికీ అంతటి ఆదరణను చూరగొంటున్నారు.

సర్వజ్ఞ, వేమనలు చెప్పిన అభిప్రాయాలు కొన్ని చాలాసమానంగా ఉంటాయి. అది ఒకరినొకరు అనుకరించడంవల్ల కలిగింది కాదు. సంస్కృత సుభాషితాలు వెలువడ్డ అత్యంత ప్రాచీన కాలంనుండి, వ్రాతరూపం పొందని నీతివచనాలు, సూక్తులు జానపద

ప్రపంచంలో కొనసాగివస్తున్న గొప్ప సంప్రదాయముంది. అయితే అలాటివి బహువిరళం కాబట్టి, కవుల మౌలిక ప్రతిభకు అవి అడ్డురావడంలేదు.

ఇద్దరికీ భగవంతుడంటే విశ్వాసమూ, భక్తి ఎక్కువ. అర్థంలేని మతాచారాల విషయంలో, సంప్రదాయాల విషయంలో చూపించే ఆర్భాటాలను, కపటాలను, మూఢనమ్మకాలను, మతం పేరిటసాగే వివక్షను, దోపిడీతనాన్ని, పేదలకు, బలహీనులకు జరుగుతున్న సామాజిక అన్యాయాన్ని, సమాజంలో అగుపించే అలాటి అనేక దురంతాలను వారిద్దరూ తీవ్రంగా ఖండించారు.

ఆడవారిగురించి, ఇద్దరివీ ఒకేవిధమైన అభిప్రాయాలే. స్త్రీల పవిత్రతను ప్రశంసిస్తారు. ఇంటిని మాధుర్యంతో, శోభతోనింపే మంచి, గుణవంతులైన ఇల్లాండ్ర గురించి ప్రశంసిస్తూ పలుకుతారు. వాళ్ళమూలంగా ఈ ప్రపంచమే స్వర్గధామమవుతుందనీ, స్వర్గంలో ఇంతకంటె ఎక్కువ సుఖసంతోషాలుండవనీ ప్రశంసిస్తారు. ఇద్దరూ గయ్యాళులైన భార్యలగురించి జాగ్రత్త చెబుతారు. వేశ్యలగురించి హెచ్చరిస్తూ, ఎన్నడూ వాళ్ళవలలో పడవద్దంటారు.

ఇద్దరు కవులూ, లోభానికి, స్వార్థగుణానికి సరైన విరుగుడు దానగుణమేనని కీర్తిస్తారు.

దుర్జనులు, మూర్ఖుల సాంగత్యానికి వ్యతిరేకంగా సజ్జనుల, జ్ఞానవంతుల, సచ్ఛీలుర సాంగత్యం గురించి వర్ణించడంలో ఇద్దరికీ ఒకేవిధమైన నిరతి.

ఇద్దరు కవులూ వీరశైవులైనప్పటికీ[1] సర్వజ్ఞుడు మాత్రమే వీరశైవ సిద్ధాంతాల్లో అత్యంత ప్రధానమూ, తాత్త్విక ప్రపంచానికి వీరశైవమిచ్చిన కానుకవంటిదీ అయిన షట్‌స్థల సూత్రాన్ని (ఆధ్యాత్మిక సాధనలోని ఆరుదశా పరిణామాలకు సంబంధించిన విధానం) గురించి వర్ణిస్తాడు. అయితే ఇద్దరూ ప్రాథమికంగా మానవతావాదులు. ఏదో ఒక సంకుచిత వర్గ దృక్పథానికి కట్టుబడిపోకుండా విశ్వజనీన దృక్పథాన్ని వెలువరించినవారు. మతతత్త్వాలు ప్రవచించే ప్రేమ, అహింస, దయ, కారుణ్యం,

---

1. ఆభిజ్యాతం చేతకాక అభిమతంచేత వీరశైవులు.

వేమన పుట్టుకతో కాపు-రెడ్డి

అయితే ఎం.ఐ.ఎల్. శీర్షికన సాహిత్య అకాడమీ ప్రచురించిన వి.ఆర్. నార్లగారి వేమన గ్రంథంలో 5వ ప్రకరణంలో, వేమన జన్మతః వీరశైవుడని పేర్కొనబడింది.

దుఃఖితులపట్ల సానుభూతి, దానశీలంవంటి సద్గుణాలను అభిమానిస్తారు. అయితే జాతిరీత్యా, వైదిక విద్వత్తురీత్యా తాము ఇతరులకంటె మిన్న అని భావించే బ్రాహ్మణులను మాత్రం వాళ్లిద్దరూ తీవ్రంగా నిరసిస్తారు. దళితుల, అణగారిన వర్గాల, అందులో సమాజంచేత అస్పృశ్యులని ముద్రవేసి త్రొక్కబడ్డవర్గాల ప్రయోజనాలను పరిరక్షించడానికి పరిశ్రమిస్తారు.

వేమన, సర్వజ్ఞులిద్దరూ అతిస్పష్టంగా దేవుణ్ణి అన్వేషిస్తూ ఎంతోదూరం పోనవసరంలేదనీ, తీర్థయాత్రలు ఆధ్యాత్మిక సాధనలు ఎలాటి అభ్యున్నతినీ కలిగించలేవనీ పేర్కొంటారు. సర్వత్రఉన్న పరమేశ్వరుడు, తనలోనూ ఉన్నాడు. విశ్వాసమూ, అంతశ్శుద్ధీ ముఖ్యంకానీ, ఆలయాలను సేవించడమూ, పవిత్రస్థలాలు దర్శించడమూ ఆత్మసాధనకు ప్రధానం కావంటారు.

ఇద్దరూ మంచి వంటలపై, సంగీతంపై తమకున్న అభిరుచిని ప్రకటిస్తారు.

వేమన, సర్వజ్ఞులిద్దరూ రసవాదాన్ని విశ్వసించినట్లూ, దాని ప్రయోగంలో కొంత జ్ఞానమూ, అనుభవమూ గడించినట్లు అర్థమవుతుంది. వేమనకు జ్యోతిష్యమన్నా, శకునాలన్నా, విధిబలత్తరమన్నా నమ్మకంలేదు. అలాటివాటిని ఆయన చాలా తీవ్రంగా ఖండిస్తాడు. సర్వజ్ఞునికి నమ్మకముండడమేకాదు, వాటిపై ప్రత్యేక శ్రద్ధను కూడా కనబరుస్తాడు. భవిష్యత్సంఘటనలు, కాలజ్ఞానాన్ని చెబుతూ ఆయన చాలా పద్యాలు చెప్పినట్లు తెలుస్తుంది. అయితే అవి ఆయనవేనా, లేక అనంతర నిక్షిప్తాలా అన్నది నిర్ధారణగా చెప్పలేము.

భర్తృహరి[1] మరోలాటివాడు. మంచి వైదుష్యమున్నవాడు. పండితవేద్యుడు. ఈముగ్గురిలా, సామాన్య ప్రజలకు అందుబాటులో, 'ప్రజలకోసం, ప్రజలయొక్క' అన్నట్లు ఉన్నవాడు కాదు. శృంగారశతకం, నీతిశతకం, వైరాగ్యశతకం అనే మూడు శీర్షికల క్రింద ఆయన తన పద్యాలను వ్రాశాడు. అవన్నీ సాంప్రదాయిక శైలిలోనే ఉన్నాయి. సాంప్రదాయిక విభాగాలైన 'పద్ధతుల' క్రింద వివిధ అంశాలమీద ఆయన పద్యాలను రచించాడు. అదే సంప్రదాయాన్ని వేమన, సర్వజ్ఞుల వచనాలను సంకలించివారు కూడా అనుసరించారు. విద్య, సుగుణం, దుర్మార్గం, మూర్ఖులు,

---

1. భర్తృహరి ఏకాలంవాడో నిర్ణయించడంకూడా, సరైన చారిత్రక సాక్ష్యాలు లేకపోవడంవల్ల, చాలా వివాదాస్పదమైన విషయమే. ప్రచారంలోఉన్న కథ ప్రకారం ఆయన క్రీ.పూ. 1వ శతాబ్దివాడు. ఆధునిక విద్వాంసుల అభిప్రాయంలో క్రీ.శ. 11 - 12 శతాబ్దాల మధ్యకాలంవాడు.

సాహసం, విధి, దానం మొదలైన అంశాలపై భర్తృహరి వాక్కులు, సర్వజ్ఞ, వేమన, తిరువళ్లువర్లు చెప్పినవాటిలాగానే ఉన్నాయి. ఆయన కవిత్వంలో అనుభవంనుండి రూపుదిద్దుకొన్న విజ్ఞానం, సామాన్య వ్యవహారంలో ఎదురయ్యే చమత్కారం, హాస్యం కావలసినంత కనిపిస్తాయి. ప్రతీదీ కళాత్మకంగా తీర్చిదిద్దిన పద్యం. స్మృతిలో నిలిచేది, తరచు ఉదహరించగలిగేది.

ఆలా భారతీయ సాహిత్యంలో ఒక వరవడిరూపుదిద్దుకొంది. దాన్ని ప్రకాశింపచేస్తూ వరరుచి, పుష్పదత్త, తిరువళ్లువర్, భర్తృహరి, సర్వజ్ఞ, వేమనలాంటివారు వెలువడ్డారు.

# జీవితంకోసం కళ

సర్వజ్ఞుడు జన్మతః కవి. పద్యాలనల్లడం ఉగ్గుపాలతో నేర్చుకొన్నాడు. మనసులో ఏ ఊహమెదిలినా, ఏభావం కదిలినా, దాన్ని చిలికి సారాన్ని తనకతి ప్రియమైన 'త్రిపది' రూపంలో సునాయాసంగా పెడతాడు. చాలాబాగా సరిపోయే పదాలు అత్యంత సహజంగా దొర్లిపోతాయి. అక్షరం మార్చలేని విధంగా ఆయనలోని శిల్పనైపుణ్యం వాటిని అమరిస్తుంది. సుదీర్ఘంగా చేసిన పరిశీలనకు, సూటిగా దూసుకువచ్చిన సంక్షిప్త అభివ్యక్తి ఆ త్రిపది.

ప్రతిపద్యంలోనూ ఏదో ఒక చమత్కారం, హాస్యం, సున్నితమైన వ్యంగ్యం, ఒక్కోసారి మెత్తని అవహేళన కూడా ఉంటాయి. అయితే ఏహంగూ, ఆర్భాటమూ లేకుండా హృదయాన్ని సోకేలా ఉంటాయి. కొన్ని చాలా గంభీరమైన భావాలు. కొన్ని తేలికైనవి. కాని ఏదీ జీవితంపట్ల గాఢమైన లోచూపుకానీ, మానవ దౌర్బల్యాలపట్ల సానుభూతికానీ లేకుండా ఉండవు.

వాడుక భాషను శక్తిమంతంగా వాడుకోవడంలో కానీ, సహజసుందరమైన భావచిత్రాలను సృష్టించడంలోకాని, సామాజిక న్యాయం కోసం విప్లవాత్మక భావాలను వెలువరించడంలోకానీ, సాంప్రదాయికమైన మతాచారాలను త్రోసిరాజని సాధికారికమైన ఆధ్యాత్మిక అనుభవాన్ని సంభావించడంలోకానీ సర్వజ్ఞుడు పూర్తిగా వీరశైవ సంప్రదాయాన్ని అనుసరించాడు. పల్లెటూరి సూటిదనంతో, హాస్యచమత్కారాలతో, పాండిత్యానికి బదులు సామాన్య అనుభవ జ్ఞానంతో ఆయన జానపద సంప్రదాయానికి దగ్గరగా వస్తాడు. భారతీయ నైతిక కవితాసంప్రదాయంలోని వరరుచి, భర్తృహరి, తిరువళ్లువరు, వేమనలవంటి అత్యుత్తమ కవుల్లో ఆయనా ఒకరు.

సిద్యారంగంలోని విమర్శకులు సర్వజ్ఞుని గొప్పకవిగానో, ప్రథమశ్రేణి కవిగానో పరిగణించక పోవచ్చు. అయితే ఆయన అత్యంత ప్రజాదరణ కలిగిన కవి అనే సత్యాన్నిమాత్రం కాదనలేరు. ఆప్రజాదరణకూడా, గడచిన నాలుగయిదు శతాబ్దాలుగా ఏమాత్రం తగ్గలేదు. తనజీవిత కాలంలో ఎలాటి గౌరవాన్ని పొందాడో, ఇవ్వాళ్టికి కూడా అదేగౌరవాన్ని, మన్ననను పొందుతున్నాడు. సామాన్య ప్రజలు, 'జానపదుల' గుండెల్లో ఇప్పటికీ అదేస్థానం. మరెవరూ దాన్ని పొందలేరు. ఇదంతా ఆయనలోని ప్రతిభవల్లే. ఆ 'త్రిపదుల' ప్రత్యేకతవల్లే. త్రిపదుల జానపదంలో కూడా ఉన్నాయి. అయితే సర్వజ్ఞుని శిల్పంలో అవి సరికొత్తగా, ప్రత్యేకంగా, ఆకవికే స్వంతం అన్నంతగా శోభిస్తున్నాయి. తొలిసారిగా వాటిని విన్నవారు, మరిన్ని వినాలని, కోరుకొంటారు. అదే రూపంలో అమూల్యమైన తన భావాలను మరింతగా అందించమని ఆయనను జనం వత్తిడి చేసిఉండవచ్చు. అర్థం చేసికోవడానికి సులువేకాదు, ఆమాటలు గుర్తుపెట్టుకోవడానికి కూడా చాలా హాయిగా ఉంటాయి. చాలా అందంగా, సరళంగా ఉంటాయి. ధైర్యంగా, ముక్కుసూటిగా ఉంటాయి. అనతికాలంలోనే ఆకవి ప్రసిద్ధుడైవుంటే ఆశ్చర్యమేమి లేదు.

సంక్షిప్తత, సరళత, చాటురీతిలో సంగ్రహత ఆయన శైలిలోని ముఖ్యలక్షణాలు. వాటివల్ల ఆ సద్యసూక్తులను జ్ఞాపకంపెట్టుకొని, కలకాలం వల్లెవేసుకోవడం సులభమయింది. అలా, కన్నడభాషా సంపద పెరుగుదలకు సర్వజ్ఞుడు ఎంతో దోహదంచేశాడు.

సర్వజ్ఞుని త్రిపదులు చాలా ప్రసిద్ధి పొందడంచేత, తదనంతర కవులెందరో అదే రూపం రాయాలని ప్రయత్నించారు. ఆయన పేరిటే, ఆసద్యాలలోనే, తమ అనుకరణలనూ కలిపి తమను తాము ఓదార్చుకొన్నారు. దానివల్ల ఎన్నో ప్రక్షిప్తాలకు అవకాశం ఏర్పడింది. అంతేకాదు, ఆయన సరళి ఒక ప్రత్యేక సంప్రదాయంగా కూడా అభివృద్ధిపొందలేక పోయింది. అది చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అయితే చాలా అసాంప్రదాయికుడైన ఆయనకు, తన పేరిట అలా ఒక సంప్రదాయం రూపొందక పోవడం ఆనందాన్నే కలిగించి ఉంటుంది. ఫలితంగా సర్వజ్ఞుడొక్కడే ప్రత్యేకంగా, విడిగా, 'త్రిపది' సామ్రాట్టుగా మిగిలిపోతున్నాడు.

హేతువాది కావడంవల్ల, ఆయన రచనల్లో భావావేశంకంటె హేతువాదానికే ప్రాధాన్యం. ఏ పద్యమూ ప్రయత్నపూర్వకంగా, పట్టుబట్టి తీర్చిదిద్దిందికాదు; పాడితర్కంతో యాంత్రికంగా కూర్చిందికాదు.

ఆయన పంక్తుల్లో అధికభాగం స్వాస్యకరమైన సూక్తులే. అవి ఏమాధ్యరకం వాళ్ల చేతుల్లోనో పడివుంటే పేలవంగా, నిసుగెత్తించేవిగా తయారైఉండేవి. అయితే సర్వజ్ఞని అద్భుత స్పర్శతో అవి అందమైన, ఆకర్షణీయమైన సూక్తులుగా మారి కన్నడంలోని చాటువుల, సామెతల భాండాగారాన్ని మరింత సంపన్నవంతం చేశాయి. అక్కడక్కడ ఆయన నుడికారంలో తెచ్చిన కొత్తమలుపులూ, భావంలో చూపిన విచిత్ర వక్రతలు, వాటి వ్యంగ్య వైభవాన్ని మరింత శక్తిమంతంగా ప్రకాశింపచేశాయి.

ఆయన వచనాల్లో సహజమైన ఉపమానాలు, అలంకారాలు దర్శనమిస్తాయి. ఆయన వ్యావహారిక జ్ఞానం మనకు చిరపరిచితమైన అంశాలనుంచే చిత్రమైన ప్రతిమలను నిష్పన్నం చేస్తుంది. వాటి మూలంగా ఆయన కవితా వైభవం, అలంకారిక ప్రాశస్త్యం ఇంకా పెరుగుతుంటాయి. ఉదాహరణకు పొడుపుకథలా కనిపించే ఈపద్యాన్ని చూడవచ్చు :

''కల్లరిళి హూవాగి ఎల్లరిగె బేకాగి
మల్లికార్జునశిఖరక్కె బెళకాగి
బల్లవరు హేళి సర్వజ్ఞ''

''రాళ్లలో పువులాగ ఎల్లరికి వలయునేది
మల్లికార్జున శిఖరానికి వెలుగయ్యెడిదేది
అల్ల తెలిసినవారు చెప్పుడో సర్వజ్ఞ.''

ఈ పొడుపుకథ, రాళ్లలో పూసిన తెల్లని మెత్తని పువ్వుకు సంబంధించింది. దాన్నివాడి మల్లికార్జున ఆలయ గోపురానికి తెల్లని పూత పూస్తారు. సూటిగా ఈ పొడుపుకథకు సమాధానం చెప్పాలంటే, వెల్లవేయడానికి వాడే సున్నమని అర్థం.

అయతే 'మల్లికార్జున శిఖరానికి' అనడంతో, మల్లికార్జున శబ్దానికి 'మచ్చలేని మల్లెల తెల్లదనం' అనే అర్థం కావడం వల్ల, ఈమాట అలంకారికమై, ఒక అందమైన భావచిత్రం ఏర్పడుతుంది. మెరిసే కాంతి ఉద్దీడుకొనే హిమాలయం కళ్లముందు కదలాడుతుంది. ఆధ్యాత్మిక సాధనలో వికసించిన పరిశుద్ధ ఆత్మగల సాధుపుంగవుణ్ణి స్ఫురింప చేస్తుంది. లౌకిక వ్యవహారాల్లో రాతిలా గడ్డకట్టినవాడు, ఇప్పుడొక జ్యోతిస్స్వరూపంలా వికసించాడు. సున్నంలా తెల్లగా దివ్యత్వానికే పైపూతగా యోగ్యత పొందుతాడు. అదొక శివయోగి భావచిత్రం. ఆత్మశుద్ధితో పరమేశ్వరుని శరణు పొందిన యోగిచిత్రం.

వాడుకభాషతోనే ఉత్తమ కార్య ప్రయోజనాన్ని సాధించడంలో, భావచిత్రాలను సృష్టించడంలో, సమకాలీన అవసరాలకు స్పందించే సామాజిక ప్రజ్ఞలో, సర్వజ్ఞుని ఆధునిక కవిత్వానికి వైతాళికునిగా గుర్తించవచ్చు.

మంచి అభిరుచి ఉన్నవారు మాట్లాడే మాటల్లోని మాధుర్యం సర్వజ్ఞునికి తెలుసు. ఒక త్రిపదిలో ఇలా అంటాడు.

*''రసిక నాడిద మాతు శశియదిసి బందంతె*
*రసికనల్లదన బరి మాతు కివిగె కుర్-*
*దసియ బడిదంతె సర్వజ్ఞ''*

''రసికుడాడెడు మాట శశికాంతి తెరగాయె
రసికుడుగాని నరు పల్కు చెవిలోకి ది
వినెడి చీలయౌగాదె సర్వజ్ఞ.''

మొదటి చరణాల్లో వర్ణించింది సర్వజ్ఞుని మాటలకే చక్కగా సరిపోతుంది. శివ శరణ సంప్రదాయానికి చెందిన సర్వజ్ఞునికి, పలుకే పరమేశ్వరుడనే విషయం గుర్తుండాలి. మాటలకు అపచారంచేసే వారినెవర్నీ ఆయన మన్నించడు. మనోవాక్కర్మలలో ఏకత్వమూ, శుచి ఉండాలి.

సర్వజ్ఞుడు కన్నడంలో ఓ సుభాషితకారుడు. ఏ మూర్ఖత్వమూ ఆయన దృష్టిని తప్పించుకోలేదు. దైనందిన జీవితానికి పనికివచ్చే ప్రతి అంశం మీదా, ఆయన మనకు అనుగ్రహించేది కొంతఉందనే సత్యాన్ని ఆయన ప్రతి పద్యమూ స్పష్టం చేస్తుంది. ఆ అనుగ్రహంకూడా మంచి హాస్యంతో కూడి ఉంటుంది. మానవ మూర్ఖత్వాన్ని చూసి చిర్నవ్వు నవ్వుతూనే ఆయన చెబుతాడు. కట్టెతీసికొని కొట్టవస్తున్నట్లున్నా ఆ చిర్నవ్వు చెరగిపోదు.

మానవజాతిని, సమాజాన్ని సంస్కరించి, మంచి మార్పును తేవడమే ఆయన జీవితాశయం. అందులోనూ సామాన్య జనులను వివేకవంతులను చేయడమే ఆయన ఉద్యమం. మానవుడు తన అజ్ఞానం కొద్దీ కల్పించుకొనే దురాచారాలపట్ల, సామాజిక అన్యాయాలపట్ల, అసమానతలపట్ల, అహంకరించి ఏర్పరచుకొన్న కుల, వర్గ వివక్షతలపట్ల ఆయన తీవ్ర నిరసనను వ్యక్తపరిచాడు. బడితెల్లాంటి కవితలతో వాటిపై దాడిచేశాడు. ఆయనకు దాపరికంలేదు. దుర్మార్గం ఎక్కడున్నా, ఏరూపంలోఉన్నా

ఖండించాడు. అదే సమయంలో, ఏవ్యక్తిలో, వస్తువులో, స్థలంలో మంచి కనిపించినా మనసారా అభినందించాడు.

సర్వజ్ఞుడు తీవ్రంగా ఖండించి, అవహేళన చేసిన వాటిల్లో కపటత ఒకటి. ఈ లౌకిక ప్రపంచంలో కపటుల గురించి జాగ్రత్తగా ఉండాలి. ఆధ్యాత్మిక ప్రపంచంలో మరింత జాగరూకత కావాలి. తన్నుతాను వంచించుకోవడానికి కాపట్యమే కారణమవుతుంది. అదే సామాజిక స్థాయిలో మోసంగా పరిగణింపబడుతుంది. నిజమైన విశ్వాసం, భక్తి లేకుండా అర్చనాది మత విధులను పాటించి ఏం ప్రయోజనం ? ఆధ్యాత్మిక అభ్యున్నతికి సాయపడని అలాటి వాటివల్ల, సమయం, ధనం అంతా వృథా అవుతున్నాయి.

పసిబిడ్డల్లా నమ్మే ప్రజలను గురువుల్లా, విజ్ఞానధనులై సాధువుల్లా నటించి ఎందరో నిత్యం మోసగిస్తున్నారు.

సర్వజ్ఞుడు ప్రధానంగా మానవతావాది. లౌకిక ప్రపంచంపట్ల ఆయన దృక్పథం హేతుబద్ధమైంది, మతాతీతమైంది. ఆధ్యాత్మిక విషయాల్లోకి వచ్చినప్పుడు ఆయన వాటి పరిమితుల్ని దాటిపోతున్నాడు. ఆయనను హేతుబద్ధమైన మార్మికయోగిగా పిలవడం మరింత బాగుంటుంది. ఆయన ఆధ్యాత్మిక అనుభవాన్ని వివరించే పద్యాలెన్నో ఉన్నాయి. అయితే ఆయన ఋషికాడు. మార్మిక దర్శనాలను వర్ణించడు. ఆయన పద్యాలలో మూడు విధాల అనుభవాలను గుర్తించవచ్చు. మొదటిది ధార్మికగ్రంథాల, దర్శనశాస్త్రాల సన్నిహిత పరిచయంవల్ల కలిగింది. రెండవది - ప్రపంచాన్ని, మానవ ప్రకృతిని అర్థంచేసికొన్నందువల్ల కలిగింది. మూడవది - ఆత్మ ప్రకాశంలోనుండి రూపొందినది.

తరచు మెరుపుల్లా కొన్ని పద్యాలలో వైయక్తిక అంశాలు కనిపిస్తాయి. ఎక్కువ భాగం ఆయన పద్యాలు వస్తునిష్ఠమైనవే. ఆధ్యాత్మిక సాధనలో వీరశైవం బోధించే షట్‌స్థలాలంటే ఆయనకు అభిమానమూ, చక్కని పరిజ్ఞానమూ ఉన్నప్పటికీ, వాటి సారాన్ని గాఢంగా అనుసరించేవాడైనప్పటికీ, ఇతర మతాలలోని మంచినికూడా ప్రశంసిస్తాడు. ఉదాహరణకు జైనం ప్రబోధించే అహింసను ప్రస్తుతిస్తాడు. సారాన్ని వదలి బాహిరమైన ఆచారాలకు పెద్దపీట వేసినప్పుడు, వీరశైవాన్ని కూడా ఆయన ఎగతాళి చేయకుండా వదల్లేదు. అలాగే అన్ని మతాల్లోని బాహిక చిహ్నాలను, సంకేతాలను, ఆచారాలను అవహేళన చేశాడు. ఆవిధంగా ఆయనదొక ఆధ్యాత్మిక అంతర్దృష్టితో కూడిన హేతువాద దృక్పథం.

సంఘసంస్కర్తగా, ఆయన 12వ శతాబ్దంలోని శివశరణుల్లా ఒక విప్లవవాది. తన

విమర్శనాత్మక పరిశీలన నుండి ఆయన ఎవర్నీ మినహాయించడు. అయినా ఆయన పొందిగ్గా తీర్చిన పద్యాలను, బసవేశ్వరుడు మొదలైన వచనకారుల ప్రవచనాలతో సరిపోల్చడానికి వీలుకాదు.

బసవేశ్వర, అల్లమప్రభువంటివారి వచనాలు ప్రగాఢమైన భావగాంభీర్యంతో ఉంటాయి. లోతైన మనసు పొరలను, ఎత్తైన చైతన్య దశలను స్పృశిస్తాయి. కాని సర్వజ్ఞుడు ఎక్కువగా నైతిక స్థాయిలోనే ఆగిపోతాడు. చాలా అరుదుగా మాత్రమే, మార్మికమైన లోతుల్లోకి వెళ్తాడు. అయినా తనరీతిలో తాను ప్రముఖంగా నిలుస్తాడు. కేవలం నిర్మమతతో వ్యక్తి నిష్ఠగా ఉండడంలో ఆయనకు ఆయనే సాటి. 'తన'కు సంబంధించిన సమస్తాన్ని, చివరకు వైయక్తికమైన పేరును త్యజించడంలో కూడా తనకు మరొకరు సాటి లేకుండా ఆయనొక్కడే ప్రత్యేకంగా నిలిచిపోయాడు.

ఆయన పేర్కొన్న విశ్వజనీన మానవ మౌల్యాలలో, వైయక్తికమైనవీ ఉన్నాయి. సామాజికమైనవీ ఉన్నాయి. అందులో సర్వోత్కృష్టమైనవి సత్యమూ, దానధర్మాలే. సత్యాన్ని మాత్రమే పలకడంచేత అన్ని ప్రధాన సుగుణాలను పొందినట్లవుతుంది.

జీవితాన్ని గురించిన వాస్తవ చిత్రాన్ని ఇస్తూ, లోభమూ, ధనాశ మనుష్యుల మనస్సుల్ని ఎలా చెరచివేస్తాయో, బలహీనుల్ని ఎలా సర్వవ్యసనాల పాలుచేస్తాయో వివరిస్తాడు :

''నుడిసువుద సత్యవను కెడిసువుద ధర్మవను
ఒడలనే కట్టి హిడువుదు లోభద
గడణ కానయ్య సర్వజ్ఞ''

''నుడివెడిది అసత్యము, చెడిచెడిది ధర్మము
కడుపునెండగట్టి విడుచు లోభపు
గడన యిదె చూడయ్య సర్వజ్ఞ''

కనకం - ధనం మీద ఆశకూడా అలాటిదే :

''యతియ తపగళు కెడుగు సతియ పతివ్రత కెడుగు
మతివంతరెల్ల బ్రమెగళొగు హొన్నెంబ
శ్రుతియకేళిదరె సర్వజ్ఞ''

''యతుల తపములచెడు, సుతుల పాతివ్రత్యముజెడు
మతిమంతురెల్లరు భ్రమపాలౌదురు, పసిడియన్న
శ్రుతిని విన్నంతనే సర్వజ్ఞ''

అలాంటి దుర్గుణాలవల్ల ప్రజలను హెచ్చరికగా ఉండమనే కవి, స్వయంగా తాను మనోనిగ్రహాన్ని, నైతిక దారుఢ్యాన్ని నిలుపుకొవడంలో జాగ్రత్తగానే ఉండి ఉంటాడు. దీనికి ఈడైనది, ఆయన శక్తిమంతమైన శైలి. కావ్యసమయాలకు, నియమాలకు దూరంగా ఉండే నిరలంకారమైన శైలి.

''ನರೆಬಂದ ಮುದುಕನಿಡಿ ದುರುಳ ಜವ್ವನೆಯೇಕೆ
ಕುರುಡ ಲದ್ದುಗೆಯ ಹೊರಗರಿಸಿ ತಾ ನಾಡ
ತಿರಿಯ ಹೋದಂತೆ ಸರ್ವಜ್ಞ''

''జడ్డు ముసలివానికి జాణయౌ జవ్వనిఏల ?
గ్రుడ్డివాడు అడ్డాల తగదాచి తా
నెడ్డయై తిరిపెమునకు బోయినట్లు సర్వజ్ఞ''

''ಪ್ರತ್ಯಕ್ಷ ಉರಗನ ಮಸ್ತಕದ ಹಲುನಂಜು
ಮಿಥ್ಯದುರ್ಜನರ ಹೊಲೆಕಾಯವಾಪಾದ
ಮಸ್ತಕವು ನಂಜು''

''ప్రత్యక్షమే ఉరగమస్తకమున విషము- అ
సత్యదుర్జనులలో కాయమాపాద
మస్తకము విషమె''

''ಉದ್ಯೋಗವುಳ್ಳವನ ಹೊದ್ದುವುದು ಸಿರಿಬಂದು''

-''ఉద్యోగమున్నవారి పొత్తుకు సిరివచ్చు''

''ಕೊಡುವಾತನೆ ಮೃಡನು ಸಡೆವಾತನೆ ನರನು
ಒಡಲ ಒದವೆಗಳು ಕೆಡೆದು ಹೋಗದ ಮುನ್ನ
ಕೊಡು ಪಾತ್ರನ ರಿದು''

''ఇడెడివాడు మృడుడు, కొనెడివాడు నరుడు
ఒడల సత్త్వముల్, చెడిపోక మునుపె
ఇడుడు పాత్రు లరసి''

''ಸತ್ಯವನು ಅರಿದಿಯರೆ ಸತ್ತಹೋಗಿರಬೇಕು''

- సత్యము తెలిసినవారు, చచ్చినవారివలె నిశ్శబ్దంగా ఉంటారు.

''ತನ್ನತಾನರಿದಗೆ ಭಿನ್ನಭೇದಗಳಿಲ್ಲ''

- తన్నుతాను తెలిసికొంటే, భిన్న భేద భావాలుండవు.

''ಸೊಡರು ಲಂಚವ ಕೊಂಡು ಕೊಡುವು ದೊಪ್ಪಚ್ಚಿ ಬೆಳಗ
ಪೊಡವಿಗೆ ಸೂರ್ಯ ಬೆಳಗಿವ ಲಂಚವ
ಹಿಡಿಯನವ ಧರ್ಮಿ ಸರ್ವಜ್ಞ''

''మట్టిదీపము లంచమంది కొద్దివెలుగిచ్చు
అట్టిదేదియులేక సూర్యుడు జగతికి వెలుగిచ్చు, లంచము
పట్టనివాడే నిజమైన ధర్మి సర్వజ్ఞ''

''ದಾನದ ಫಲದಿಂದೆ ಶ್ರೀನಾಥನಾಗುವನು
ಭಾನು ಮಂಡಲವನೊಡದಂಬಳ ಸ್ವರ್ಗಕ್ಕೆ
ತಾನೊಡೆಯ ಹನಹನು ಸರ್ವಜ್ಞ''

''దానఫలమున శ్రీనాథుడగును
భానుమండలముమీరు అమల స్వర్గమ్మునకు
తానొడయడగుధనశాలి సర్వజ్ఞ''

''ఆడదె .మాడుసను రూఢి యొళగుత్తమను''

- మాటాడక చేయువాడు రూఢిలోనుత్తముడు.

''ఆళాగ బల్లనను ఆళువను అరసాగి''

- పాలితుడైనవాడు పాలించు రాజయి.

సర్వజ్ఞుని పద్యాల్లో కనిపించే సూక్తుల్లో ఇవి కొన్ని. వాటినల్ల విదితమైనట్లు ఆయన క్రియాశీలు డయిన తత్త్వవేత్త, ప్రపంచాన్ని బహునిశితంగా పరిశీలించేవాడు. నిష్పక్షపాతమూ, ధైర్యమూ కలిగిన విమర్శకుడు. అయితే సాధారణమైన మానవ బలహీనతలపట్ల కరుగ్గా ఉండడు. మెత్తటి హాస్యంతో, మృదువైన అధిక్షేపంతో వాటిని చూస్తాడు. మూర్ఖత్వం, ఆడంబరం, లోభం, పిసినారితనం వంటి మానవ బలహీనతలను అవహేళన చేస్తున్నప్పుడు కూడా, ఏదుర్గుణం గురించి అయినా వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నప్పుడు కూడా ప్రతివారిపట్ల సానుభూతిని, మానవత్వంపట్ల ప్రేమను ప్రదర్శిస్తాడు. ఎప్పుడూ తీవ్రంగా ఉండడు. అన్నిలోపాలున్నప్పటికీ ఈప్రపంచాన్ని, ఈ జీవితాన్ని ఆయన ప్రేమిస్తాడనేది యధార్థం. సాటి ప్రజానీకపు జీవితాన్ని మెరుగుపరచి, వారిని ఉన్నతులను చేయాలన్నదే ఆయన సంకల్పం. దానికోసం అనువైన మాధ్యమం మాత్రమే కవిత్వం. 'కళకళకోసమే' వంటి మాటలను ఆయన విశ్వసించడు. ఆయన దృష్టిలో కళ జీవితం కోసం, జీవితం కళా, సాహిత్యాలకంటె చాలా ఉన్నతం.

# ఆధారగ్రంథ సూచి

## కన్నడం


అక్బర్ ఆలి, ఎం. (1983), సర్వజ్ఞ సమాజ దర్శన, మత్తు సాహిత్యసత్వ, కన్నడ సాహిత్య పరిషత్, బెంగళూరు

ఉత్తంగి చన్నప్ప (సం.) (1924), సర్వజ్ఞవచనగళు

ఉమాపతి శాస్త్రి, జి.ఎం. (సం.) (1973), సర్వజ్ఞమూర్తియ వచనగళు, శారదా భవన ప్రకాశన, బాగల్‌కోట

కృష్ణశాస్త్రి, ఎ.ఆర్. (1969), సర్వజ్ఞకవి, మైసూరు విశ్వవిద్యాలయం, మైసూరు.

చిత్రకోర (1934), సర్వజ్ఞ సందేశ

నాయక్, హెచ్.ఎం. (సం.) (1976), సర్వజ్ఞ కన్నడ అధ్యయన సంస్థ, మైసూరు విశ్వవిద్యాలయం, మైసూరు.

బసవరాజు, ఎల్. (సం.) (1972), పరమార్థ, బెంగళూరు విశ్వవిద్యాలయం

మరియప్ప భట్, ఎం. (సం.) (1971), సర్వజ్ఞన వచన సంగ్రహ, సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ.

వెంకటరామప్ప. కె. (1962), వేమన, మైసూరు విశ్వవిద్యాలయం, మైసూరు.

సవ్యసాచి (1978), తిరువళ్లువర్, రాష్ట్రోత్థాన పరిషత్, బెంగళూరు

శివమూర్తి శాస్త్రి, బి. (సం.) (1975), సర్వజ్ఞ వచన సంగ్రహ, చతుశ్శతాబ్ది ఉత్సవ సమితి, కర్ణాటకరాజ్య, బెంగళూరు.

శివరుద్రప్ప, జి.ఎస్ (సు). (1975) సర్వజ్ఞ, ఒందు సమీక్షె, బెంగళూరు విశ్వవిద్యాలయం.

## ఇంగ్లీషు

Narla, V.R., (1969), Vemana, M.I.L Series, Sahitya Akademi, New Delhi.

Rangachar, S. and Srinivasachar, R. (Eds.) (1958) Bhatruhari's Neethi Satakam, Sanskritha Sahitya Sadana, Mysore.

Seshagiri Rao, D. (Tr.) (1978) Anthology of Sarvajna's Sayings, Kannạda Sahitya Parishat, Bangalore.

Srinivasan, Kasturi (Tr.) (1969) Tirukkural : An Ancient Tamil Classic, Bharatiya Vidya Bhavan, Bombay.

Papers and Articles

## కన్నడం

చన్నవీర కణవి (1969), ''సర్వజ్ఞ : హొలబరితు హొత్తిగొదుగువ మాతు'', (సాహిత్యచింతన), ఆనంద పబ్లికేషన్స్, ధార్వాడ

తిప్పేరుద్ర స్వామి, హెచ్. (1968), ''సర్వజ్ఞకవి'' (కర్ణాటక సంస్కృతి సమీక్షె), డి.వి.కె. మూర్తి, మైసూరు.

బసవరాజు, ఎల్. (1912), ''సర్వజ్ఞునిగొబ్బనె ఒబ్బలిఖిత శిష్య'' (ప్రబుద్ధకర్ణాటక, సం. 54, అం. 3)

మాల్వాడ్, ఎస్.ఎస్. (1970) (అ) ''సర్వజ్ఞ కవియ జన జీవన చిత్రణ'';

(ఆ) ''సర్వజ్ఞకవి'', (సాహిత్యసంగమ) జయ ప్రకాశన, ధార్వాడ.

ముగళి. ఆర్.ఎస్. (1964), ''సర్వజ్ఞ'', (కన్నడ సాహిత్యచరిత్రె), ఉషాసాహిత్యమాల, మైసూరు.

117709
20/12/04

కర్ణాటక సాంస్కృతిక పారంపర్యానికే గర్వము చేకూర్చిన చిరస్మరణీయులైన వచన కవి ''సర్వజ్ఞ''. 'విశ్వకుటుంబిగా'గా తనను తాను చాటుకుని, ''త్రిపదులు''గా వచన కావ్యాలను రచించిన ''త్రిపదియ త్రివిక్రమ'' అనిపించుకున్నాడు.

''సర్వజ్ఞ'' జీవనచరిత్రను డా॥ కె.బి. ప్రభుప్రసాద్‌గారు కన్నడంలో రచించారు. అకాదెమీ దీనిని ''భారతీయ సాహిత్య నిర్మాతలు'' అన్న శీర్షిక క్రింద ప్రచురించినది. ఈ గ్రంథాన్ని, డా॥ జి. లక్ష్మీనారాయణగారు (డీన్, విజ్ఞాన వికాస పీఠం, తెలుగు విశ్వవిద్యాలయం) తెలుగులోకి అనువదించారు. ''త్రిపదుల'' అనువాదాన్ని కూడా చాల రమ్యంగానూ, కావ్య ప్రౌఢిమతోనూ చేసారు.

**Sarvajna (Telugu)** **Rs.25/-**

**ISBN : 81-260-07036**

Library IIAS, Shimla
TL 891.481 410 92 Sa 77 P
00117709